


www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

గురువారం
04-07-2024

సంపుటి : 01 | సంచిక : 61 | పేజీలు : 12 | వెల : 5/-

తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




# ఆశావహులకు బిగ్ షాక్?

## టీపీసీసీ చీఫ్, కేబినెట్ విస్తరణకు బ్రేక్?

అధ్యక్ష పదవిపై నేతల మధ్య కుదరని ఏకాభిప్రాయం

మంత్రివర్గంలో చోటు కోసం ఆశావహుల సంఖ్య పెరగడమే కారణం

ఢిల్లీ నుంచి వెళ్లిపోయిన మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్

మరో వారం రోజులు రాహుల్ గాంధీతో భేటీకి నిర్ణయం?



“ కాంగ్రెస్ పార్టీ ఆశావహులకు గట్టి షాక్ తగిలింది. ఇటు పీసీసీ చీఫ్, అటు మంత్రివర్గ విస్తరణ ఒకేసారి వాయిదాపడింది. దీంతో గత వారం, పది రోజులుగా ఢిల్లీలో తిష్టవేసి లాబీయింగ్ చేస్తున్న తెలంగాణ లీడర్లకు చుక్కెదురైంది. నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం, మంత్రివర్గంలో చోటు కల్పించే ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటం కారణంగా కేబినెట్ విస్తరణ, పీసీసీ నియామకం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. వారం పది రోజుల తర్వాత మరోసారి దీనిపై చర్చించాలని నిర్ణయం తీసుకున్నట్టు ఏఐసీసీ వర్గాలు పేర్కొన్నాయి.

2

# డిప్యూటీ సీఎంలు వద్దా..?

భేటీ కానున్న తెలుగు రాష్ట్రాల సీఎంలు

తొలిసారి ఇద్దరి నేతలు సమావేశం

రెండు రాష్ట్రాల విభజన సమస్యలపై చర్చలకు రెడీ

డిప్యూటీ సీఎంలకు ఇన్విటేషన్ ఉందా? లేదా?

హాట్ టాపిక్‌గా సీఎంల భేటీ



**విశ్వంభర, హైదరాబాద్:**

తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి, చంద్రబాబు నాయుడు తొలిసారి భేటీ అవుతున్నారు. దీనికి సంబంధించి ఈ నెల 6వ తేదీన సమయం నిర్దేశించారు. అయితే, ఆ రోజు నుంచే ఆషాఢ మాసం ప్రారంభం అవుతోంది. దీంతో తొలి భేటీకి ముహూర్తం చూసుకున్నారా లేదా? అనే ప్రశ్నలూ సంప్రదాయాలను పాటించే వారి నుంచి వస్తున్నాయి. మరిప్పుడు సీఎంల భేటీ వేదిక ఎక్కడా? అని పరిశీలిస్తున్నారు. సమావేశం జరిగేది 'ప్రజా భవన్' అని తెలిసి కొన్ని ప్రశ్నలు వేస్తున్నారు.

**జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో..**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎంతో ముచ్చటపడి ఏడు ఎకరాల్లో ప్రగతి భవన్ కట్టించారు. అందులోనూ దాదాపు ఏడెనిమిదేళ్లు ఉన్నారు. అంతకుముందు ఉమ్మడి ఏపీలో సీఎంగా పనిచేసిన రాజశేఖర్ రెడ్డి ఉన్న భవనాన్ని అలాగే ఉంచి.. మరొక పెద్ద భవనం కట్టించుకున్నారు కేసీఆర్. గత ఏడాది డిసెంబరు 3న ఎన్నికల ఫలితాల అనంతరం సాయంత్రానికే అక్కడినుంచి వెళ్లిపోయారు.

మిగతా2లో...

# సమైక్య వాదానికి సింబాలిక్ చంద్రబాబు

- ఆయననే ఎదిరించి నిలబడ్డాం.. ఇదో లెక్కా..?
- బీఆర్ఎస్ విజయ ప్రస్థానంలో ఈ ఓటమితో దిష్టి తీసినట్టయింది
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు వచ్చాయి
- ఎర్రవెల్లి ఫామ్ హౌస్‌లో పార్టీ నాయకులతో మాజీ సీఎం కేసీఆర్

2





## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కేసు

- నూతన చట్టాలను ప్రయోగించిన పోలీసులు
- కరీంనగర్‌లో పాడి కౌశిక్ రెడ్డిపై, ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై కేసు నమోదు

2








## సొంతగూటికి కేకే

- ఢిల్లీలో ఖర్గే సమక్షంలో చేరిన కేశవరావు
- హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, కేసీ వేణుగోపాల్, దీపదాస్ మున్షీ
- కేకేను అభినందించిన రాహుల్
- కే.కేశవరావుకు రాజ్యసభ టికెట్ కన్ఫామ్?

2

పూణెలో జికా వైరస్

## కలకలం

అన్ని రాష్ట్రాలకు కేంద్రం అలర్ట్

గర్భిణీ స్త్రీలకు వైరస్ పరీక్షలు చేయాలంటూ ఆదేశం



2



2

సెయిలింగ్ పోటీలు

## ప్రారంభం

అట్టహాసంగా ఈ ఏడాది కూడా ప్రారంభం

సాగర తీరంలో వారం రోజులు సెయిలింగ్ పోటీలు

చివరి రోజున విజేతలకు అవార్డులు

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి



3

## న్యాయవాది సకినాల రవికుమార్ యాదిలో

- సకినాల అకాల మరణం బాధాకరం
- రవి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం
- సంస్మరణ సభలో డాక్టర్ కాచం సత్యనారాయణ
- న్యాయవాదిలో సకినాల రవి కుమార్ సేవలను గుర్తు చేసుకున్న వక్తలు

“ మంచితనానికి మారుపేరుగా, మృదుస్వభావిగా, అందరితో కలివిడిగా ఉండి ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి సకినాల రవి కుమార్ అకాల మరణం పొందడం బాధాకరమని V3 న్యూస్ ఛానల్ చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ అన్నారు. బుధవారం మలక్‌పేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన సకినాల రవికుమార్ సంస్మరణ సభలో డాక్టర్ కాచం సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు.



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 112 | ₹ 134 |
| స్కిన్ | స్కిన్‌లెస్ |
| ₹ 194 | ₹ 221 |

## ఆశావహులకు బిగ్ షాక్?

**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ ఆశావహులకు గట్టి షాక్ తగిలింది. ఇటు పీసీసీ చీఫ్, అటు మంత్రివర్గ విస్తరణ ఒకేసారి వాయిదాపడింది. దీంతో గత వారం, పది రోజులుగా ఢిల్లీలో తిష్టవేసి లాబీయింగ్ చేస్తున్న తెలంగాణ లీడర్లకు చుక్కెదురైంది. నేతల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం, మంత్రివర్గంలో చోటు కల్పించే ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటం కారణంగా కేబినెట్ విస్తరణ, పీసీసీ నియామకం తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. వారం పది రోజుల తర్వాత మరోసారి దీనిపై చర్చించాలని నిర్ణయం తీసుకున్నట్టు ఏఐసీసీ వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణ పీసీసీ నియామకంలో బీసీలకు అవకాశం కల్పించాలని అభిప్రాయానికి వచ్చిన ఎవరికి ఇవ్వాలో నిర్ణయించడానికి కొంత సమయం పడుతుందని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండింటిపై నిర్ణయం తీసుకోవడం కన్నా కొంత సమయం వరకు వేచి ఉండి ఆ తరువాతే చర్చిస్తే మంచిదని కాంగ్రెస్ అగ్రనేతలు కొందరు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మల్లికార్జున ఖర్గే కర్ణాటక వెళ్లిపోగా, కేసీ వేణుగోపాల్ కేరళ వెళ్లిపోయినట్టు సమాచారం. పీసీసీ అధ్యక్షుడు నియామకంతోపాటు కేబినెట్ విస్తరణపై కసరత్తు కొలిక్కిరాలేదని సమావేశానికి హాజరైన కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీల సమక్షంలో జరిగిన కీలక భేటీలోనూ ఏకాభిప్రాయం రాలేదని నేతలు అంటున్నారు. ఈ విషయంలో ఇప్పటికే నేతల అభిప్రాయాలను పార్టీ అధిష్టానం అడిగి తెలిసుకున్నట్టు తెలుస్తోంది. మరోమారు పార్టీ నేతలతో చర్చల ప్రక్రియ ప్రారంభించాలనే యోచనలో కాంగ్రెస్ అధిష్టానం ఉన్నట్లు సమాచారం.

## పూణెలో జికా వైరస్ కలకలం

**విశ్వంభర, హైదరాబాద్:** మహారాష్ట్రలోని పూణెలో జికా వైరస్ కలకలం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదయ్యాయి. ఈ వైరస్ బారిన పడినవారిలో ఇద్దరు గర్భవతులు కూడా ఉన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. మహారాష్ట్రలో జికా వైరస్ కేసుల దృష్ట్యా అన్ని రాష్ట్రాలకు అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా గర్భిని స్త్రీలకు వైరస్ పరీక్షలు నిర్వహించాలని అన్ని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. పాజిటివ్ తేలిన తల్లుల పిండాల పెరుగుదలను పర్యవేక్షించడం ద్వారా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కోరింది. ఇంటి ఆవరణలో ఏడిస్ దోమలు లేకుండా చూసేందుకు నోడల్ అధికారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని సూచించింది. నివాస ప్రాంతాలు, కార్యాలయాలు, పాఠశాలలు, నిర్మాణ స్థలాలు, సంస్థలు, ఆరోగ్య సౌకర్యాల్లో కీటకాలు లేకుండా నిఘా పెంచాలని, నియంత్రణ కార్యకలాపాలను తీవ్రతరం చేయాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. కాగా, జులై 1న పూణెలో ఇద్దరు గర్భిణులు సహా ఆరుగురికి జికా వైరస్ పాజిటివ్ తేలిన విషయం తెలిసిందే. నగరంలోని అరంద్వానే ప్రాంతంలో నాలుగు, ముంద్వా ప్రాంతంలో రెండు కేసులు నమోదయ్యాయి. రాష్ట్ర ఆరోగ్యశాఖ తెలిపిన వివరాల ప్రకారం అరంద్వానేలో మొదటి కేసు నమోదయింది. 46 ఏండ్ల డాక్టర్ తొలుత జికా వైరస్ బారిపడ్డారు. అనంతరం అతని కుమార్తె (15)కు వైరస్ సోకినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. వీరిద్దరితోపాటు ముంద్వాకు చెందిన ఇద్దరి రిపోర్టులు పాజిటివ్‌గా వచ్చాయి. ఈ నాలుగురితోపాటు అరంద్వానేకు చెందిన ఇద్దరు గర్భిణులకు జికా వైరస్ సోకినట్లు వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. జికా వైరస్ సోకిన ఆడ ఎడిస్ దోమ కుట్టడం వల్ల వ్యాధి సంక్రమిస్తుంది. ఈ వైరస్‌ను తొలిసారి 1947లో ఉగాండా అడవుల్లోని ఓ కోతిలో గుర్తించారు. ఆ తర్వాత ఆఫ్రికన్ దేశాలతోసహా భారత్, ఇండోనేషియా, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్, వియత్నాం లాంటి ఆసియా దేశాలకూ ఈ వ్యాధి వ్యాప్తి చెందింది. ఈ వైరస్ సోకినవారిలో జ్వరం, చర్మంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, జీర్ణకోశ సంబంధ సమస్యలు, గొంతు నొప్పి, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

## సమైక్య వాదానికి సింబాలిక్ చంద్రబాబు



**విశ్వంభర, మెదక్ :** రెండున్నర దశాబ్దాల బిఆర్ఎస్ ప్రస్థానంలో ప్రతి అడుగులో అద్భుతమైన విజయగాథలే తప్ప అపజయ గాథలు లేవని, తెలంగాణ సాధన కోసం బయలుదేరిన నాటి వ్యతిరేక పరిస్థితులనే తట్టుకుని నిలబడ్డ పార్టీకి నేటి పరిస్థితులు ఒక లెక్కే కాదని., ఎటువంటి ఆటంకాలనైనా అలవోకగా దాటుకుంటూ ప్రజాదరణను మరింతగా పొందుకుంటూ ముందడుగు వేస్తుందని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ పునరుద్ఘాటించారు. తెలంగాణ అస్థిత్వమే ప్రమాదంలో పడిన దిక్కు మొక్కు లేని చివరిదశ ఉద్యమకాలం నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన అటునుంచి పదేండ్ల ప్రగతి పాలన దాకా తాను ఎదుర్కొన్న కష్టాలను కేసీఆర్ ఈ సందర్భంగా కార్యకర్తలకు వివరించారు. ఆనాడు తెలంగాణను అష్ట దిగ్బంధనం చేసిన సమైక్యవాద శక్తులు, వారి మీడియాతో సహా సమస్త రంగాలు.. వాళ్లు రాసిందే రాత గీసిందే గీత'గా నడిచేదని గుర్తుచేశారు. అత్యంత శక్తివంతమైన ఆంధ్రా వ్యవస్థలను తట్టుకుంటూ, తెలంగాణ వ్యతిరేకతకు, సమైక్య వాదానికి సింబాలిక్ గా ఉన్న నాటి పాలకుడు చంద్రబాబు నాయుడును ఎదిరించి నిలవడం అంటే అషమాషీ వ్యవహారం కాదని అన్నారు. అటువంటి సమైక్య వాద కుటిల వ్యవస్థలనే బద్దలుకొట్టి తెలంగాణను సాధించి, కలబడి నిలబడిన తెలంగాణ సమాజం, భవిష్యత్తులో ఎటువంటి ప్రతిబంధక పరిస్థితులనైనా అధిగమిస్తుందని కేసీఆర్ భరోసా వ్యక్తం చేశారు. గెలుపు ఓటములకు అతీతంగా తెలంగాణ సమాజం మనకు ఎల్లవేళలా అండగా ఉందని, భవిష్యత్తులోనూ ఉంటుందని కార్యకర్తల జై తెలంగాణ నినాదాల నడుమ కేసీఆర్ ప్రకటించారు.శత్రువుల ప్రత్యర్థుల కుటిల యత్నాలను అధిగమిస్తూ అప్రతిహతంగా కొనసాగుతున్న బిఆర్ఎస్ విజయ ప్రస్థానంలో నిన్నటి ఓటమితో దిష్టి తీసినట్టయిందని, తిరిగి పునరుత్తేజంతో మరింతగా ప్రజాదరణను కూడగట్టాలని కార్యకర్తల హర్షధ్వానాల నడుమ కేసీఆర్ ప్రకటించారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రేస్ పార్టీ, ఇచ్చిన అలవిగాని హామీలు అమలు చేయడం చేతగాక పలురకాల జిమ్మిక్కులతో ప్రజలను పక్కదారి పట్టిస్తూ పబ్బం గడుపుకుంటున్నదని దుయ్యబట్టారు. కాంగ్రేసు పార్టీ నైజం మరోసారి అర్థమైన ప్రజలు, ఓటేసి పొరపాటు చేసినామని నాలిక కరుసుకుంటున్నారని కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణలో మున్నెన్నడూ లేనివిధంగా ప్రశాంతమైన పాలన ద్వారా పదేండ్లపాటు సంక్షేమం అభివృద్ధిని అందిస్తూ అన్ని తీర్లా అండగా నిలబడ్డ బిఆర్ఎస్ పార్టీని తిరిగి తెలంగాణ సమాజం కోరుకుంటున్నదని కేసీఆర్ తెలిపారు.కేసీఆర్ మీద ద్వేషం తో, అసంబద్ధ ప్రకటనలతో, ప్రజా ఆకాంక్షలకు విరుద్ధంగా నడుస్తున్న కాంగ్రేస్ ప్రభుత్వం మీద ప్రజలు తిరుగబడే రోజులు త్వరలోనే రానున్నాయని స్పష్టం చేశారు. తన చేష్టలతో తానే ప్రజలచేత ఛీ కొట్టించుకోవడమే యాబై ఏండ్ల కాంగ్రేస్ వైఖరి అనీ, ఈ నేపథ్యంలో ప్రజలు అనతికాలంలోనే కాంగ్రేస్ పాలనపై విరక్తి చెందారనే విషయం క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నదని సోదాహరణలతో కేసీఆర్ వివరించారు. "మరికొద్ది రోజుల్లోనే టార్చ్ లైట్ పట్టుకొని జనం దోలాడుకుంటా బిఆర్ ఎస్ పార్టీకోసం వస్తారని" కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేస్తూ., అప్పుడిదాక ఓపికతో ప్రజా సమస్యలపైన పోరాడుతూ వారికి అందుబాటులో వుండాలని కార్యకర్తలకు అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. బుధవారం నాడు ఎర్రవల్లి నివాసం లో తనను కలిసేందుకు మహబూబాబాద్, మేడ్చల్, నల్గొండ జిల్లాల నుండి వచ్చిన కార్య కార్యకర్తలు నాయకులతో కేసీఆర్ సమావేశమయ్యారు.ఈ సమావేశంలో నల్గొండ తదితర జిల్లాల మాజీ మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు , ఎంఎల్సీ లు పాల్గొన్నారు.. వారిలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ఎంఎల్సీ లు మధుసూదనాచారి, తక్కెళ్ల పల్లి రవీందర్ రావు,కోటిరెడ్డి, గాదరి కిశోర్, కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య, జీవన్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునీతా రెడ్డి, నలమోతు భాస్కర్ రావు, రమావత్ రవీంద్ర కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నోముల భగత్, బూడిద బిక్షమయ్య గౌడ్, కంచర్ల కృష్ణారెడ్డి, తిప్పన విజయసింహా రెడ్డి, ఒంటెద్దు నర్సింహరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో పుష్కలంగా పర్యాటక అవకాశాలు

- పర్యాటక అభివృద్ధికి నూతన పర్యాటక విధాన ముసాయిదా సిద్ధం
- ఎకో, టెంపుల్, మెడికల్ టూరిజం అభివృద్ధి
- పర్యాటక రంగ అభివృద్ధితో ఆర్థిక స్వయం సంవృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- సోమశిల, రామప్ప, లక్నవరం, నాగార్జున సాగర్, అనంతగిరి హిల్స్ ను డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రాలుగా తీర్చిదిద్దుతాం
- అనంతగిరిలో వెల్నెస్ టూరిజం రిసార్ట్ ఏర్పాటు
- బుద్ధ గయా తరహాలో బుద్ధవనాన్ని తీర్చిదిద్దుతాం
- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**విశ్వంభరా హైదరాబాద్ :** పర్యాటక కేంద్రంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్ది.. ఆర్థికంగా స్వయం సంవృద్ధి సాధించడం.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నూతన పర్యాటక విధాన ముసాయిదా రూపొందించామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డా. బీఆర్. అంబేద్కర్ సచివాలయంలోని మీడియా సెంటర్ లో పర్యాటక రంగ అభివృద్ధి, సాంస్కృతిక శాఖ బలోపేతంపై మంత్రి జూపల్లి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడిచిన పదేళ్లలో పర్యాటక శాఖ ఉన్నదనే విషయం మరిచిపోయామని, పర్యాటక రంగ అభివృద్ధికి ఓ పాలసీ అంటు లేకుండా పోయిందని, గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిదని ధ్వజమెత్తారు. పర్యాటక రంగం అస్తవ్యస్తమైందని, తారామతి బరాదరి, హరిత హోటల్స్ నిర్వహణ అధ్వానంగా తయారైందని, యుద్ధ ప్రాతిపాదికన పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తామని, ఆరు నెలల్లోనే పురోగతి సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను కూడా రాబట్టడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

**ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యంలో పర్యాటక ప్రదేశాల అభివృద్ధి**

సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం .. పర్యాటక రంగానికి అధిక ప్రాధ్యనతను ఇస్తుందని, ఎకో, టెంపుల్, మెడికల్ టూరిజంపై ప్రధానంగా దృష్టి సారించినట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి నూతన పర్యాటక విధాన ముసాయిదాను సిద్ధం చేశామని, సీఎం రేవంత్ రెడ్డి సలహాలు, సూచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. త్వరలోనే కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిని కలిసి తెలంగాణ పర్యాటక అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరతామని తెలిపారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలో పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేసి.. మౌలిక వసతులు కల్పించడం ద్వారా ఆదాయం పొందే మార్గాలను అన్వేషిస్తున్నామని అన్నారు. తెలంగాణ ప్రకృతి రమణీయమైన ప్రదేశాలు, చారిత్రక వారసత్వ సంపదకు నెలవుగా ఉందని, ఎన్నో వనరులు ఉన్నప్పటికి అనుకున్న స్థాయిలో పర్యాటకాన్ని అభివృద్ధి చేయలేకపోయామని, వనరులు లేని సింగపూర్, దుబాయ్, ఆఫ్రికా లాంటి దేశాలు... తమ ప్రధాన ఆదాయ వనరుగా పర్యాటక రంగాన్ని మలుచుకున్నాయని పేర్కొన్నారు. తెలంగాణను పర్యాటకాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది... లోకల్ టు గ్లోబల్ టూరిస్ట్ లను ఆకర్శించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కృష్ణానదీ బ్యాక్ వాటర్స్ లో సోమశిలను డెస్టినేషన్ వెడ్డింగ్, సహస పర్యాటకానికి అనువైన ప్రదేశంగా గుర్తించామని, డెస్టినేషన్ వెడ్డింగ్ ను ప్రమోట్ చేయడానికి.. రామప్ప, లక్నవరం, నాగార్జున సాగర్, అనంతగిరి హిల్స్ వంటి ముఖ్యమైన ప్రదేశాలను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. అనంతగిరిలో వెల్నెస్ టూరిజం రిసార్ట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను మేళవించి వివాహ వేడుకలు నిర్వహించేలా చూస్తామన్నారు.

**అంతర్జాతీయ స్థాయిలో బుద్ధవనం అభివృద్ధి**

నాగర్జున సాగర్ లోని బుద్ధవనాన్ని.. బుద్ధ గయా తరహాలో అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్ది తూర్పు, దక్షిణ దేశాల పర్యాటకులను అకట్టుకునేలా వసతులు కల్పిస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో ప్రతిష్టాత్మక NITHM ప్రతిష్ట మసక బారిందని, గతంలో 800 పైగా స్ట్రెంత్ ఉంటే.. ఇప్పుడు 200కు పడిపోయిందని... దీనికి పూర్వ వైభవం తీసుకువస్తామని అన్నారు. సంస్కృతి అంటే కేవలం కళలు, కళాకారులు మాత్రమే కాదని అది మన జీవన విధానాన్ని ప్రతిబింభిస్తుందని, పురాతన కళలను ఒక గొడుగు క్రిందకు తెచ్చి.. పేరిణి లాంటి నృత్య రూపాలను మరింత ప్రోత్సహిస్తామని అన్నారు. పర్యాటక ప్రదేశాలు, షాపింగ్ మాల్స్ లో ఫ్లాష్ మాబ్స్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. దశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలు, కాళోజీ నారాయణ రావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఈ సందర్భంగా చెప్పారు. ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి వాణి ప్రసాద్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనెజింగ్ డెరెక్టర్ ప్రకాష్ రెడ్డి, పర్యాటక శాఖ డైరెక్టర్ ఇలా త్రిపాఠి పాల్గొన్నారు



# సొంతగూటికి కేకే

**విశ్వంభర, ఢిల్లీ:** బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు, సీనియర్ నేత కే.కేశవరావు తిరిగి సొంతగూటికి చేరారు. బుధవారం ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఆయనకి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఖర్గే తో పాటు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, ఇంఛార్జ్ దీపదాస్ మున్షి సమక్షంలో ఆయన అధికారికంగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అనంతరం అక్కడికి వచ్చిన రాహుల్ గాంధీ.. కేకేకి అభినందనలు తెలిపారు.కేకే తన కూతురు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి తో కలిసి మార్చ్ నెలలో సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ లో లాంఛనంగా చేరారు. అయితే రాజ్యసభ సభ్యుడిగా ఉన్న కేకే జాతీయ నాయకుల సమక్షంలో అధికారికంగా కాంగ్రెస్ లో చేరే ప్రక్రియలో భాగంగా నేడు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.


**కేకే కాంగ్రెస్ వాడే...**

కేకే స్వతహాగా కాంగ్రెస్ నేత. ఆయన పలుమార్లు పీసీసీ చీఫ్ గా పని చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో ఒక్కసారే గెలిచారు. తర్వాత ఎప్పుడూ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ ఆయనకు పదవులు మాత్రం వరిస్తూనే వచ్చాయి. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ బలహీనపడటంతో ఆయన బీఆర్ఎస్ లో చేరారు. ఆయనకు బీఆర్ఎస్ లో కూడా సముచిత స్థానం దక్కింది అనడంలో అతిశయోక్తి లేదు. కేసీఆర్ ఆయనకి పార్టీలో పదవులతోపాటు, ప్రాధాన్యత కూడా కల్పించారు. గులాబీ బాస్ కి సన్నిహితంగా ఉండే కొద్దిమందిలో ఒక్కరిగా కేకే మెలిగారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం గులాబీ శ్రేణుల్ని షాక్ కి గురికి చేసింది. ఆయన పార్టీ మారడంపై కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, ఇతర ముఖ్య నేతలు ఎంతక్కువ చేశామని పార్టీ మారారంటూ నిలదీశారు కూడా. కేకే కుమార్తె హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఇప్పటికే కాంగ్రెస్ లో చేరారు. కేకే కుమారుడు విప్లవ్ బీఆర్ఎస్లోనే కొనసాగుతున్నారు.

**రాజ్యసభకు రాజీనామా...**

కేకే తన రాజ్యసభ పదవికి రాజీనామా చేస్తారని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆయన బీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. ఇప్పుడు పార్టీ మారితే ఆయనపై అనర్హత వేటు పడుతుంది. అందుకే రాజీనామా చేయాలనుకుంటున్నారని తెలుస్తోంది. 2020లో బీఆర్ఎస్ నుంచి కేకే రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇంకా రెండేళ్లకు పైగా ఆయన పదవీ కాలం ఉంది. అయితే రాజీనామా చేయడం వల్ల వచ్చే ఉపఎన్నిక ద్వారా ఆయన మళ్లీ రాజ్యసభకు ఎన్నికయ్యే అవకాశాలు ఉన్నాయి. ఆ కండిషన్ మీదనే కేకే కాంగ్రెస్ లో చేరారని టాక్ నడుస్తోంది.

## సెయిలింగ్ పోటీలు ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్:** ఏటా గ్రాండ్‌గా హుస్సేన్ సాగర్‌లో నిర్వహించే సెయిలింగ్ పోటీలు ఈ ఏడాది కూడా అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హుస్సేన్ సాగర్‌లో ఇప్పటికే ట్రయల్స్ పూర్తి చేసుకొవడంతో అసలు పోటీలు ఇక సమరాన్ని తలపించేలా సాగుతున్నాయి. హుస్సేన్ సాగర్‌లో వారం రోజులు సెయిలింగ్ పోటీలు కనువిందు చేయున్నాయి. ఈ నెల 7 వరకు జరిగే ఈవెంట్‌ను యాటింగ్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా, లేసర్ క్లాస్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్నాయి. లెఫ్టినెంట్ జనరల్ జేఎస్ సిధన పోటీలను ప్రారంభించారు. జాతీయ స్థాయిలో దాదాపు వంద మంది సెయిలర్స్ పాల్గొంటుండగా.. ఈ జాతీయ టోర్నమెంట్‌లో రాణించిన సెయిలర్స్‌ను ఏషియన్ గేమ్స్‌కు సెలెక్ట్ చేయనున్నట్లు మేజర్ జనరల్ అజయ్ శర్మ తెలిపారు. లేసర్, లేసర్ స్టాండర్డ్‌లకి సంబంధించి మొత్తం 12 రేసులు జరుగుతాయని.. చివరి రోజునైన విజేతలను ప్రకటించి అవార్డులు అందజేస్తారు. జులై నుంచి ఆగస్టులో హైదరాబాద్ వెదర్ సెయిలింగ్‌కు అనుకూలంగా ఉండటంతో ఏటా వందలాది పడవలు గాలివాటంతో హుస్సేన్ సాగర్ లో దూసుకుపోతు సందడి చేస్తాయి. ఈసారి కూడా ఆ జోష్ ఏమాత్రం తగ్గకుండా 38 వ హైదరాబాద్ సెయిలింగ్ వీక్ ప్రారంభమైంది. ఇక హుస్సేన్ సాగర్‌లో పోటీల దగ్గర నుంచి మరింత సమాచారం మా సీనియర్ కరస్పాండెంట్ విద్యా సాగర్ అందిస్తారు.





## డిప్యూటీ సీఎంలు వద్దా..?

(మొదటి పేజీ తరువాయి)

ఇక ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభువం ప్రగతి భవన్ ముందున్న ఇనుప గేట్లను తీయించి, మహాత్మ జ్యోతి బా పూలే ప్రజా భవన్ గా పేరుమార్చింది. తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి అధికారిక నివాసంగా దీనిని కేటాయించింది. ఇదే భవన సముదాయంలో పలువురు మంత్రులు కూడా ఉంటున్నారు. ప్రధానమైన భవనంలో మాత్రం భట్టి నివాసం కమ్ కార్యాలయం కొనసాగుతోంది.

**సీఎంల భేటీ ఇక్కడే**

తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి.. ప్రజా భవన్ లో కాకుండా జూబ్లీహిల్స్ లోని ఇంటినే అధికారిక నివాసం చేసుకున్నారు. మధ్యలో ఎంసీహెచ్ ఆర్డీని క్యాంపు కార్యాలయంగా వాడుకుంటారన్న కథనాలు వచ్చినా కార్యరూపం దాల్చలేదు. మరి ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి, మరికొందరు మంత్రులు ఉంటున్న ప్రజా భవన్ ను రేవంత్, చంద్రబాబు భేటీకి వేదిక చేసుకున్నారు. మరి తన నివాసం (క్యాంపు కార్యాలయం)లో జరుగుతున్న సీఎంల సమావేశంలో భట్టికి అవకాశం ఉంటుందా?

**పవన్ కల్యాణ్ కూడా వస్తారా?**

తెలుగు రాష్ట్రాల సీఎంల సమావేశంలో భేటీలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి పాల్గొనడం సరే.. మరి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా హాజరవుతారా? అనేది ఆసక్తికరం కానుంది. కేవలం సీఎంల భేటీనే అయినా.. జరుగుతున్నది భట్టి నివాసంలో. మరి ఆయన లేకుండానే ఎలా? ఒకవేళ భట్టి పాల్గొంటే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఉండాలి కదా? ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం పవన్ కల్యాణ్ హోదాకు తగిన గౌరవం ఇస్తోంది. ఈ నేపథ్యంలోనే చర్చ మొదలైంది.


## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కేసు

- నూతన చట్టాలను ప్రయోగించిన పోలీసులు
- కరీంనగర్‌లో పాడి కౌశిక్ రెడ్డిపై, ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మీపై కేసు నమోదు
- రాష్ట్రంలో సంచలనంగా మారిన కేసుల నమోదు

**విశ్వంభర, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీపై కేసు నమోదైంది. కుమ్రంభీం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి మధ్య ప్రోటోకాల్ రగడ తారాస్థాయికి చేరింది. ప్రోటోకాల్ వివాదం వ్యక్తిగత ఘర్షణలకు దారి తీసింది. దీంతో ఇరు పార్టీల కార్యకర్తలు ధర్నాలకు దిగారు. రాస్తారోకోలు చేపట్టారు. అయితే విశ్వప్రసాద్ రావు ఎమ్మెల్యే కోవా లక్ష్మీపై ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు 296(బీ), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కరీంనగర్ జిల్లా పరిషత్ సమావేశంలో కలెక్టర్ సహా అధికారుల విధులకు ఆటంకం కలిగించిన అభియోగాలపై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కరీంనగర్ వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. బీఎన్ఎస్ యాక్ట్ సెక్షన్ 221, 126(2) కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. జిల్లా పరిషత్ అధికారుల ఫిర్యాదుతో చర్యలు తీసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.







# మంచితనానికి మారుపేరు రవికుమార్

- సకినాల అకాల మరణం బాధాకరం
- రవి కుమార్ కుటుంబానికి అండగా ఉంటాం
- సంస్మరణ సభలో డాక్టర్ కాచం సత్యనారాయణ
- న్యాయవాదిలో సకినాల రవి కుమార్ సేవలను గుర్తు చేసుకున్న వక్తలు



**విశ్వంభర, హైదరాబాద్ :** మంచితనానికి మారు పేరుగా, మృదుస్వభావిగా, అందరితో కలివిడిగా ఉండి ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి సకినాల రవికుమార్ అకాల మరణం పొందడం బాధాకరమని V3 న్యూస్ ఛానల్ చైర్మన్ డాక్టర్ కాచం సత్యనారాయణ అన్నారు. బుధవారం మలక్‌పేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగిన సకినాల రవికుమార్ సంస్మరణ సభలో డాక్టర్ కాచం సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. నకిరేకల్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా, V3 న్యూస్ ఛానల్ న్యాయ సలహాదారుడిగా, సీనియర్ న్యాయవాదిగా అందరి మన్ననలు పొందిన వ్యక్తి మన మధ్య లేకపోవడం తీరనిలోటని అన్నారు. సంస్మరణ సభకు హాజరైన మిత్రులు బంధువులు, ప్రముఖులు మాట్లాడుతూ రవికుమార్ చేసిన సేవలను గుర్తు చేశారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. సంస్మరణ సభలో ప్రభుత్వ ఓఎస్‌డీ శశిధర్ రెడ్డి, నల్లగొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి రఘుపతి, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లు జీ వెంకటేశ్వర్లు, సిరిగిరి వెంకటరెడ్డి, నల్లగొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, న్యాయవాదులు చలకాని వెంకట్ యాదవ్, జవహర్ లాల్ రావుల వెంకటరెడ్డి, సతీష్, ప్రభాకర్, కెవిల్‌లు పాల్గొన్నారు.

### స్నేహపూర్వకంగా ఉండేవారు..

సీనియర్ న్యాయవాది రవికుమార్ ఆప్త మిత్రుడు కంచలపల్లి జవహర్ లాల్ అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో జవహర్ లాల్ మాట్లాడుతూ రవికుమార్ కుటుంబంతో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ప్రతి విషయంలో స్నేహపూర్వకంగా ఉండడంతో పాటు న్యాయపరమైన విషయాలలో ఒకరికి ఒకరం సలహాలు ఇచ్చుకునే వారమని వారిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. అదేవిధంగా నకిరేకల్ మండల మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, వేములపల్లి మండల మాజీ ఎంపీపీ, ప్రముఖ న్యాయవాది రాపోలు భాస్కర్ మాట్లాడుతూ.. విలువలతో కూడిన వ్యక్తి అని, ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన రవికుమార్ లేకపోవడం బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ వారికి ఆత్మకు శాంతి కలగాలని కోరారు .

### రవికుమార్ సేవలను గుర్తు చేసుకున్న సహచరులు

తెలంగాణ రాష్ట్ర మాజీ డెయిరీ చైర్మన్ ప్రముఖ న్యాయవాది సోమ భరత్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు దాసోజు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. రవికుమార్ సంస్మరణ సభలో V3 న్యూస్ ఛానల్ సిబ్బంది పాల్గొని ఛానల్‌కు న్యాయ సలహాదారులుగా ఉండి సిబ్బందితో కలిసి మెలిసి వుండీ సలహాలు సూచనలు అందించే వారని గుర్తు చేసుకున్నారు. వారు అకాల మరణం పొందడం బాధాకరమని, వారి ఆత్మకు శాంతి కలగాలని వారి కోరారు. అనంతరం రవికుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





# ముఖ్యమంత్రుల భేటీ ఏర్పాట్లను పరిశీలించిన భట్టి

**విశ్వంభరా హైదరాబాద్, జూలై 03:** ఈ నెల 6న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్ లో ప్రజా భవన్ లో భేటీ కానున్న నేపథ్యంలో సమావేశ ఏర్పాట్లును తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు బుధవారం పరిశీలించారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వివిధ విభాగాల అధికారులు ప్రజా భవన్ ను సందర్శించారు. సజావుగా ఏర్పాట్లు చేయాలని ఆయా విభాగాల అధికారులకు సూచనలు చేశారు. సమన్వయంతో సమావేశానికి తగు ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య, రహదారులు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ప్రొటోకాల్ విభాగం డైరెక్టర్ వెంకట రావు ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.








# మల్లాపూర్ తండాలో పంచాయతీ కార్యాలయం ప్రారంభం

### ప్రారంభోత్సవంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**విశ్వంభర, కొత్తూరు:** మండల పరిధిలోని మల్లాపూర్ తాండ నూతన గ్రామపంచాయతీ కార్యాలయంను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన గ్రామపంచాయతీ భవనంను ప్రారంభించి గ్రామస్తులకు సుపరిపాలన అందించేందుకు దోహద పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి, జడ్పిటిసి శ్రీలత సత్యనారాయణ, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హరినాథ్ రెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు అంబటి ప్రభాకర్, రవి నాయక్, మాజీ ఉప సర్పంచ్ దయానంద్ గుప్తా, దశరథ్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందూరి శ్రీనివాస్, వీరమోని దేవేందర్ ముదిరాజ్, కర్రోళ్ల సురేందర్, గోవింద నాయక్, బోకుల రాజు, శ్రీరాములు, మల్లేష్, గ్రామ ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.





# విద్యార్థి, యువజన సంఘాల బంద్‌ని విజయవంతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి, కుమ్మరి రాజ్ కుమార్

**విశ్వంభర, భూపాలపల్లి :** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎస్ఎఫ్ఐ కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. నెట్, నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజ్‌పై, అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జిచే విచారణ జరిపించి, నీట్ పరీక్ష మళ్ళీ నిర్వహించాలని, NTA రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, నీట్ విద్యార్థుల పట్ల NDA ప్రభుత్వ వైఖరినీ నిరసిస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జూలై 4వ తేదీన రాష్ట్ర వ్యాప్త విద్య సంస్థల బంతద్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు స్పందన అభి, స్వామి, ప్రవీణ్, సుధీర్, శివ, కేశవ, చందు, తదితరులు పాల్గొన్నారు.



# రైతు పథకాలను వాస్తవ సాగుదారులకు అందించాలి

"తెలంగాణ రాష్ట్రం అప్పులు రూ.7 లక్షల కోట్లకు చేరినవి. ఈ అప్పులు తీర్చేటందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త అప్పులు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన డిసెంబర్ 7 నుంచి జూన్ 17 వరకు రూ. 38,040 కోట్లు అప్పుల వడ్డీల కిస్తీలు (రీపేమెంట్) తిరిగి చెల్లింపులు చేసినామని, రోజుకు రూ. 191 కోట్లు అప్పులు తీర్చడానికి వడ్డీ క్రింద చెల్లించాల్సి ఉందని రాష్ట్ర ఆర్థిక మంత్రి తెలుపుతున్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు కిస్తీలను చెల్లిస్తూ అప్పల పెరుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం బ్రేకులు వేస్తు పొదుపు చర్యలు పాటిస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల మేరకు ఆరు గ్యారంటీలను అమలుకు కట్టుబడి అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి గారు ప్రకటించారు.

రూ. 2 లక్షల రుణమాఫీ ఆగస్టు 15 వరకు తప్పకుండా అమలు చేస్తామని జూన్ 21న క్యాబినెట్ సమావేశములో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి రేవంతరెడ్డి వెల్లడించారు. రెండవది 'రైతు భరోసా' కు విధి విధానాలు ఖరారు చేయటానికి నలుగురు మంత్రులతో ఉప సంఘాన్ని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ జూలై 15 నాటికి రాష్ట్రంలో పర్యటించి వివిధ వర్గాల తోను,రైతు సంఘాల ప్రతినిధులతోనూ, ప్రజా ప్రతినిధులతో విస్తృతంగా అభిప్రాయాలు సేకరించి వాటినిపై అసెంబ్లీ సమావేశంలోచర్చించి అమలు చేస్తామని ప్రకటించారు. ఈ రెండు రైతు సంక్షేమ పథకాల పూర్వపరాల గమనిస్తే ఇవి ఓటు బ్యాంకు రాజకీయాలుగా ఉండకూడదు.. ఎన్నో ప్రకృతి వైపర్యాలను తట్టుకుంటూ అస్తవ్యవస్థ మార్కెటింగ్ విధానంలో అనేక అష్ట కష్టాలు పడుతూ దేశ ప్రజలకు అన్ని రకాల పంటలు అందిస్తున్న రైతాంగానికి ఏ మేరకు సాయం అందించిన స్వాగతించాల్సిందే. వీటిని విమర్శించడం లేదు. కానీ, వీటిలోని లొసుగులను తొలగిస్తే ఈ పథకాలు సాగు జీవులకు నిజంగా మేలు చేస్తాయి అనేది వాస్తవం.

2009లో ఆనాటి కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం దేశవ్యాప్తంగా వ్యవసాయ రుణాలు రూ. 70 వేల కోట్లు మాఫీ చేయడం జరిగింది. రాష్ట్రంలో గత బీఆర్ ఎస్ ప్రభుత్వము రైతుకు పెట్టుబడి సహాయము 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూ.లక్ష లోపు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ఆ తరువాత ఏకకాలంలో కాకుండా విడుతలవారీగా అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత జీవో నేం. 148 ను' రైతు బంధు 'పేరుతో 1702020 ద్వారా అమలుకు తెచ్చింది. ఈ జీవో ప్రకారం పంట రుణమాఫీ పథకం 2018 అమలు కోసం 1 ఏప్రిల్, 2014నుంచి 2018 డిసెంబర్ 11ను కట్ ఆఫ్ తేది వీలుగా నాటి కేసీఆర్ ప్రభుత్వం నిర్ధారించింది. అది కూడా మూడు విడుతలుగా అమల్లోకి తెచ్చింది. అసలు వడ్డీతో కలిపి కుటుంబానికి తొలివి విడత రూ.25 వేలు లోపు, ఆ తరువాత రూ. 50 వేల లోపు, 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు రూ.లక్ష మాఫీ ప్రకటించినప్పటికీ అది అతి కొద్ది మందికి మాత్రమే రూ.లక్ష రుణ మాఫీ చేసింది.

బ్యాంకుల రుణమాఫీ అనడంతో బ్యాంకు లోను కొన్ని వర్గాలకు ఉచిత ఆదాయ మార్గం అయింది. పంట అప్పే కదా.. తీసుకున్నాక ఏదో రోజు మాఫీ అవుతుందని ధీమాతో చాలామంది తిరిగి చెల్లించడం కూడా మానేశారు. ఇక్కడే పంట రుణమాఫీ దుర్వినియోగానికి తెరలేచింది. అసలు ఆ భూముల్లో పంటలు వేస్తున్నారా? లేదా.. అని క్షేత్రస్థాయి పర్యవేక్షణచేసే సిబ్బంది ఓపిక, సమయం బ్యాంకుల వద్ద లేదు. బ్యాంకు దృష్టిలో లోను అడిగేవారు పట్టేదారు అయితే చాలు. వారికి అప్పుకు భూమి వినియోగం కన్నా సెక్యూరిటీ ముఖ్యంతో ఇస్తున్నారు.

ఇక రైతు బంధు పథకం గత ప్రభుత్వం 2018 నుంచి 2023 వరకు రూ. 75 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ప్రకటించారు. అయితే స్వయంగా వ్యవసాయం చేసుకునే వారికే అని నిబంధనలు ఉన్నప్పటికీ.. ఇట్టి డబ్బులో 50 శాతం అనఃర్హులకే అందిందని విమర్శలు వచ్చినవి. వస్తున్న విమర్శలు నేపథ్యంలో.. గత ప్రభుత్వము చేసిన తప్పిదాలను ఈ ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని..



ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నాను.

**రైతుబంధు నిధులు దుర్వినియోగం**

రైతుబంధు విషయానికొస్తే ప్రభుత్వనిదులు పెద్ద ఎత్తున దుర్వినియోగం అవుతున్నాయి.1) పట్టా భూమి కలిగియున్న ప్రతి రైతుకు రైతుబంధు ఇస్తామని గతంలో ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. ప్రపంచంలో ఏ దేశంలో ఉన్న, అతని పేరు మీద పట్టా ఉంటె వ్యవసాయం చేయకున్న, ఇస్తామని ప్రకటించింది. వ్యవసాయ యోగ్యం కానీ గుట్టలు,కొండలు, చెట్లు, అడవులు, పడావు పడిన భూములకు కూడా ఇస్తున్నారు. 2) రియల్ ఎస్టేట్, వ్యాపార వాణిజ్యాలు, పెద్దపెద్ద ఫామ్ హౌసులు, ఇండస్ట్రియలిస్టులు, సినీ పరిశ్రమాధిపతులు, డబ్బు ఉన్న పెద్ద పెద్ద ధనవంతులు భూములు కొని పెట్టుకుంటున్నారు. వారు వ్యవసాయం చేయుట లేదు. వారు కూడా పొందినారు. 3) విద్య,వైద్య వ్యాపారం అయింది. కాలేజీలకు, వైద్య హాస్పిటల్స్ కు, మెడికల్ కాలేజీలకు వందల ఎకరాల భూములు కొనుక్కొని.. కొంత భూమిని వారి పేర పెట్టుకొని రైతుబంధు పొందుతున్నారు. 4) భూములు కలిగి ఉన్నవారు వ్యవసాయం చేయకుండా, కొంత భూమిని కౌలుకు ఇచ్చుకొని, మరికొంత భూమిని పశువులు,మేకలు గొర్లకు మేపుకొనుటకు కౌలుకు ఇస్తున్నారు.. అట్టి భూములకు కూడా రైతుబంధు పొందుతున్నారు. 5) కొన్ని గ్రామాలలో చెరువు శిఖం భూములు పట్టాలు కలిగి ఉన్నారు. వాటిని సేవ్యము చేయటం లేదు. అయినా పట్టా ఉన్నదని రైతు బంధు పొందుతున్నారు. 6) కొంతమందికి సొంత ఊరిలోనూ, పక్క ఊరిలోనూ, ఇంకా ఇతర ప్రాంతాలలో భూములు ఉన్నాయి.. అన్ని చోట్ల రైతుబంధు వస్తుంది. 7) ఐఏఎస్, ఐపీఎస్, ఉన్నత అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు సంపాదించిన డబ్బులతో స్థిరాస్తిగా ఉంటుందని భూములను కొనుక్కున్నారు.వారికి కూడా ఇస్తున్నారు. 8) ఎన్నారై, దేశ విదేశాలలో డబ్బులు సంపాదించుకొని, వారి కొడుకులు, కుమార్తెల పేరుతో భూములు కొనుక్కొని ఉంచుకున్నారు. కానీ వ్యవసాయం చేయుట లేదు. వారికి రైతుబంధు ఇస్తున్నారు. 9) ప్రస్తుతము రాష్ట్రంలో ఐదు ఎకరాల లోపు వారే 90 శాతానికి పైగా రైతులు ఉన్నారు. వారి చేతిలో ఉన్న భూమి 12.85 లక్షల ఎకరాలు మాత్రమే. ఇందులో కూడా వాస్తవ వ్యవసాయం చేసేవారు 60శాతం మాత్రమే. మిగతావారు కౌలుకు ఇచ్చుకుంటున్నారు.. 10) చాలామంది పేదలు, చేతి వృత్తుల వార్లు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వారికి నైజాం కాలము నుంచి ఇనాముల పేరుతో భూములు ఉన్నాయి.. కానీ వాటిని వారి రికార్డులలో( ధరణి) సమగ్రంగా నమోదు చేయుట లేదు. వాటిని వారి పేరు మీద మార్పిడి చేసి, వ్యవసాయం చేసుకునే వారికి ఇవ్వాలి. 11) చిన్న కమతాలు ఉన్న పేదలు ఒక ఎకరం, రెండు ఎకరాలు ఉన్నవారు అదనంగా 2, 3, 4 ఎకరాల వరకు లీజుకు (కౌలుకు) తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ విధంగా తెలంగాణలో 18 శాతం కౌవులు రైతులు ఉన్నారని వారిని గ్రామాలలో రెవిన్యూ కార్యదర్శి, పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ సిబ్బంది స్వయానా వారు చేసుకుంటున్నా భూములను పరిశీలించి. వారికందరికీ రైతు భరోసా ఇచ్చే విధంగా మరియు బ్యాంకుల నుండి లోన్ వచ్చే విధంగా ఏర్పాట్లు చేయాలి. 12) ఇప్పటివరకు రైతు బంధు పథకం కింద ఇచ్చిన వారి పేర్లను, వారు పొందిన అమౌంటు, గ్రామాలలో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ప్రదర్శించాలి. వీటిపై ఫిర్యాదులను స్వీకరించాలి అనర్హులైన వారికి ఇచ్చిన డబ్బులు వసూలు చేయాలి.

### రైతు భరోసా అమలు చేయాలి

నూతనంగా బాధ్యతలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతుబంధును 'రైతు భరోసా' గా మార్చి ఏకరాకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలకు పెంచింది. వాస్తవ సాగుదారులకి అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టతనిచ్చారు. మంత్రివర్గ ఉప సంఘం కూడా రైతు భరోసా విధివిధానాలు నిర్ణయించేటప్పుడు పూర్తి వివరాలతో తెగువతో ముందడుగు వేయాలి రైతుబంధులోని అనర్హులను కచ్చితంగా తొలగించాలి.

### అర్హులందరికీ వర్తించాలి

రాబోయే ఎన్నికలలో వారి ఓట్లు రాక పార్టీకి నష్టం రావచ్చు అని అసలే భావించకూడదు, భయపడకూడదు. అన్యాయంగా వస్తున్న సొమ్ముకు ఆశపడకుండా ప్రతి పౌరుడు నిజాయితీగా, చిత్తశుద్ధితో ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలి. భూమి ఉందని, పంటలు వేయకున్నా మాఫీ కోసం బ్యాంక్ రుణం తీసుకోవడం, రైతు భరోసా కూడా ఆశించడం సాంఘిక నేరమే అవుతుంది. ప్రభుత్వము తక్షణమే పథకాలపై కాలయాపన చేయకుండా విధి విధానాలతో సంస్కరణలు తేవాలి. ఈ పథకాల కోసం రాష్ట్ర బడ్జెట్ లో రూ.45 కోట్లకు పైగా కేటాయిస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపద్యంలో వీటికి కేటాయిస్తుంటే ఎవరు అభ్యంతరం చెప్పడం లేదు, కాదనడం లేదు. కానీ అంహర్హులకు ప్రజాధనం పోతుంటే ప్రతి పౌరుడు బాధపడుతున్నాడు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం నిక్కచ్చిగా వ్యవహరిస్తే ప్రస్తుత ఆర్థిక లోటు తగ్గి మిగతా హామీలకు వెలుసుబాటు కలుగుతుంది.



- ఉజ్జిని రత్నాకర్ రావు
సెల్ :9490952646
ఏఐటీయుసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి

# ఓ ధీరహృదయుడా!..పట్టు సడలనివ్వకు!

## నేడు స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా..

"చిరుమబ్బు మరుగులో సూర్యుడే దాగిన కారు చీకట్లలో స్వర్గమే మునిగిన ఓ ధీర హృదయుడా!సడలనివ్వకు పట్టు వరియించుగా నిన్ను విజయమే తప్పక..."

అని యువతకు ఉద్బోధన చేసి , ప్రపంచ చరిత్రలో భారత దేశ గొప్పతనాన్ని, హిందూ ధర్మ విశిష్టతను తెలియచేసిన ఉదయభాస్కరుడు స్వామి వివేకానంద.

"నరేన్" గా ముద్దుగా పిలువబడే "నరేంద్రనాథ్ దత్త" తరువాత కాలంలో విశ్వ విఖ్యాత గాంచిన, సింహసదృశ్యమైన మనో బలానికి ప్రతిరూపమై భారతదేశ యువజనులందరికి ఆదర్శమై నిలిచిన "స్వామి వివేకానంద"గా పేరు గాంచాడు.

ఎందరికో జ్ఞానోదయం కలిగించి, ఆధ్యాత్మిక ప్రపంచాన్ని పరిచయం చేసి, భారత దేశం అంటే ఒక సంస్కృతి కలిగిన గొప్పదేశం అని విశ్వానికి తెలియ చేసి జులై 4, 1902 న విశ్వాంతరాల్లోకి వెళ్లిన దివ్య జ్ఞాని స్వామిజీ. వర్ధంతి సందర్భంగా మరో మారు గుర్తుచేసుకుందాం.

కలకత్త నగరంలో విశ్వనాథ్ దత్త , భువనేశ్వరి దేవి దంపతుల గారాల పుత్రుడుగా 12 జనవరి 1863న జన్మించాడు. చిన్న నాటి నుంచి దైవభక్తి ,ఏకాగ్రత కలిగి ప్రతి ఒక్కరి మన్ననలు పొందాడు. ఆటలలో, చదువులలో ఏరంగాల్లో అయిన సులభంగా, ఉత్సాహంగా పాల్గొని అందరిలో ముందుండేవాడు. మహాగురువు రామకృష్ణ పరమహంస వద్ద చేరి వారికి ప్రియశిష్యుడుగా మారి, వేదాంత, యోగా, తత్వశాస్త్రంలోని అంశాలను ప్రజలకు విడమరిచి చెపుతూ వారిని మానసికంగా సిద్ధం చేసిన మహనీయుడు స్వామిజీ. స్వప్నంలో గురువు పరమహంస గారు ప్రత్యక్షంగా మాతా శారదా దేవి గారి ఆజ్ఞ మేరకు మొదటి సారిగా విదేశాలకు పయనమయ్యాడు.

1893 వ సంవత్సరం, సెప్టెంబర్ 11 వ తేదీ సోమవారం రోజు విశ్వమత మహాసభలు ప్రారంభం అయ్యాయి.ఆ సమావేశాల్లో మాట్లాడేటప్పుడు హృదయాంతరాలలో నుంచి వచ్చిన విశ్వమానవ సౌభ్రాతృత్వ భావనతో, "నా అమెరికా దేశ సోదర సోదరీమణులారా.." అని మొదలుపెట్టగానే ఆ విశాల సమావేశములో ఉన్న అందరూ లేచి నిలబడి, కరతాళ ధ్వనుల వర్షం కురిపించారు. అప్పటి నుంచి ప్రపంచానికి భారత్ యొక్క గొప్పతనం తెలియ వచ్చింది.

భారతదేశంలో స్వామి వివేకానంద పేరు తెలియని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదు. ఆధునిక యుగపు గొప్ప ఆధ్యాత్మిక వేత్తలలో ఆయనొకరు. 1893లో జరిగిన చికాగో సర్వమత సభలలో చేసిన ప్రసంగాలు మరియు తర్వాత నాలుగున్నర సంవత్సరాల పాటు అమెరికా, ఇంగ్లాండులో చేసిన ఉపన్యాసాల ద్వారా ఆయన భారతదేశానికి సంబంధించి అప్పటి వరకూ పాశ్చాత్యులకు ఉన్న భావనను మార్చడంలో చాలా వరకూ విజయం సాధించారు. ఆధ్యాత్మికతకు, సామరస్యానికి, గొప్ప సంస్కృతికి భారత భూమి నిలయమని వారు గ్రహించేలా చేశారు. భారతదేశంపై వారికి గల అభిప్రాయాన్ని మార్చి వారి మనస్సులో భారతదేశాన్ని గొప్పగా భావించేలా చేశారు. ఉన్నత స్థానాన్ని కల్పించారు.

భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత తన అద్భుతమైన వాగ్ధాటితో, ప్రసంగ పరంపరలతో భారతావని ఉత్కృష్ట సంస్కృతి, వారసత్వ సంపద గురించి ప్రజలకు తెలియజేసి వారిలో చైతన్యాన్ని నింపారు. ఆత్మ విశ్వాసాన్ని ఆశావహ దృక్పథాన్ని పెంపొందించి అణగారిన జనులను ఉద్ధరించాల్సిన తక్షణ అవసరాన్ని తెలియజేశారు. ఆధునిక భారతదేశంలో పేదల అభ్యున్నతికై పాటుపడమని బోధించి వివిధ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ప్రప్రథమ యతివరేణ్యుడు వివేకానంద. రామకృష్ణ మఠం స్థాపించి అందరి అవసరాలకు బాసటగా నిలిచిని గొప్ప వ్యక్తి స్వామిజీ.

అమెరికా మరియ విదేశాల్లో తన ప్రసంగంద్వారా ఎందరినో ఆకట్టుకొని భారతదేశమునకు తిరిగి వచ్చిన తర్వాత ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తూ...

నా ప్రియాతిప్రియమైన ప్రజలారా.. భారతదేశ ముద్దు బిడ్డలారా... అమృత పుత్రులారా.. ఋషి బిడ్డలారా.. నేడు జరుగుతున్న సన్మానమూ, మర్యాద, ఏ రాజకీయ నాయకుడికో, ఏ వ్యాపారవేత్తకో, ఏ కళాకారుడికో, ధనవంతుడికో జరుగుతున్నది కాదు. రేపటి రోజు భోజనం ఉంటుందో లేదో తెలియని, భగవంతుడినే హృదయంలో నింపుకుని జీవించే ఒక దేశ దిమ్మరియైన సన్యాసికి జరుగుతున్నది. భారతదేశం యొక్క ఆయువు పట్టు దాని ఆధ్యాత్మికతా, భగవన్మయ జీవనంలోనే ఉన్నదనదానికి ఇంతకంటే గొప్ప నిదర్శనం మరొకటి ఉండదు. లేవండి! మేల్కోండి! మనుష్యులవ్వండి! మనం బానిసలమనీ, ఎందుకూ పనికిరాని వారమనీ, మన పూర్వీకులు చెప్పినదంతా హాస్యాస్పదమనీ ఎవడో బయటివాడు వచ్చి చెప్పగానే నిజమేనని నమ్మి వాడి బూట్లు తుడవడం ఎంత హేయం! ఎంత దయనీయం! నా భారతదేశ యువ కిశోరాల్లారా, నా ఆశలన్నీ మీ పైనే ఉన్నాయి. మీరు అనంత శక్తి సంపన్నులు. దేన్నైనాసరే సాధించే శక్తి యుక్తులు మీలో ఉన్నాయి. మీరు గొర్రె లని అనుకోవద్దు. సింహాలు మీరు. మీరు లేచి జూలు విదిలించి ఒక్కసారి గాండ్రిస్తే కుయుక్తులతో నక్కలవలె చుట్టు ముట్టిన బలహినతలన్నీ దుష్ట శక్తులన్నీ మిమ్మల్ని చూసి, మీ సింహ నినాదం విని, గుండెలు జారి పారిపోతాయి. లేవండి! మేల్కోండి! గమ్యం చేరేవరకూ విశ్రమించకండి! అని పిలుపునిచ్చారు.



"అపార విశ్వాసం, అనంత శక్తి ఇవే విజయసాధనకు మార్గాలని,సేవకుడిగా ఉండడం నేర్చుకుంటే, నాయకుడయ్యే యోగ్యత లభిస్తుంది. అఖండమైన ఉత్సాహం, అపరిమితమైన ధైర్యం, అప్రతిహతమైన శక్తి.. అన్నింటిని మించి పరిపూర్ణవిధేయత, ఈ లక్షణాలు ఒక వ్యక్తినిగాని, ఒకదేశాన్ని గాని పునరుజ్జీవింప చేయగలవని ఎన్నో మార్లు తెలియచేసిన యువసన్యాసి, యోగిపుంగవుడు స్వామిజీ వివేకానంద.

లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాశక్తులను, లక్ష్య సాధనలో సైతం చూపించడమే విజయారహస్యం అని, మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి. బలహీన పరిచే ప్రతి ఆలోచననూ తిరస్కరించండని ఎన్నోమార్లు యువతకు వెన్నుతట్టిన యువ నేత స్వామి వివేకానంద. మీరెలా ఆలోచిస్తే అలాగే తయారవుతారని, బలహీనులమని భావిస్తే, బలహీనులే అవుతారని, శక్తిని స్మరిస్తే శక్తిమంతులు అవుతారని యువతకు సందేశమిచ్చిన హిందు కర్మయోగి స్వామి వివేకానంద.. సమస్త శక్తి మీలోనే ఉంది. అసమర్థులమని భావించకండి. మీరు ఏమైనా చేయగలరు,అన్నింటిని సాధించ గలరని ప్రతి రంగంలో ముందు ఉండాల్సింది యువతేనని ప్రోత్సహిస్తూ.. వారిని కార్యోన్ముఖులను చేసాడు స్వామి వివేకానంద.

"లేచి నిలబడు, ధైర్యం వహించు, బలవంతుడివికా, భాద్యతనంతా నీ భుజాలపైనే వేసుకొని, నీ విధికి నీవే కర్తవని తెలుసుకో. నీకు కావాల్సిన బలం,సహాయం అంతా నీలోనే ఉంది. అందుకే నీ భవితవ్యాన్ని నీవే నిర్మించుకో" అని యువత శక్తి సామర్థ్యాలను గుర్తింపచేశాడు స్వామి వివేకానంద. బలమే జీవనం, బలహీనతే మరణం. బలం సంక్షేమాన్ని, అంతమే లేని జీవితాన్ని, అమరత్వాన్ని ప్రసాదిస్తుందని,

బలహీనత అంతులేని శ్రమను,దుఃఖాన్ని కలిగిస్తుందని అదే బలహీనత మరణమని ఎన్నో మార్లు తన ప్రసంగాల్లో తెలియ చేసిన యోగిపుంగవుడు స్వామి వివేకానంద.

మొదట మన లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలి. తర్వాత దాన్ని ఆచరణలో పెట్టె మార్గాలను అన్వేషించాలని యువకులకు ఉద్బోధ చేసిన గొప్ప వక్త వివేకానంద. దృడ సంకల్పం, పవిత్ర ఆశయం తప్పక సత్ఫలితాలను ఇస్తాయని, వీటిని ఆయుధాలుగా గ్రహించిన వారు కొద్దిమందే అయినా, అన్ని విఘ్నాలను ఎదుర్కొని నిలువగలిగారని ఎల్లవేళలా నిలువగలుగతారాని తెలియచేసిన విద్యావేత్త స్వామి వివేకానంద.


ఆధునిక యవతరానికి స్వామీజీ మాత్రమే ఆదర్శం. ఆయన జీవిత కాలం ముప్పై తొమ్మిది సంవత్సరాల ఆరునెలలు. ఇంతటి స్వల్ప జీవితంలోనే ఆయన ఎంతో సాధించారు. మానవాళి సంక్షేమానికి, అభ్యున్నతికి, ఆధ్యాత్మికోన్నతికీ తన యౌవన జీవితంతోనే ఇంతగా కృషిచేసినవారు చరిత్రలో కొద్దిమంది మాత్రమే ఉన్నారు.అందులో ప్రథముడు స్వామి వివేకానంద.

భరత మాత దాస్యశృంఖలాలు తెంచడానికి మా దేశపౌరులు సిద్ధంగా ఉన్నారు. స్వాతంత్రం అనంతరం దేశపటిష్ఠత కోసమే తన తపన అని ఎన్నోమార్లు తెలియ చేసిన గొప్ప వక్త మన స్వామిజీ.

స్వామీజీ తన జీవితాంతం ఎంతో శ్రమపడి కష్టపడి పని చేశారు. తుదకు స్వామిజీ భౌతిక జీవితం ముగిసింది. కానీ ఆయన పని కొనసాగుతూనే ఉంది. “లేవండి! మేల్కొనండి! గమ్యం చేరే వరకూ విశ్రమించకండి!” అని తన దేశ ప్రజలకి పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగాలలో ఉన్న జ్ఞానాన్ని, ఇచ్చిన ధైర్యాన్ని ఉపయోగించుకొని మొదలైన నవ భారత నిర్మాణం, దేశానికి స్వాతంత్రం రావడంతోనే కాక ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది.

ఇప్పుడు యువత చేతుల్లోనే మన భవిత ఉన్నదనేది వాస్తవం. ఆధునికత వైపు పరుగులు పెడుతున్న నేటితరం యువత ఆధునికత అంటే నైతిక, ఆధ్యాత్మిక, సామాజిక స్పృహ అనే విలువల పట్ల తిరస్కార భావం కాదని తెలుసుకొని, భారతదేశ సాంస్కృతి సంప్రదాయాలను తెలుసుకొని, భారతజాతి నిండు గౌరవాన్ని కాపాడుకోవాలన్న తపనతో, ప్రతికులా ప్రాబల్యాలకు లోనుకాకుండా, శక్తిని, ఉత్సాహాన్ని, దేశభక్తిని, ఆత్మవిశ్వశాన్ని కలిగించిన వ్యక్తి స్వామి వివేకానంద అని యువత గుర్తించింది.

ఎందరికో జ్ఞానోదయం కలిగించి, ఆధ్యాత్మిక ప్రపంచాన్ని పరిచయం చేసి,భారత దేశం అంటే ఒక సంస్కృతి కలిగిన గొప్పదేశం అని విశ్వానికి తెలియ చేసి జులై 4, 1902 న విశ్వాంతరాల్లోకి వెళ్లిన దివ్యజ్ఞాని స్వామిజీ. నేను నా శరీరాన్ని వదిలిపెట్టినా,నేను పూర్తిచేయవలసిన కార్యాలను పూర్తి చేసే విదంగా రాబోవు తరాల వారిని కార్యనిర్వహణ కొరకు ప్రేరేపిస్తుంటాను." అని చాలా సందర్భాల్లో ఆశాభావం వ్యక్తం చేసిన మాటను నిజం చేసి, దేశ అభివృద్ధికి బాటలు వేయవాల్సిన యువత నడుం బిగించాల్సిన అవసరం ఉంది..



-గడప రఘుపతిరావు
రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత
9963499282
raghupatiraog@gmail.com



# నిత్యం ప్రజా సేవలో ఉంటేనే అవకాశాలు

**రాజకీయాలకు అతీతంగా సమస్యలు పరిష్కరిద్దాం**
**మండల పరిషత్ ఆత్మీయ సత్కార కార్యక్రమాల్లో మంత్రి పొన్నం**

**విశ్వంభర, హుస్నాబాద్ :** మండల ప్రజా పరిషత్ సభ్యుల 5 సంవత్సరాల పదవీకాలం ముగుస్తుండడంతో హుస్నాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో జరిగిన ఆత్మీయ సత్కార కార్యక్రమాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని చిగురు మామిడి, సైదాపూర్, కోహెడ మండల కేంద్రాల్లోనీ మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సన్మాన సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో ఎన్నికల వరకే రాజకీయాలు అని ఎన్నికల తర్వాత అభివృద్ధి ప్రజా సమస్యల్లో భాగస్వామ్యం కావడమే రాజకీయ నాయకుడి లక్ష్యమని తెలిపారు. పదవి కాలం పూర్తి చేసుకున్న ఎంపిపి , జడ్పీటీసీ, ఎంపిటిసిలకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ లో మరిన్ని పదవుల్లో ఎదగాలని కోరారు. రాజకీయాల్లో ఉండాలనుకునే వారు నిత్యం ప్రజా సేవలో ప్రజాస్వామ్య పద్ధతిలో ఉండాలని సూచించారు. మాజీలు అయిన తరువాత కూడా గౌరవం దక్కేలా వ్యవహార శైలి ఉండాలని సూచించారు. రాజకీయాల్లో ఎవరు శాశ్వతం కాదని అవకాశం వచ్చినప్పుడు ఉపయోగించుకోవాలని సూచించారు. రాజకీయ జీవితంలో పూర్తి చేసిన పనులు చేయని పనులు ఉగాది పచ్చడి వలె తీపి, చెదులగా ఉండాలని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యలు పరిష్కరిద్దామని సూచించారు. తమది నియంతృత్వం ప్రభుత్వం కాదని ప్రజా పాలన ద్వారా ప్రజా ప్రభుత్వాన్ని అందిస్తున్నామన్నారు. విద్యా ,వైద్యం ,వ్యవసాయం పైనే తన ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. తను ఎన్ఎస్‌యూఐ విద్యార్థి నాయకుడిగా, ఎస్ ఆర్ఆర్ కాలేజి అధ్యక్షుడిగా , మార్క్ ఫెడ్ చైర్మన్‌గా, సింగిల్ విండో చైర్మన్ గా, ఎంపిగా, ఇప్పుడు ఎమ్మెల్యే మంత్రిగా కింది స్థాయి నుండి వచ్చానని గ్రామాల్లో ఎలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నియోజకవర్గంలో గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తిచేసి వ్యవసాయానికి నీళ్ళు అందించడమే తన లక్ష్యం అన్నారు. కాలువలకు జరుగుతున్న సర్వేలో రైతులు సహకరించాలని కోరారు. అటు ఆత్మీయ సత్కారం తోపాటు కోహెడ ,చిగురు మామిడి మండలాల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మండల అభివృద్ధి రోడ్లు, విద్యా, వైద్యం, వ్యవసాయం, విద్యుత్ తదితర అంశాలపై అధికారులను ఆరా తీశారు. చిగురు మామిడి మండలంలో జాతీయ చిహ్నం స్థూపాన్ని ఆవిష్కరించారు. వీటితో పాటు సైదాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యక్రమంలో వన మహోత్సవంలో పాల్గొని అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఆత్మీయ సమావేశాల్లో కోహెడ , చిగురు మామిడి, సైదాపూర్ మండల ఎంపిపిలు, జడ్పీటిసిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

# పెండింగ్ బిల్లుల విడుదలకు కృషి చేయాలి

**కేటీఆర్‌కు సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డి వినతి**



**విశ్వంభర, ఆమనగల్లు :** తెలంగాణ రాష్ట్రంలో గ్రామపంచాయతీలను పట్టించుకునే నాథుడు లేక పాలన పడకేసిందని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రివర్యులు కేటీఆర్‌ని కలిసి ప్రస్తుత గ్రామపంచాయతీల పరిస్థితిని వివరించారు. గ్రామాల అభివృద్ధి ముఖ్యమని గత ప్రభుత్వంలో చేపట్టిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. పారిశుధ్యం పడకేసింది, రాష్ట్ర ప్రభుత్వం ఏడు నెలల్లో నయా పైసా కూడా పల్లె, పట్టణాలకు విడుదల చేయలేదని, పెండింగ్ బిల్లుల విషయమై ఇటీవల రాష్ట్ర గవర్నర్ గారిని కలిసి మొరపెట్టుకున్నా ప్రభుత్వం నుండి ఎలాంటి చలనం లేదు అని, పారిశుధ్య కార్మికులకు 7 నెలల నుండి జీతాలు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగులో ఉన్న సర్పంచుల బిల్లులు మరియు పారిశుధ్య కార్మికులకు జీతాలు తక్షణం ఇచ్చేవిధంగా అసెంబ్లీలో తమ గళాన్ని వినిపించాలని కేటీఆర్‌ను కోరినట్లు తెలిపారు. సర్పంచుల పెండింగు బిల్లులు, రావలసిన నిధులు వచ్చేవరకు తమ మద్దతు పూర్తిగా ఉంటుందని కేటీఆర్ తెలిపినట్లు సంఘం నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు బొజ్జ రామేశ్వర్ రెడ్డి, యాది రెడ్డి,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ హాస్టల్ విద్యార్థి మరణంపై సమగ్ర విచారణ జరపాలి

**కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి**

**విశ్వంభర, సూర్యపేట :** ఆత్మకూరు మండలం ఎస్సి హాస్టల్ విద్యార్థి అనుమానస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపి, ఆ విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి ప్రభుత్వం డిమాండ్ చేశారు. బుధవారం ఎంవీఎన్ భవన్లో జరిగిన కెవిపిఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ హాస్టల్ విద్యార్థి అనుమానాస్పద మృతి భాదకరమన్నారు. హాస్టల్లలో వార్డెన్‌ల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల సమస్యలు పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారులు హాస్టల్లోని సందర్శించి వార్డెన్లో పనితీరును పర్యవేక్షణ ఉండాలన్నారు. అనుమానస్పదంగా మృతి చెందిన హాస్టల్ విద్యార్థి మరణంపై సమగ్ర విచారణ జరిపి కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు మరి నాగేశ్వర రావు జిల్లా నాయకులు నందిగామ సైదులు పిండిగా నాగమణి సుధాకర్ దుర్గారావు వీర బాబు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఏడు మండలాల సంగతి తేల్చండి

**• తర్వాతే చంద్రబాబుతో భేటీ కావాలి • సీఎం రేవంత్‌కు హరీశ్ సూచన**



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఏడు మండలాలపై తేల్చాకే ఏపీ సీఎం చంద్రబాబుతో రేవంత్‌రెడ్డి చర్చించాలని బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఏడు మండలాలు, లోయర్ సీలేరును ఏపీలో కలపడాన్ని అప్పట్లో కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి సహచరుడు చంద్రబాబు మీదనే ఎన్డీయే ప్రభుత్వం ఆధారపడి ఉన్నదని, కాబట్టి చంద్రబాబుపై ఒత్తిడి చేసి తెలంగాణ కోల్పోయిన ఏడు మండలాలు, లోయర్ సీలేరు మనకు వచ్చేలా చేయాలని రేవంత్‌ను కోరారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడు నెలల కాలంలో పట్టణాలు, పంచాయతీలకు పైసా కూడా ఇవ్వకపోవడంతో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయిందని, దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పట్టణ ప్రగతి, పల్లెప్రగతి ద్వారా ప్రతినెలా స్థానిక సంస్థలకు టంచన్‌గా నిధులు విడుదల చేశామని గుర్తుచేశారు. తెలంగాణ పల్లెలను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దామని, పల్లెలు అద్దాల్లా మారాయని, జాతీయస్థాయిలో అవార్డులు ప్రకటిస్తే తెలంగాణ కూడా ఉండేదని గుర్తుచేశారు.

# మరో చేనేత కార్మికుడి ఆత్మహత్య

**కాంగ్రెస్ హత్యే అన్న కేటీఆర్**



**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ సర్కారు పరిపాలనా వైఫల్యం వల్లే సిరిసిల్లలో మరో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేక ఉరి వేసుకుని పల్లె యాదగిరి అనే కార్మికుడు ఆత్మ హత్య చేసుకోవడంపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది ఆత్మహత్య కాదని, ముమ్మాటికీ ప్రభుత్వం చేసిన హత్యేనని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో చేనేత రంగం పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేనేతకు అందించిన చేయూతను అర్ధాంతరంగా నిలిపివేయడంతోనే ఈ రంగంలో మరణమృదంగం మోగుతోందని ధ్వజమెత్తారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తెలంగాణలో పదేళ్ల తరువాత మళ్లీ నేతన్నల ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని, మళ్లీ సమైక్యరాష్ట్రం నాటి సంక్షోభం తలెత్తిందని కొద్ది రోజుల క్రితం కేటీఆర్ పేర్కొన్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలను, నేతన్నలకు ఆర్డర్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఆపేసిందని కేటీఆర్ గుర్తు చేశారు. గతంలో అందిన ప్రతి కార్యక్రమాన్ని వెంటనే ప్రభుత్వం అమలు చేయాలి. కేవలం గత ప్రభుత్వంపై కక్షతో నేతన్నల ప్రాణాలు బలిపెట్టవద్దు. గతంలో నేతన్నలకు తమ పార్టీ, ప్రభుత్వం చేసిన కార్యక్రమాలను ప్రస్తావిస్తూ ఈ ఏడాది జూన్ 24వ తేదీన సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.

# సెక్రటేరియట్ లో మంత్రి కోమటిరెడ్డి తనిఖీలు

**• అధికారుల నిర్లక్ష్యంపై ఫైర్ • సమయపాలన పాలించాలంటూ ఆదేశాలు**



**విశ్వంభర, హైదరాబాద్ :** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆర్ అండ్ బీ సెక్షన్‌లో తనిఖీలు చేశారు. సెక్రటేరియట్‌లో ఉద్యోగుల పనితీరు గురించి తెలుసుకోడానికి వెళ్లిన మంత్రి.. అక్కడ పరిస్థితి చూసి నిర్ఘాంతపోయారు. ఆర్‌అండ్‌బీ సెక్షన్‌లో ఆకస్మిక తనిఖీలు చేసిన ఆయనకు.. ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. సమయం దాటిపోయినా చాలా మంది ఉద్యోగులు ఆఫీసుకు రాకపోవడంతో మంత్రి వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణంగా ఉద్యోగులు ఉదయం 10 గంటలకు కార్యాలయాలకు హాజరు కావాల్సి ఉంటుంది. కానీ, సెక్రటేరియట్ ఉద్యోగులు మాత్రం 11 గంటలైనా రాకపోవడంతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మండిపడ్డారు. 11 అయినా రాలేదు.. మళ్లీ 6గంటలకు వెళ్లిపోతారు.. మధ్యలో ఆఫ్ అంటూ మంత్రి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతోపాటు పలు వివరాలను మంత్రి కోమటిరెడ్డి అడిగి తెలుసుకున్నారు.. కొన్ని విషయాలపై అధికారులు స్పందించకపోవడంతో మీ వివరాలు మీకు కూడా తెలియదా అంటూ ఫైర్ అయ్యారు. ఇకపై ఉద్యోగులు సమయపాలన పాటించాలని.. ఇలా కుదరదంటూ వార్నింగ్ ఇచ్చారు.

# తలలో పెన్ను గుచ్చుకున్న చిన్నారి మృతి



**విశ్వంభర, భద్రాచలం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఓ బాలిక తలలో పెన్ను గుచ్చుకోవడంతో మరణించింది. భద్రాచలంలో ఈ ఘటన జరిగింది. స్థానిక సుభాష్ నగర్లో నివాసం ఉంటున్న బాలిక మంచంపై ఆడుకుంటూ కిందపడింది. దాంతో కింద ఉన్న పెన్ను గుచ్చుకుందని స్థానికులు తెలిపారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మరణించింది. సుభాష్ నగర్ లో ఉంటున్న రియాన్షిక అనే 5 ఏళ్ల చిన్నారి తలలో పెన్ను గుచ్చుకోవడంతో దుర్మరణం చెందిందని పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పాప మంచంపై కూర్చొని రాసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు బాలిక కిందపడింది. మంచం పక్కనే ఉన్న ఓ పెన్ను చిన్నారి కణితి వద్ద తలలోకి దిగింది. దీన్ని గుర్తించిన తల్లిదండ్రులు వెంటనే బాలికను భద్రాచలంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అక్కడ రియాన్షికకు మెరుగైన వైద్యం అందకపోవడంతో.. డాక్టర్లు సూచన మేరకు ఖమ్మం లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స జరుగుతుండగా చిన్నారి చనిపోయింది. బాలిక రియాన్షిక అకాల దుర్మరణంతో వారి కుటుంబంలో తీవ్రమైన విషాదం నెలకొంది. భద్రాచలం పట్టణంలో జరిగిన ఈ విషాద ఘటన అందరిని కలిసి వేసింది.



# చంద్రబాబు శిష్యుడు రేవంత్ కాదు

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్లారిటీ**

**విశ్వంభర, హైదరాబాద్ :** చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి అనే మాటలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఫైర్ అయ్యారు. అలా అనకూడదని రేవంత్ రెడ్డి చాలా సార్లు చెప్పారని భట్టి గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి చంద్రబాబు ఎలాంటి గురువు కాదని, చంద్రబాబు రేవంత్ రెడ్డికి కేవలం సహచరుడు మాత్రమే అని స్పష్టం చేశారు. అది కూడా కొన్నేళ్ళ క్రితం నాటి పరిస్థితి అన్నారు. ఇప్పుడు ఎవరిదారి వారిదని, చంద్రబాబు ఏపీకి ముఖ్యమంత్రి అయితే, రేవంత్ రెడ్డి తెలంగాణకు సీఎం అని అన్నారు. "ఇద్దరు సహచర ముఖ్యమంత్రులమే తప్ప గురు శిష్యులం కాదని రేవంత్ రెడ్డి చెప్పారు. చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి రెండు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులు. విభజన చట్టంలో ఏడు మండలాల విలీనం అంశం లేదు. బీఆర్ఎస్ ఆర్డినెన్స్ తెచ్చి ఏపీకి అప్పజెప్పింది. ఏడు మండలాలు పోవడానికి కారణం బీఆర్ఎస్, బీజేపీలే" అని భట్టి విక్రమార్క అన్నారు.

## సీపీగెట్ హాల్‌టికెట్లు విడుదల

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణలోని కళాశాల్లో పీజీ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే 'పీజీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష -2023 హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. అధికారిక వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబరు, పుట్టినతేదీ, పరీక్ష పేపరు వివరాలు నమోదుచేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రకటించిన షెడ్యూలు ప్రకారం జులై 6 నుంచి 15 మధ్య సీపీగెట్ పరీక్షలు నిర్వహించనున్నారు. అయితే మొదట జులై 6 నుంచి 9 వరకు జరిగే పరీక్షల హాల్‌టికెట్లను మాత్రమే అధికారులు విడుదల చేశారు. మిగతా పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను తర్వాత విడుదల చేయనున్నారు. ఆయా తేదీల్లో ప్రతిరోజూ మూడు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు మొదటి సెషన్‌లో, మధ్యాహ్నం 1 గంట నుంచి 2.230 గంటల వరకు రెండో సెషన్‌లో, సాయంత్రం 4.30 గంటల నుంచి 6 గంటల వరకు మూడో సెషన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు.



# ఎల్‌కే అద్వానీకి అస్వస్థత

**• ఢిల్లీ అపోలో ఆస్పత్రిలో చికిత్స**
**• ప్రస్తుతం నిలకడగా ఉందన్న వైద్యులు**

**విశ్వంభర, ఢిల్లీ:** బీజేపీ అగ్రనేత లాల్ కృష్ణ అద్వానీ ఆరోగ్యం క్షీణించింది. దీంతో ఆయన్ను న్యూఢిల్లీలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. ప్రస్తుతం ఎల్‌కే అద్వానీ డాక్టర్ల పర్యవేక్షణలో ఉన్నారు. అయితే ప్రస్తుతానికి ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యులు ఓ ప్రకటనలో తెలిపారు. గత నెల 27న ఎల్‌కే అద్వానీ అస్వస్థతకు గురికావడంతో ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేర్చిన విషయం తెలిసిందే.



# ఎంపీటీసీలను సన్మానించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

**విశ్వంభర, ఘట్కేసర్ :** మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎంపీటీసీల పదవికాలం పూర్తి అయినా సందర్భంగా బుధవారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై ప్రజాప్రతినిధులకు ఘట్కేసర్ ఎంపిపి సుదర్శన్ రెడ్డిని, ఎంపీటీసీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచ్లు గ్రామ సెక్రెటరీలు మాజీ వైస్ ఎంపీపీ జంగమ్మ, ఘట్కేసర్ మున్సిపల్ టీఆర్ఎస్ అధ్యక్షులు బండారు శ్రీనివాస్ గౌడ్, మంద సంజీవరెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది, కో అప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీం కోర్టు ప్రత్యేక లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**విశ్వంభర, భూపాలపల్లి :** భారత సుప్రీం కోర్టులో పెండింగ్ లో వున్న కేసులను సామరస్య పరిష్కారానికై మరియు సత్వర న్యాయం అందించుటకు 29 , జులై 2024 నుండి 3 ఆగష్టు 2024 వరకు ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించాలని సుప్రీం కోర్టు నిర్ణయించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణబాబు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వాస్తవ్యులు ఎవరైనా సుప్రీం కోర్టులో కేసులు ఎదుర్కుంటున్నట్లయితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిని గాని, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి, హైదరాబాద్ వారిని సంప్రదించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తిగారు తెలిపారు. సుప్రీం కోర్టులో కేసులు ఎదుర్కుంటున్న కక్షిదారులు మరిన్ని వివరాలకోసం 040 - 23446723 నెంబర్ లో సంప్రదించాలని జడ్జి సూచించారు.



# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

**విశ్వంభర, నారాయణఖేడ్ :** రోజురోజుకు పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండే విధంగా నియోజకవర్గంలో ముందు జాగ్రత్త సరిగా ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నామని పెద్ద శంకరంపేట ఎస్సై శంకర్ పేర్కొన్నారు. బుధవారం పెద్ద శంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల వల్ల ఎంతోమంది ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆర్థికంగా నష్టపోతున్నారని సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని భావించి జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థుల నుండి ప్రతి ఒక్కరికి ఈ విషయమే అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. సైబర్ జాగృతి దివస్ సందర్భంగా శంకరంపేట మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవేర్నెస్ కార్యక్రమము నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ ఏ విధంగా జరుగుతున్నది వాటి నుండి ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అన్న వాటి గురించి తెలియజేయడం జరిగింది. ఓటిపి ఫ్రాన్స్, ఫ్రాడ్ లింక్స్, క్రెడిట్ కార్డ్ ఫ్రాడ్స్ లాంటి సైబర్ క్రైమ్స్ గురించి తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ అవినాష్ రెడ్డి మరియు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్పీ ధారావత్ జానకిని సన్మానించిన స్థానిక ప్రజాప్రతినిధులు



**విశ్వంభర, షాద్‌నగర్ :** మహబూబ్ నగర్ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ధారావత్ జానకిని స్థానిక ప్రజాప్రతినిధులు కలిశారు. బుధవారం ఫరూక్ నగర్ మండలం ఉప్పరిగడ్డ మాజీ సర్పంచ్ సుమితా చందు నాయక్, కుందేలు కుంట తండా మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్, రవీందర్, మల్లేష్ నాయక్‌లు నూతన ఎస్పీ ధారావత్ జానకిని తన కార్యాలయంలో కలిసి పూల బొకే ఇవ్వడంతో పాటు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గతంలో షాద్‌నగర్ ప్రొబేషనరీ డీఎస్పీగా బాధ్యతలు నిర్వహించారని గుర్తు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పాటుపడే ధారావత్ జానకికి జిల్లా ఎస్పీ బాధ్యతలు ప్రభుత్వం అప్పగించడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ముమ్ముందు మరిన్ని ఉన్నతమైన పదవులు పొంది ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. క్రింది స్థాయి నుండి ఒక జిల్లా స్థాయి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు అంటే విధుల పట్ల ఆమెకు ఎంత గౌరవం ఉందో అర్థమవుతుందని తెలిపారు.

# ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా మహా రక్తదానం



**విశ్వంభర, చింతపల్లి :** దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలునాయక్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం నియోజకవర్గ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. చింతపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన కేకును ఎమ్మెల్యే కోసి తన పుట్టిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి తనపై అభిమానం చాటుకున్నారు. పార్టీ కార్యక్రమాలతోపాటు సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటామని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు మరోసారి నిరూపించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, ఎమ్మెల్యే అభిమానులు సుమారు 60 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ కొండూరి భవాని పవన్ కుమార్, సంజీవ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం, వైస్‌ఎంపీపీ యాది గౌడ్, మాజీ సర్పంచ్ ముచ్చర్ల గిరి, పిఎసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, అంగిరేకుల గోవర్ధన్, ఎరుకల వెంకటయ్య గౌడ్, కొండల్, శ్రీనివాస్ రెడ్డి, హరి నాయక్, రవి నాయక్, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# మానవ మనుగడకు మొక్కలు అవసరం

## మంత్రి శ్రీధర్ బాబు



**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. బుధవారం మహదేవపూర్ ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం 26.129లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. మొక్కలు పెంపకం వల్ల పచ్చదనం ఆహ్లాదకరమైన వాతావరణ ఏర్పడుతుందని, తద్వారా కాలుష్యం నుండి ప్రజలకు రక్షణ కలుగుతుందని అన్నారు. మనిషి మనుగడకు చెట్లు చాలా అవసరం అని చెట్లను పెంచడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణంతో మనిషికి ఆహ్లాదకరమైన జీవనయానం సమకూరుతుందని ఆయన తెలిపారు. మానవాళి మనుగడకు మొక్కలు చాలా అవసరమని మొక్కల ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతి ఒక్క మొక్క సంరక్షణను బాధ్యతగా చేపట్టాలని ఆయన సూచించారు. జిల్లాలో ఖాళీ ప్రదేశాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ నరేష్, జడ్పి సీఈవో విజయలక్ష్మి, అదనపు డిఆర్డీవో పసుమతి పాల్గొన్నారు.

# అభివృద్ధి కార్యక్రమాల్లో ఆలేరు ప్రభుత్వ విప్ ఐలయ్య



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలో బుధవారం పలు గ్రామల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని సిద్ధాపురరాం గ్రామంలో యాదవ సంఘం భవనం, పల్లెర్ల గ్రామంలో మహిళ భవనం, రజక భవన నిర్మాణ పనులకు బీర్ల ఐలయ్య శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ వెల్మినేటీ సందీప్ రెడ్డి, స్థానిక ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలం గౌడ్, జడ్పీటీసీ కొడిత్యాల నరెందర్ గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్ రెడ్డి, తదితర ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**విశ్వంభర, కోరుట్ల :** పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల పట్టణంతోపాటు మండలంలోని వివిధ గ్రామాలకు రూ.4,605,336 విలువగల 46 కళ్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, పార్టీ మండల అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, ఎంపీపీ తోట నారాయణ, కౌన్సిలర్లు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజాభిప్రాయ సేకరణ సభ



**విశ్వంభర, ఆమనగల్లు :** రైతు భరోసా పథకం అమలుపై పిఎసిఎస్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పిఎసిఎస్ చైర్మన్ డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని రైతు వేదికలో గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్ పట్టణంలోని పిఎసిఎస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ రైతు భరోసా పథకం ద్వారా లబ్ధి కలిగేలా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా డిసిఒ ధాత్రిదేవి, మేడ్చల్ డిఆర్ఏఓ నాగలింగం ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి రైతులు ప్రజలు హాజరై తమ అభిప్రాయాలను తెలుపాలని వెంకటేష్ కోరారు. రైతుల అభిప్రాయాలను పిఎసిఎస్ ద్వారా ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో వైస్ చైర్మన్ ధోనాదునాల సత్యం, సీఈఓ దేవేందర్, పిఎసిఎస్ డైరెక్టర్ జోగు వీరయ్య పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి




**విశ్వంభర, దేవరకొండ :** దేవరకొండ పట్టణంలో ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, బుడిగ వెంకటేష్ మాట్లాడుతూ జులై 4వ తేదీన భారతదేశ వ్యాప్తంగా కేజీ టు పీజీ విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలని కోరారు. నెట్, నీట్ పరీక్షలు రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని, పీహెచ్డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనుక తీసుకోవాలని, టిఐఎస్ఎస్ ముంబై, ఐఐటీ ముంబై నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు, యూనివర్సిటీలలో స్వేచ్ఛ వ్యక్తీకరణ ప్రజాస్వామ్య అంచివేత చర్యలను ఆపాలని, పాఠశాలల మూసివేతను ఆపేయాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ రంగ సంస్థల్లో మౌలిక కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 4న జరిగే విద్యాసంస్థల బంద్ లో విద్యార్థులు తల్లిదండ్రులు మేధావులు విద్యా సంస్థల యాజమాన్యాలు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు సురిగి వినయ్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, నాయకులు కాంపల్లి భాను, బొల్లె అరవింద్, వెంకటేష్, దేవేందర్, ఉదయ్, శశ్వంత నవిన్, సిద్దు, అరుణ్, శివ, బన్ని, జగదీష్, రవి తేజ, రాము తదితరులు ఉన్నారు.



# తెలంగాణ బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ సెక్రటరీగా లక్ష్మీ ప్రసన్న

**విశ్వంభర, బషీర్ బాగ్:** తెలంగాణ బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ సెక్రటరీగా పంతంగి లక్ష్మీ ప్రసన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం దోమలగూడలోని పీఈటి కాలేజీలో తెలంగాణ బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ ఇండియా ప్రెసిడెంట్ నిఖిల్ తాంబే పంతంగి లక్ష్మీ ప్రసన్న ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ ఎన్నికైన పంతంగి లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ తెలంగాణలో బాటిల్ స్పోర్ట్స్ డాన్స్ క్రీడలను విస్తృతంగా ప్రాచుర్యంలోకి తెచ్చే విధంగా తన వంతుగా నిరంతరం కృషి చేస్తానని ఆమె స్పష్టం చేశారు. క్రీడాకారులకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేసి రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామీణ స్థాయి వరకు ఈ క్రీడలను విస్తరింప చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటి, ఫిజికల్ డైరెక్టర్, వివిధ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.




# ఎస్ఐ శ్రీనివాస్‌కు శుభాకాంక్షల వెల్లువ

**విశ్వంభర, ఆమనగల్లు :** అమనగల్లు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ని బుధవారం కెఎన్ఆర్ యువసేన నాయకుడు విజయ్ రాథోడ్, కాంగ్రెస్ నాయకులు మెకానిక్ బాబా, నూతనగంటి భాస్కర్, పలువురు ప్రముఖులు వివిధ పార్టీల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు గిరిజన ఆరాధ్యదైవం సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్ చిత్రపటాన్ని విజయ్ అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆమనగల్లు మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీను, తెనాలి, భాస్కర్, కిషన్, జయందర్ పాల్గొన్నారు.

# రామలింగేశ్వర ఆలయంలో స్వచ్ఛ భారత్

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం బుధవారం బీజేపీ మండల అధ్యక్షులు గజరాజ్ కాశినాధ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు వట్టి పల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చ కార్యదర్శి బండారు సత్యనారాయణ, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు ఆంజనేయులు, మండల కార్యదర్శి నర్సింహా, ఎస్సీ మోర్చ మండల అధ్యక్షులు మేడి సాగర్, ఎస్సీ మోర్చ మండల ప్రధాన కార్యదర్శి మధు, బీజేవైఎం మండల అధికార ప్రతినిధి సూర్య, సోషల్ మీడియా కన్వీనర్ సాయి, బూత్ అధ్యక్షులు లోడి వెంకటయ్య, నాయకులు స్వామి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సేవ అవకాశం రావడం అదృష్టం

## నారాయణపూర్ ఎంపీపీ గుత్త ఉమాదేవి



**విశ్వంభర, నారాయణపూర్ :** పేద ప్రజలకు సేవ చేసే భాగ్యం రావడం తన అదృష్టమని రాజకీయాలు కొత్త అయినప్పటికీ ఆడబిడ్డగా ఆదరించిన ప్రజలకు పరిపాలనలో సహకరించిన అధికారులకు నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమా ప్రేమ్చందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. నారాయణపురం మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీల పదవీ కాలం నేటితో ముగియనుండడంతో బుధవారం ఏర్పాటు చేసిన పదవీ విరమణ వీడ్కోలు సమావేశంలో మండల పరిషత్ అధికారులు వివిధ పార్టీల నాయకులు గ్రామ ప్రజలు హాజరై ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుత్త ఉమాదేవి మాట్లాడుతూ 5 సంవత్సరాల కాలంలో ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నప్పటికీ తన వెంట ఉన్న ప్రజానీకానికి సహకరించిన అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వీరమల్ల భానుమతి వెంకటేష్ గౌడ్, ఎంపిటిసిలు బచ్చన గోని గాలయ్య యాదవ్, మర్రి వసంత , కరంటోత్ విజయ, మండల ప్రజా పరిషత్తు అధికారులు, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజాప్రతినిధుల వీడ్కోలు సమావేశం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలంగౌడ్ మరియు ఎంపీటీసీ సభ్యులకు బుధవారం జన్నాయికోడే అమృతమ్మ శంకరయ్య గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన పదవి ముగింపు వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. విప్ మాట్లాడుతూ.. పదవులు శాశ్వతం కాదు అని పదవులు లేకపోయినను ప్రజలతో అనుబంధాలు శాశ్వతంగా ఉంటాయని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటు వారికి సహాయ సహకారాలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొని ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలంగౌడ్ని, జడ్పీటీసీ కొడిత్యాల నరెందర్ గుప్తాని, ఎంపీటీసీ సభ్యులను పదవీ విరమణ సన్మానోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉపాధి హామీ అదనపు కార్యక్రమాధికారి బోడిగే రమేష్, ఈసీ సుంకరి శ్రీనివాస్, టీఏలు ఏగు మల్లేష్, దంతూరీ శ్రీశైలం, జమాండ్ల యాదిరెడ్డి, దొమ్మేటీక నిర్మల, కంప్యూటర్ ఆపరేటర్లు శ్రావణ్ కుమార్, మజీద్,ఫీల్డ్ అసిస్టెంట్లు,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతగానీ మల్లేశం, నాయకులు శ్రీశైలం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్

# నాయకుడు మోహన్ రెడ్డి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** ఎంపీపీ తండ మంగమ్మ శ్రీశైలంగౌడ్ వీడ్కోలు సన్మాన కార్యక్రమ మహోత్సవంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాస లక్ష్మా రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకుడు మన్నెం మోహన్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడే నగేష్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతగాని మల్లేశం, నాయకులు లోడి శ్రీశైలం, ఎలగందుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయంగా ఎదుగుతున్నాడనే హత్యకు కుట్ర

## గడ్డం మహేష్ కుటుంబ సభ్యులు



**విశ్వంభర, ఘట్కేసర్ :** రాజకీయంగా ఆర్థికంగా ఎదుగుతున్నడని గడ్డం మహేశ్‌ను అడ్డు తొలగించడం కోసం కౌన్సిలర్ కడపోల్ల మల్లేష్ హత్యకు కుట్ర పన్నాడని తన కుటుంబ సభ్యులు విలేకరుల సమావేశంలో బుధవారం ఆరోపించారు. గత నెల 22న మిస్సింగ్ కేసు నమోదైనప్పటి నుంచి పోలీసుల వైఖరిపై అనుమానం ఉందన్నారు. గడ్డం మహేష్ చనిపోయిన విషయం పోలీసు ద్వారా కాకుండా కౌన్సిలర్ బండారి అంజనేయులు అర్ధరాత్రి ఫోన్ చేసి చెప్పేంతవరకు కూడా తెలియదని, కనీసం మీడియా సమావేశం నిర్వహించకుండా పోలీసులకు లంచాలు ఇచ్చి ఈ కేసును మూయించాలని కుట్ర చేస్తున్నారని కౌన్సిలర్ కడపల్ల మల్లేష్ మీద ఫిర్యాదు చేస్తే వాళ్ళ ఇంటి ముందు పోలీస్లు రక్షణ కల్పించారని అన్నారు. ఘట్కేసర్ పోలీసులపై సీఎం రేవంత్ రెడ్డికి ఎస్సీ ఎస్టీ మానవ హక్కుల కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని మహేష్ కుటుంబ సభ్యులు గడ్డం మహేష్ తల్లి మైసమ్మ, సోదరుడు విటల్ తెలిపారు.

# ప్రాణహిత హాస్పిటల్‌కు అబ్దుల్ కలాం ఇన్స్పిరేషన్స్ అవార్డు

## మరింత బాధ్యత పెరిగింది : డాక్టర్ రాహుల్ రెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇన్స్పిరేషన్స్ అవార్డు-2024 లో భాగంగా "హైదరాబాదులో మోస్ట్ ట్రస్టెడ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్" చైతన్యపురిలోని ప్రాణహిత హాస్పిటల్ కు రావడం వైద్యం పట్ల మరింత బాధ్యత పెంచిందని డాక్టర్ రాహుల్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో జరిగిన అవార్డుల కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా హాజరైన కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్, శ్రీపద్ నాయక్, ఎస్పీ సింగ్, హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, సమక్షంలో బాలీవుడ్ నటి, ఎంపి హేమమాలిని చేతుల మీదుగా రాహుల్ రెడ్డి అవార్డును డాక్టర్ రాహుల్ రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక నాణ్యమైన వైద్యాన్ని అందరికీ అందుబాటులో తేవడం కాకుండా, పేద ప్రజలకు అతి తక్కువ ధరలకే వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి నాణ్యమైన వైద్యాన్ని అందిస్తామని తెలిపారు. ఈ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో డాక్టర్‌లు అనీల్ కుమార్, కృష్ణ, ప్రితమ్ రెడ్డి లతో పాటు ప్రముఖులు పాల్గొన్నారు.






# రైతు బజార్ ఆధునీకరణకు కృషి

## ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**విశ్వంభర, ఎల్బీనగర్ :** సరూర్‌నగర్ రైతు బజార్ ఆధునీకరణకు కృషి చేస్తానని మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం సరూర్ నగర్ రైతు బజార్‌ను గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సెక్రటరీ చిలుక నరసింహారెడ్డితో కలిసి కలియతిరిగి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1994 - 95 లో ఏర్పాటుచేసిన షెడ్ లో రైతులకు వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, షెడ్ లో నిర్మాణాన్ని కొద్దిగా ఎత్తు పెంచి సహజ గాలి, వెలుతురు వచ్చే విధంగా నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్లపై వ్యాపారం చేసుకునే తోపుడు బండి వ్యాపారులకు రైతు బజార్‌లో అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మార్కెట్లో రైతులకు నూతన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా మార్కెట్లోని రైతులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఏ సమస్యలున్న త్వరగా పూర్తిచేసి రైతులకు వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. అనంతరం బీజేఆర్ భవన్ భవనంను పరిశీలించి అత్యాధునిక వసతులతో ఆధునికరించాలని అసిస్టెంట్ ఎస్సీ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ అధికారిని కుసుమ లావణ్యకు సూచించారు. ఎండాకాలంలో నీటి సమస్య తీవ్రంగా ఉండడంతో బోర్ వేయించడంతోపాటు, బీజేర్ భవన్‌లో కార్యక్రమాలు చేసుకునే నిర్వాహకుల కోసం వంట చేసుకునే విధంగా వెనుక భాగంలో రేకుల షెడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ ఈ ఓ స్రవంతి రెడ్డి, డిఇ రవీందర్, మహేశ్వరం నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, నియోజకవర్గ మాజీ యూత్ వింగ్ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్ నర్సింహ గౌడ్, సీనియర్ నాయకులు ఆకుల అరవింద్, ఆర్కే పురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహిళా అధ్యక్షురాలు ఊర్మిల రెడ్డి, సాజిద్, శ్రీనివాస్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, అంకి రెడ్డి, డివిజన్ మాజీ యూత్ అధ్యక్షుడు శ్యామ్ గుప్త, మహేందర్ రెడ్డి, మురళీధర్ రెడ్డి, ఋషి, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సత్కారాలతో ముగిసిన మండల సర్వసభ్య సమావేశం



**విశ్వంభర, ఆమనగల్లు:** మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కమ్లి మోత్య నాయక్ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. సభ్యుల పదవీకాలం ముగుస్తుండడంతో మండలంలోని పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని సభ్యులు కోరారు. సమావేశ అనంతరం సభ్యులందరికీ వీడ్కోలు పలికి శాలువాలతో సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దశరథ్ నాయక్, ఎంపీపీ కంప్లి మోత్యా నాయక్ వైస్ ఎంపీపీ ఆనంద్ ఎంపీటీసీలు లచ్చి రామ్ నాయక్ బొప్పిడి గోపాల్ మంజుల చంద్రమౌళి ప్రియా రమేష్, ఎంఈఓ సర్దార్ నాయక్, శ్రీలత పాల్గొన్నారు.

# పదవికే విరమణ ప్రజా సేవకు కాదు : ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**విశ్వంభర, కుల్కచర్ల :** మండల కేంద్రంలో జడ్పిటిసి, ఎంపీటీసీల పదవీకాలం నేటితో ముగియడంతో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సత్య హరిశ్చందర్ అధ్యక్షతన జరిగిన పదవి విరమణ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ప్రజా ప్రతినిధులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. పదవి విరమణ అధికారులకే తప్ప, రాజకీయ నాయకులకు పదవి విరమణ ఉండదని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటే నాయకులకు ఎప్పుడు పదవులు ఉంటాయన్నారు. ఎవరు అధైర్య పడవద్దని మళ్లీ రాబోయే ఎన్నికల్లో ఎవరైనా సరే గెలిచి ప్రజల కు సేవచేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి రాందాస్ నాయక్, ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈఓ హబీబ్ అహ్మద్, వైస్ ఎంపీపీ రాజశేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు, అశోక్ కుమార్, ఎంపీ ఓ కరీం, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



# శానిటేషన్‌పై ఆమ్రపాలి ఆకస్మిక తనిఖీ

**విశ్వంభర, హైదరాబాద్ :** జిహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటనగరంలో పలు ప్రాంతాల్లో శానిటేషన్ పరిశీలన చేయుటకు బుధవారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ నారాయణగూడ క్రాస్ రోడ్ వద్ద శానిటేషన్‌పై ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నిర్మించిన మార్కెట్ గదులను కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని జోనల్ కమీషనర్‌ను ఆదేశించారు. శంకర్ మట్ వద్ద రాంకీ ఆర్ఎఫ్‌సీ వెహికిల్ డ్రైవర్‌తో కమిషనర్ మాట్లాడి చెత్త తరలింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ విద్యార్థితో మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి, చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించే విధంగా తోటి విద్యార్థులకు అవగాహన కల్పించి స్వచ్ఛ హైదరాబాద్ సాధనకు కృషి చేసే విధంగా ప్రయత్నించాలని కమిషనర్ విద్యార్థినికి వివరించారు. కమిషనర్ వెంట శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రవి కిరణ్ పాల్గొన్నారు.



# స్కైలాబ్ కుటుంబాన్ని పరామర్శించిన వెంకటేష్

**విశ్వంభర, ఆమనగల్లు:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు కూన స్కైలాబ్ మాతృమూర్తి కిష్టమ్మ ఇటీవల మరణించారు. బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ స్కైలాబ్ ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దారమోని గణేష్, పూరి రమేష్, నిరంజన్, ప్రసాద్, శ్రీను, చంద్రశేఖర్, మేకల శ్రీనివాసులు, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.




# నిరుపేద కుటుంబానికి సాయం

**విశ్వంభర, నారాయణపూర్ :** సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన మానసిక వికలాంగురాలైనటువంటి శికిల మెట్ల సుమతేజ గత పది సంవత్సరాల క్రితం తండ్రిని, నెలరోజుల క్రితం తల్లిని కోల్పోయి కుటుంబం గడవడమే తీవ్ర ఇబ్బందిగా మారిన సందర్భంలో మానవతా దృక్పథంతో స్పందించి విషయం తెలిసిన వెంటనే, కొందరు యువకులు వారి పదవ తరగతి బాల్యమిత్రుడు అడ్వకేట్ క్రీ.శే. బద్దుల అరవింద్ జ్ఞాపకార్థంగా శికిలమెట్ల సుమతేజ కుటుంబానికి 100 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల నాగరాజు, కొండ శ్రీకాంత్ గౌడ్, శిఖలమెట్ల శివప్రసాద్, పానుగోత్ గోపి, కొండ నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

# సీఎంల భేటీలో ప్రస్తావించే అంశాలు ఇవే

- ఈ నెల 6న తెలుగు రాష్ట్రాల సీఎం భేటీ
- ప్రధానంగా ఉమ్మడి ఆస్తుల పంపిణీ
- పాత బకాయిలు చెల్లింపులు





**విశ్వంభర, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఈనెల 6వ తేదీన హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరగనుంది. ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య కీలక భేటీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. సమావేశంలో చర్చించాల్సిన అజెండాను తెలంగాణ ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి హైలెవెల్ మీటింగ్ నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్ర విభజన తర్వాత ఇప్పటికీ అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై ఆరా తీశారు. తెలంగాణ హక్కులకు భంగం కలగకుండా.. రెండు రాష్ట్రాల మధ్య పెండింగ్ సమస్యలను పరిష్కరించు కోవాలని నిర్ణయించారు. వాస్తవానికి పునర్విభజన చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో ఉన్న ఆర్టీసీ, రాష్ట్ర ఆర్థిక సంఘం తదితర 23 కార్పొరేషన్ల ఆస్థులపై రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. పదో షెడ్యూల్‌లోని తెలుగు అకాడమీ, అంబేద్కర్, తెలుగు విశ్వవిద్యాలయం వంటి 30 సంస్థల ఆస్థులు, సేవలపై కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. రాజ్‌భవన్, హైకోర్టు, లోకాయుక్త, కార్మిక సంక్షేమ నిధి, వాణిజ్య పన్నులు, విద్యుత్ సంస్థల బకాయిలపైనా వివాదాలున్నాయి. రెండు రాష్ట్రాల అధికారులతో కేంద్ర హోంశాఖ పలు సమావేశాలు నిర్వహించినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదు. ముఖ్యమైన చిక్కులను ముఖాముఖి చర్చలతో పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని ఏపీ సీఎం చంద్రబాబు చొరవ చూపడంతో రెండు రాష్ట్రాల మధ్య ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న విభజన సమస్యలు కొలిక్కి రావచ్చని ఇరు రాష్ట్రాలు ఆశిస్తున్నాయి.

**పెండింగ్ అంశాలు ఇవే..**

- విభజన చట్టంలోని ఆస్తుల పంపిణీ
- షీలా బిడే కమిటీ సిఫార్సుల అమలు
- ఆంధ్రప్రదేశ్‌కు 58 శాతం ఆస్తుల వాటా
- తెలంగాణకు 42 శాతం ఆస్తుల వాటా
- 7 విలీన మండలాలపై చర్చించే అవకాశం
- షెడ్యూల్ 9లో మొత్తం 91 సంస్థలు
- ఆర్టీసీ, రాష్ట్ర ఆర్థిక సంఘం వంటి 23 కార్పొరేషన్ల ఆస్తులు
- షెడ్యూల్ 10లో మొత్తం 142 సంస్థలు
- తెలుగుఅకాడమీ, అంబేద్కర్, తెలుగువర్సిటీ వంటి 30 సంస్థల ఆస్తులు
- రాజ్‌భవన్, హైకోర్టు, లోకాయుక్త, కార్మిక సంక్షేమ నిధి..
- వాణిజ్య పన్నులు, విద్యుత్ సంస్థల బకాయిలు
- షెడ్యూల్ 9లో రూ.24,019 కోట్ల విలువైన ఆస్తులు
- షెడ్యూల్ 10లో రూ.34,643 కోట్ల విలువైన ఆస్తులు
- నీటి పంపకాలు, బ్రిజేష్ ట్రిబ్యునల్ అంశం

ఈ అంశం పొలిటికల్‌గానూ చర్చనీయాంశవుతోంది. ఏపీ సీఎం చంద్రబాబు, రేవంత్‌కు లేఖరాయడంపై.. భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కూర్చుని చర్చించుకోవడం మంచి పరిణామమేనన్న మాజీ మంత్రి బీఆర్ఎస్.. దీనికి కొన్ని కండిషన్లు సూచించింది. రాష్ట్రవిభజన జరిగిన కొత్తలో పోలవరం కోసం, ఏపీలో విలీనం చేసిన ఏడు మండలాలను తిరిగి తెలంగాణకు ఇచ్చేలా చంద్రబాబుతో చర్చలు జరపాలని హరీశ్ రావు సూచించారు. దాని తర్వాతే మరేదైనా అన్నట్టుగా చర్చలు ఉండాలన్నారు.. కాగా.. ఈనెల 6న జరిగే తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రుల భేటీ సఫలం అవుతుందా? పదేళ్లుగా పడి ఉన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందా? అన్నదే ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

# ఏపీకి ప్రత్యేక హోదా రాదు


- తేల్చి చెప్పేసిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ
- ప్యాకేజీ ఇచ్చిందంటూ స్పష్టత



**విశ్వంభర, ఢిల్లీ:** ప్రత్యేక హోదా అంశంపై కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ స్పందించారు. బీహార్‌కే కాదు ఏపీకి కూడా హోదా అనేది మంజూరు చేసే అంశం కాదన్నారు. తీర్మానా లు చేస్తే ఇచ్చే అంశం హోదా కాదని స్పష్టం చేశారు. ఢిల్లీలో మీడియతో మాట్లాడిన ఆయ న ప్రత్యేకహోదాకు బదులుగా కేంద్రం ఏపీకి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించిందని గుర్తు చేశారు. ఏపీకి ప్రత్యేకంగా హోదా ఇవ్వాలంటే ప్రధాని నిర్ణయం తీసుకోవాలన్నారు. వైసీపీ వల్ల పోలవరం ప్రాజెక్టులో సమస్యలు వచ్చాయని .. ఆ ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం సహకారం ఉంటుందన్నారు.

## వివేకా హత్య కేసులో కీలక సాక్షి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరం

**ప్రస్తుతం పులివెందుల ఏరియా ఆసుపత్రిలో రంగన్నకు వైద్యం**



**విశ్వంభర, కడప:** కడప మాజీ పార్లమెంట్ సభ్యుడు వైఎస్ వివేకా హత్య కేసులో కీలక సాక్షిగా ఉన్న వాచ్‌మెన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఆయన గత కొంతకాలంగా శ్వాసకోస సమస్యతో ఇబ్బంది పడుతున్నాడు. దీంతో రంగన్నను పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతడిని కడప రిమ్స్ కు రిఫర్ చేయడంతో అక్కడి తరలించడం జరిగింది. కాగా, 2019 మార్చి 15న కడప జిల్లా పులివెందుల నివాసంలో వైఎస్ వివేకా దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. కేసును నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితులను గుర్తించి జైలుకు పంపారు. వారిలో ప్రస్తుతం కొందరు బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ కేసులో నిందుతుల్లో ఒకరైన అవినాశ్ రెడ్డి కడప నుంచి వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి మరోసారి గెలుపొందారు. మరో నిందితుడైన దస్తగిరి అప్రూవర్‌గా మారారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చెయాలి



**విశ్వంభర, చివ్వేంల :** 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యార్థి, నిరుద్యోగ యువతకి ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ యువజన సంఘం, సమత సైనిక్ దళ్ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో ఏఓకి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు హాజరై మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా హైదరాబాద్ డిక్లరేషన్ పేరుతో తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి, నిరుద్యోగ యువతకి ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖ లలో ఖాళీగా ఉన్నా సుమారు 2లక్షల ఉద్యోగాలను మొదటి సంవత్సరంలోనే భర్తీ చేస్తామన్నారని గుర్తుచేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్నా ప్రభుత్వ ఉద్యోగల ను భర్తీ చేయాలని కోరారు. జాబ్ క్యాలెండరు విడుదల చేయాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించకుండా అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమాత సైనిక్ దళ్ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి నరేష్, గిరిజన శక్తి జిల్లా అధ్యక్షులు దారావత్ వెంకటేష్ నాయక్, తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర నాయకులు భాషిపంగు సునీల్, ఎనిగా సంతోష్ రెడ్డి, నాయకులు గుద్దేటి మధు, అనుమాలూరి కృష్ణ, గుగులోతు సురేష్ నాయక్, చెరుకు నగేష్, తాగూరి సైదులు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## మండల ప్రజాప్రతినిధుల వీడ్కోలు సమావేశం

**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో పదవి విరమణ పొందుతున్న జడ్పిటిసి పూన్న లక్ష్మీ జగన్మోహన్, ఎంపీటీసీ మడూరి జ్యోతి రామచందర్ రావులను వీడ్కోలు తెలుపుతూ వారిని కొత్తగూడెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ చిల్లర కైలాసం, మరియు పంచాయతీ కార్యదర్శులు లక్ష్మాపురం కార్యదర్శి పోలబోయిన రమేష్, కొత్తగూడెం కార్యదర్శి ఉయ్యాల పావని, దుబ్బాక కార్యదర్శి పవన్ లు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజలకు అందుబాటులో ఉంటే..

- పదవులు ఎప్పుడూ ఉంటాయి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్

**విశ్వంభర, నందిగామ :** మండల కేంద్రంలో జెడ్పిటిసి ఎంపీపీ ఎంపీటీసీల పదవి కాలం బుధవారం ముగియనుండడంతో నందిగామ ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఎంపీపీ ప్రియాంక శివశంకర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, హాజరై ప్రజా ప్రతినిధులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజకీయ నాయకులకు పదవి విరమన ఉండదని నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులకు ఎప్పుడు పదవి ఉంటుందని తెలిపారు. పదవి విరమణ అధికారులకే తప్ప రాజకీయ నాయకులకు ఉండదని ఎల్లప్పుడూ ప్రజా సమస్యలపై ప్రజలకు అందుబాటులో ఉంటే పదవి ఎప్పుడూ ఉంటుందని, ప్రజాప్రతినిధులు ఎవరు అధైర్య పడవద్దని మళ్ళీ రాబోయే ఎన్నికల్లో ఎవరైనా సరే గెలిచి ప్రజల సేవ చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రియాంక శివ శంకర్ గౌడ్, వైస్ ఎంపీపీ మంజుల తులసీరాం నాయక్, నందిగామ ఎంపీటీసీలు చంద్రపాల్ రెడ్డి, కొమ్ము కృష్ణ కుమార స్వామి గౌడ్, మరియు ఇతర ఎంపీటీసీలు, నందిగామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జె.రామ్ రెడ్డి, నందిగామ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగా నరసింహ యాదవ్, నందిగామ వ్యవసాయ కమిటీ ఛైర్మన్ తోట రాజగోపాల్, అధికారులు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాళేశ్వర హుండి ఆదాయం రూ.21.44 లక్షలు



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి జిల్లా కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం కాలేశ్వరం యొక్క హుండీలను ఆలయ కార్యనిర్వాహణాధికారి మారుతి ఆధ్వర్యంలో విప్పి డబ్బులు లెక్కించడం జరిగినది. హుండీల లెక్కింపు కార్యక్రమానికి పర్యవేక్షణ అధికారిగా పి ప్రసాద్ ఈఓ హాజరైనారు. 3 నెలల 7 రోజులకు గాను 21,44,464/- రూపాయల ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రేవెల్లి మమత, దేవస్థానం సూపరిండెంట్ బుర్రి శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ కాలేశ్వరం సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, విలేజ్ పోలీస్ ఆఫీసర్ హెచ్ కనకయ్య,వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ కరీంనగర్ సభ్యులు, రాజరాజేశ్వర సేవా సమితి కామారెడ్డి, సిరిసిల్ల సభ్యులు పాల్గొన్నారు.

## ఎంపీపీ ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళనం



**విశ్వంభర, కోరుట్ల :** కోరుట్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ తోట నారాయణ ఆధ్వర్యంలో సర్పంచులు ఎంపీటీసీలు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు ముఖ్య అతిథిగా కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ.. గడిచిన ఐదు సంవత్సరాలు ఒక కుటుంబంల మండల అభివృద్ధికి కృషిచేసిన ఎంపీటీసీ, సర్పంచ్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీలు వేరైనా ప్రజాసేవలో ముందుండి తెలంగాణలోనే అభివృద్ధి చెందిన మండలంగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఎంపీపీగా తోట నారాయణ అవార్డుతోపాటు ఉత్తమ మండల పరిషత్‌గా పేరు తెచ్చిన ఎంపీపీ మరియు ఎంపీటీసీ మరియు సర్పంచులకు కృతజ్ఞతలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన హరితహారం మరియు వైకుంఠధామాలు నర్సరీలతో ప్రతి గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దరంలో ఎంపీటీసీల సర్పంచుల కృషి ఎనలేనిదని కొనియాడారు. ఎంపీటీసీ సభ్యులకు మెమొంటో తోపాటు జ్ఞాపికను అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తహసీల్దార్ మరియు మండల పరిషత్ ఉద్యోగులు సహచర ఎంపీటీసీలు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## కొడుకు కోసం తల్లిదండ్రులు

**విశ్వంభర, భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో తన కొడుకు కోసం తిరుగుతూ, పడుతున్న ఆవేదన పలువురికి కంటతడి పెట్టిస్తుంది. కరీంనగర్ జిల్లా ఇల్లంతకుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన కన్నూరి గౌరమ్మ-నర్సయ్యలకు నలుగురు కూతుర్లు, ముగ్గురు కుమారులు ఉన్నారు. అందరికంటే చిన్నవాడు అనిల్ మతి స్థిమితం కోల్పోయి గత 20 రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వచ్చాడని తల్లి దండ్రులు తెలిపారు. అప్పటి నుంచి కొడుకు కోసం ఆ వృద్ధ దంపతులు తిరుగుతున్నారు. ఎవరికైనా కనబడితే జాడ తెలపాలని పలువురిని కోరుతున్నారు. సెల్ నంబర్ 8008469406 కు సమాచారం అందించా లని వృద్ధ దంపతులు తెలిపారు.



## ఆస్కార్ అవార్డుకు గుర్తుగా గ్రంథాలయ నిర్మాణం

**విశ్వంభర, భూపాలపల్లి :** ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ 'నాటు నాటు' పాటతో అంతర్జాతీయ స్థాయిలో ఆస్కార్ అవార్డును అందుకున్నాడు. తనదైన శైలిలో మాటలను పాటల రూపంలోకి మార్చి అభిమానుల మన్నన పొందాడు. ఆస్కార్ అవార్డుకు గుర్తుగా తన పుట్టిన గ్రామమైన చల్లగరిగలో తన సొంత ఖర్చులతో గ్రంథాలయ పునః నిర్మించాడు. దాదాపు రూ.36లక్షల ఖర్చుతో నిర్మించిన గ్రంథాలయాన్ని అంగరంగ వైభవంగా, ముఖ్య ప్రముఖులతో, సినీ ప్రముఖులతో గురువారం ప్రారంభించనున్నారు. తనకు ఇంతటి ఘన కీర్తిని సంపాదించి పెట్టిన ఊరికి నా పాటలకు పునాది వేసిన గ్రంథాలయానికి, నాలాగే ఇంకా ఎంతో మందికి ఉపయోగకరంగా ఉండాలనే సంకల్పంతో ఆస్కార్ అవార్డు గుర్తుగా గ్రంథాలయాన్ని పునః నిర్మించానన్నారు. చిట్యాల మండలంలోని చల్లగరిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆస్కార్ గ్రంథాలయాన్ని ప్రారంభోత్సవానికి పలువురు ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి తూర్పాటి శ్రీలత తెలిపారు. గురువారం నిర్వహించే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి భవన నిర్మాణ దాత చంద్రబోస్ తో పాటు పలువురు కళాకారులు అభిమానులు రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నట్టు ఆమె తెలిపారు.



# కవిత జ్యుడీషియల్ కస్టడీ మళ్లీ పొడిగింపు

• జూలై 25 వరకు పొడిగింపు • రౌస్ అవెన్యూ కోర్టు తీర్పు


**విశ్వంభర, ఢిల్లీ:** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జ్యుడిషియల్ కస్టడీ పొడిగించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ మనీ లాండరింగ్ కేసులో జూలై 25వ తేదీ వరకు కవిత, మనీష్ సిసోడియా కస్టడీ పొడిగిస్తున్నట్లు రౌస్ అవెన్యూ కోర్టు వెల్లడించింది. ఈడీ కేసులో నేటితో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీ ముగిసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కవిత, మనీష్ సిసోడియాను కోర్టు ముందు అధికారు లు హాజరు పరిచారు. తదుపరి విచారణ జూలై 25వ తేదీకి వాయిదా వేసింది కోర్టు. జ్యుడీషి యల్ కస్టడీలో భాగంగా గత మూడు నెలల నుంచి కవిత తీహార్ జైల్లో ఉంటున్నారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో కస్టడీలో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు రెండు రోజుల క్రితం తిరస్కరించిన సంగతి తెలిసిందే. సీబీఐ, ఈడీ నమోదు చేసిన కేసుల్లో ఊరట ఇవ్వాలని, బెయిల్ మంజూరు చేయాలని కవిత దాఖలు చేసిన రెండు పిటిషన్లను న్యాయస్థానం తిరస్కరించింది. సీబీఐ, ఈడీ వాదనలతో న్యాయస్థానం ఏకీభవిస్తూ బెయిల్‌ను ఇవ్వలేమని చెప్పింది.

హైకోర్టు బెయిల్ తిరస్క రిం చిన నేపథ్యంలో కవిత సుప్రీంకోర్టును ఆశ్ర యించే అవకాశం ఉన్నది.

## జులై 12 వరకు కేజ్రీవాల్ కస్టడీ పొడిగింపు



**విశ్వంభర, ఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కష్టాలు కొనసాగుతున్నాయి. మద్యం పాలసీ కేసులో సీఎం కస్టడీని రౌస్ అవెన్యూ కోర్టు ఈ నెల 12 వరకు పొడిగించింది. కేజ్రీవాల్‌ను ఈడీ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కోర్టులో హాజరుపరిచింది. ఇంతకుముందు ఈడీ జూన్ 29న సీబీఐ కోర్టు రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం ప్రత్యేక సీబీఐ కోర్టు 14 రోజుల జ్యూడీషియల్ కస్టడీకి ఇచ్చింది. మద్యం పాలసీ కేసులో గత నెల 26న సీబీఐ అరెస్టు చేసిన విషయం విధితమే. ఆ తర్వాత మూడురోజులు సీబీఐ కస్టడీకి తీసుకోగా.. రిమాండ్ గడువు ముగియగా 29న కోర్టులో హాజరుపరిచింది. దీంతో కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసుకు సంబంధించి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఆప్ కన్వీనర్‌కు జూన్ 20న ట్రయల్ కోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. అయితే, ట్రయల్ కోర్టు ఆదేశాలపై హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. ఆ తర్వాత స్టేపై సవాల్ చేయగా.. హైకోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. ఇదిలా ఉండగా.. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌ను మార్చి 21న ఈడీ అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఆయన తిహార్ జైలులో ఉంటున్నారు.



# కంగనాపై చెంపదెబ్బ..

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ బెంగళూరుకు బదిలీ

**విశ్వంభర, బెంగళూరు:** చండీగఢ్‌లోని షాహీద్ భగత్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్‌ను చెంపదెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్‌పై అధికారులు బదిలీ వేటు వేశారు. కుల్విందర్ కౌర్‌ను చండీగఢ్ విమానాశ్రయం నుంచి బెంగళూరుకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అయితే, కుల్విందర్ ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. ఆమెపై శాఖాపరమైన విచారణ కొనసాగుతున్నది. జూన్ 7న చండీగఢ్‌లోని షాహీద్ భగత్ సింగ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌-పోర్ట్‌లో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ కుల్విందర్ అనే మహిళా కానిస్టేబుల్ కంగనా రనౌత్‌ను చెంపదెబ్బ కొట్టిన విషయం తెలిసిందే. బీజేపీ ఎంపీ ఫిర్యాదుతో కుల్విందర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయగా.. సిట్ దర్యాప్తును పూర్తి చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించింది. ఈ ఘటన జూన్ 7న జరిగింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీ ఎంపీ ఢిల్లీ వెళ్లేందుకు చండీగఢ్ విమానాశ్రయానికి వచ్చారు. చండీగఢ్ ఎయిర్‌పోర్ట్‌లో చెకింగ్ సమయంలో డ్యూటీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ బాలీవుడ్ నటిపై చేయి చేసుకున్నారు. రైతుల ఉద్యమంపై కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. రైతుల ఉద్యమాన్ని కించపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ఆ సమయంలో సంచలనం సృష్టించింది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పలువురు కుల్విందర్‌కు మద్దతు తెలిపారు. ఉన్నతాధికారులు సస్పెండ్ చేయడంతో మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ దద్లానీ సహా ఉద్యోగ ఆఫర్లు ఇచ్చిన విషయం తెలిసిందే.

# ఎవరీ భోలే బాబా..!

• గతంలో జైలు శిక్ష అనుభవించిన కానిస్టేబుల్
• సొంత గ్రామానికి వెళ్లి బాబాగా ప్రచారం
• దేవుడితో మాట్లాడుతానని నమ్మించిన వైనం
• మెల్లమెల్లగా రాష్ట్రమంతా పేమస్
• ఎక్కడ సభ పెట్టినా లక్షల్లో జనం



**విశ్వంభర, ఢిల్లీ:** ఉత్తరప్రదేశ్‌లోని హాథ్‌రస్ జిల్లా సికంద్రారావు పట్టణానికి సమీపంలో నిర్వహించిన సత్సంగ్ (ఆధ్యాత్మిక కార్యక్రమం)లో మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకున్న తొక్కిసలాటలో మృతుల సంఖ్య 120 దాటింది. మహిళలు, పిల్లలతో సహా వందలాది మంది ప్రాణాలు క్షణాల్లో గాల్లోకలిసిపోయాయి. ఎటు చూసినా చెల్లా చెదురుగా పడిపోయిన మృతదేహాలతో భయానక వాతావరణం తలపించింది. ఘటన అనంతరం భోలేబాబా పరారవడం పలు అనుమానాలకు తావిచ్చింది. ఈ క్రమంలో అసలెవరీ భోలేబాబా అని ప్రతి ఒక్కరూ ఆరా తీస్తున్నారు. సినిమా స్టోరీని తలపించేలా ఉన్న బోలే బాబా యవ్వారం విన్న ప్రతి ఒక్కరూ ముక్కున వేలేసుకుంటున్నారు.

### ఎవరీ భోలే బాబా?

సరిగ్గా 28 ఏళ్ల క్రితం వేధింపుల కేసులో యూపీ పోలీసు శాఖలో లోకల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎల్ఐయూ)లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సూరజ్‌పాల్ జాతవ్ సస్పెండ్ అయ్యాడు. వేధింపుల కేసులో ఆరోపణలు రావడంతో 28 ఏళ్ల కిందట ఆయన సస్పెండ్ అయ్యాడు. తర్వాత సర్వీస్ నుంచి డిస్మిస్ కూడా చేశారు. ఈ కేసులో అతడు జైలు శిక్ష కూడా అనుభవించాడు. అతని స్వస్థలం కస్గంజ్ జిల్లాలోని పాటియాలీ ప్రాంతంలోని బహదూర్ నగరి అనే గ్రామం. జైలు నుంచి విడుదలైన సూరజ్ పాల్.. పోలీసు సేవల నుంచి డిస్మిస్ కావడంతో కోర్టును ఆశ్రయించగా మళ్లీ ఉద్యోగం వచ్చింది. కానీ 2002లో స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నాడు. ఉద్యోగం వదిలేసి ఆధ్యాత్మిక చింతనలో కాలం గడిపాడు. పదవీ విరమణ తర్వాత స్వగ్రామం నాగ్లా బహదూర్‌పూర్ చేరుకుని అక్కడే తన డ్రామాకు తెర లేపాడు. తాను భగవంతుడితో మాట్లాడతానని తన గ్రామ ప్రజలకు చెప్పడం మొదలు పెట్టారు. తనకు తాను భోలే బాబాగా ప్రచారం చేసుకోవడం ప్రారంభించారు. అతడి మాయమాటలు నమ్మిన ప్రజలు తండోపతండాలుగా కదలివచ్చేవారు. చూస్తుండగానే అతడికి లక్షలాది భక్తులు పుట్టుకొచ్చారు. అలా అనూహ్యంగా కొంతకాలానికే భోలే బాబా నారాయణ్ సాకార్ హరిగా అవతరించాడు. ఇతగాడి ప్రవచనాలకు రాజస్థాన్, మధ్యప్రదేశ్, హర్యానా వంటి ఇతర రాష్ట్రాలలో కూడా పిచ్చ ఫాలోయింగ్ ఉంది. కొద్దికాలంలోనే ఆయనకు పెద్ద సంఖ్యలో అనుచరులు పుట్టుకొచ్చారు. ఎక్కడ సమావేశం నిర్వహించినా వేలసంఖ్యలో ప్రజలు వచ్చేవారు.

### కానిస్టేబుల్ కొలువు వదిలేసి బాబాగా అవతరణ

ప్రతి మంగళవారం వివిధ ప్రాంతాల్లో 'సత్సంగ్' పేరటి పెద్దపెద్ద మతపర సభావేశాలు నిర్వహించేవాడు. ఇటీవల హత్రాస్లో జరిగిన సంఘటనకు సరిగ్గా వారం ముందు మెయిన్‌పురి జిల్లాలో కూడా ఇలాంటి కార్యక్రమాన్నే నిర్వహించాడు. కరోనా మహమ్మారి టైంలో 2022లో భోలే బాబా సమావేశాలకు కేవలం 50 మందిని మాత్రమే హాజరయ్యేలా ప్రభుత్వం అనుమతి ఇస్తే.. ఏకంగా 50 వేల మంది హాజరుకావడంతో అప్పట్లోనే పెద్ద వివాదానికి దారి తీసింది. సూరజ్‌పాల్ అలియాస్ భోలే బాబాకు ముగ్గురు సోదరులలో ఒకరని, అందరిలో పెద్దవాడు. సూరజ్ పాల్ రెండో సోదరుడు మరణించగా, మూడో సోదరుడు గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పని చేస్తున్నాడు. భోలే బాబా చాలా అరుదుగా తన ఊరు వెళ్తుంటాడు. సర్కార్ కొలువు వదిలేసి ఇక్కడి దాకా ఎలా ఎదిగాడో తెలియదని సత్సంగ్‌లలో అనేకమార్లు చెప్పుకునేవాడు.

### హత్రాస్ ఘటన తర్వాత పరార్..

తాజా ఘటనలో నారాయణ్ సాకార్ హరి పేరుతో హత్రాస్‌లో ఈ కార్యక్రమం జరిగినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. హాథ్‌రస్ వీధుల్లో అన్ని ఇతగాడి పోస్టర్లే పెద్ద ఎత్తున పెట్టారు. నారాయణ్ సాకార్‌ను ప్రజలు భోలే బాబా, విశ్వహరి అనే పేర్లతో పిలిచేవారు. జూలై నెల తొలి మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని 'మానవ్ మంగళ్ మిలన్' పేరుతో నిర్వహించారు. 'మానవ్ మంగళ్ మిలన్ సద్భావన సమాగమ్ సమితి' అనే పేరుతో మొత్తం ఆరుగురి పేర్లు ఉన్నాయి. వీరితోపాటు బోలేబాబా కూడా పరారయ్యాడు. ప్రస్తుతం వారందరి మొబైల్ ఫోన్లు స్విచాఫ్ వస్తున్నాయి. దీంతో స్థానిక పోలీసులు వారిని కాంటాక్ట్ చేయలేకపోతున్నారు. వీరి కోసం యూపీ పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. మరోవైపు ఇంతటి మారణహోమానికి కారణమైన సత్సంగ్ కార్యక్రమాన్ని నిర్వహించిన కమిటీపై, బోలే బాబాపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు అలీగఢ్ ఐజీ శలభ్ మాథుర్ చెప్పారు.

### ఎక్కడా విరాళాలు సేకరించలేదు..

బోలే బాబాకు సంబంధించి మరో ఆసక్తికర విషయం ఏంటంటే.. అతను ఇప్పటి వరకు భక్తుల నుంచి ఎలాంటి విరాళాలు, దక్షిణలు, కానుకలను తీసుకోలేదు. కానీ, ఉత్తరాదిలో అనేక ఆశ్రమాలను ఎలా స్థాపించాడు అనే విషయం ఎవరికీ బోధపడకుంది. ఉత్తరప్రదేశ్‌లోనే వేర-వేరు ప్రాంతాల్లో సొంత స్థలాల్లో ఆశ్రమాలను ఏర్పాటు చేశాడు. ఎల్లప్పుడూ తెల్లటి వస్త్రాలలోనే భక్తులకు కనిపించేవాడు. పైజామా కుర్తా, ప్యాంట్ -షర్ట్, సూట్‌లలో ఎక్కువగా కనిపిస్తాడు. ఇంతటి ఫాలోయింగ్ ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోగానీ, ఇంటర్నెట్‌లో గానీ ఇతని గురించి ఎక్కడా ప్రస్తావన లేకపోవడం మరో విచిత్రం. క్షేత్రస్థాయిలో మాత్రం ఆయనకు లక్షలాది భక్తులున్నారు. అతను నిర్వహించే కార్యక్రమాల్లో వందలమంది వలంటీర్లు ఉంటారు. వీరు భక్తులకు ఉచితంగా నీళ్లు, ఆహారం పంచడం నుంచి రద్దీని నియంత్రించేంత వరకు అన్నీ వారే చూసుకుంటూ ఉంటారు. బోలేబాబా భక్తుల్లో సమాజ్‌వాద్ పార్టీ నేత అన్వర్ సింగ్ జాతవ్ కూడా ఒకరు.



# సీఎం చంపై సోరెన్ రాజీనామా

• హేమంత్ సోరెన్‌కు మళ్లీ సీఎం పగ్గాలు!
• కూటమి నేతలంతా హేమంత్ వైపే

**విశ్వంభర, జార్ఖండ్ :** జార్ఖండ్ రాజకీయాల్లో కీలక మార్పులు జరుగుబోతున్నాయి. హేమంత్ సోరెన్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ఈడీ కేసులో ఆయన బెయిల్‌పై విడుదలైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా ఉన్న చంపై సోరెన్ సీఎం పదవికి బుధవారం రాజీనామా చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో ఇవాళ జార్ఖండ్ ముక్తి మోర్చా వర్గాలు మాట్లాడుతూ చంపై సోరెన్ స్థానంలో హేమంత్ సోరెన్ మళ్లీ సీఎంగా బాధ్యతలు తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపాయి. సీఎం చంపై సోరెన్ నివాసంలో జరిగిన సమావేశంలో జేఎంఎం శాసనసభా పక్ష నేతగా హేమంత్ సోరెన్‌ను ఎన్నుకోవాలని కూటమి నేతలు, ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. జేఎంఎం వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ సోరెన్ రాష్ట్రంలోని పార్టీ నేతృత్వంలోని కూటమికి చెందిన ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం మూడోసారి ముఖ్యమంత్రి బాధ్యతుల చేపట్టే అవకాశం కనిపిస్తున్నది. అధికార మార్పిడి ఊహాగానాల మధ్య రాంచీలో ఇండియా కూటమి ఎమ్మెల్యేల సమావేశం జరుగనున్నది. ఈ సమావేశాన్ని హేమంత్ సోరెన్ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇటీవల భూకుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ ఆయనను అరెస్టు చేసింది. దాదాపు ఐదు నెలల తర్వాత అంటే జూన్ 28న జైలు నుంచి విడుదలయ్యాడు. భేటీ నేపథ్యంలో సీఎం చంపై సోరెన్ ముఖ కార్యక్రమాలన్నింటిని రద్దు చేశారు. వాస్తవానికి బుధవారం రాష్ట్రంలో ఎంపిక చేసిన 1500 ఉపాధ్యాయులకు సీఎం చంపై సోరెన్ నియామకపత్రాలు పంపిణీ చేయాల్సి ఉంది. మంగళవారం సైతం సీఎం కార్యక్రమాలన్నీ రద్దయ్యాయి. హేమంత్ సోరెన్ అరెస్ట్ తర్వాత ఫిబ్రవరి 2న జార్ఖండ్ 15వ ముఖ్యమంత్రిగా చంపై సోరెణ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఇక నేడు జరుగబోయే సమావేశానికి హాజరుకావాలని పార్టీ సూచించిందని కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యే ఒకరు తెలిపారు. ఈ ఏడాది చివరలో జరుగనున్న ఎన్నికల వ్యూహంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు పేరు చెప్పేందుకు ఇష్టపడని ఓ ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సమావేశానికి జార్ఖండ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ గులాం అహ్మద్ మీర్, రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్ ఠాకూర్ సైతం హాజరవుతున్నారు. రాష్ట్రంలో రాజకీయ అభివృద్ధే ఈ సమావేశం ఎజెండా అని జేఎంఎం అధికార ప్రతినిధి మనోజ్ పాండే తెలిపారు. భేటీలో ముఖ్యమంత్రితో పాటు హేమంత్ సోరెన్ సోదరుడు, మంత్రి బసంత్ సోరెన్ పాల్గొననున్నారు. జేఎంఎం ఎమ్మెల్యే సర్ఫరాజ్ అహ్మద్ రాజీనామా చేయడంతో గాండే సీటు ఖాళీ అయ్యింది. అక్కడ జరిగిన ఉప ఎన్నికల్లో హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.



# రాహుల్ ప్రసంగాన్ని వక్రీకరించింది

• చంద్రబాబు, నితీష్ లేకుంటే మోడీ ప్రధాని కాలేరు
• కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్

**విశ్వంభర, ఢిల్లీ:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ప్రసంగాన్ని వక్రీకరించి, తప్పుదారిపట్టించిన తీరు చూస్తే ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల ప్రసంగం చేసినట్టు ఉందని, పార్లమెంట్‌లో మాట్లాడిన తరహాలో లేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ అన్నారు. రాజ్యసభలో కాంగ్రెస్‌పై ప్రధాని మోడీ ఆరోపణలు చేశారని, కానీ వాటిని తిప్పికొట్టేందుకు మల్లికార్జున్ ఖర్గే లేచి నిలుచున్నా ఆయనకు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ప్రధాని పార్లమెంట్ వేదికగా అసత్యాలు వల్లెవేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు మెజారిటీ రాకపోయినా ఆయనకూ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ రాలేదనే విషయం ప్రధాని అర్థం చేసుకోవాలని అన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు మోడీకి వ్యక్తిగతంగా, నైతికంగా, రాజకీయంగా నష్టం చేకూర్చాయనే విషయం ఆయన గుర్తెరగాలని చెప్పారు. ప్రధాని మోడీ మూడింట ఓ వంతు ప్రధాని అని తాను అంటే ఆయన దాన్ని కూడా వక్రీకరించి తాను మూడింట ఓ వంతు ప్రభుత్వమని అన్నట్టు ప్రచారం చేశారని చెప్పారు. నాయుడు, నితీష్ లేకుంటే మోడీ ప్రధాని కాలేరని పేర్కొన్నారు. మోడీ 240 దగ్గరే ఆగిపోయారు..ఆయనకు అనుకూలంగా ప్రజా తీర్పు రాలేదని వివరించారు. ఆయన మూడోసారి ప్రధాని కావడం వాస్తవమే అయినా ఆయనకు మెజారిటీ మాత్రం దక్కలేదని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు.

# హత్రాస్ ఘటనపై పుతిన్ సంతాపం

**విశ్వంభర, ఢిల్లీ:** యూపీలోని హత్రాస్‌లో జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించిన ఘటనపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనలో మరణించిన వారికి సంతాపం తెలుపుతూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీలకు ఈ ఘటనపై పుతిన్ సంతాప సందేశం పంపారు. మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలియచేయాలని కోరారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని పుతిన్ ఆకాంక్షించారు. కాగా, యూపీలోని హత్రాస్‌లో జరిగిన భోలే బాబా సత్సంగ్‌లో విషాదం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. ఇంత పెద్ద సంఖ్యలో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమం జరుగుతున్నా ఆ స్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. తొక్కిసలాటలో దాదాపు 121 మంది మరణించారు. ఈ ఘటనకు బాధ్యులైన బాబా ఆచూకీ అంతుబట్టడం లేదు. ఇక మంగళవారం మధ్యాహ్నం 3.30 నిమిషాలకు .. సత్సంగ్ ప్రాంగణం వద్ద తొక్కిసలాట జరిగింది. కానీ ఆ ఘటన తర్వాత భోలే బాబా ఆనవాళ్లు దొరకడం లేదు. ఆయన పరారీలో ఉన్నట్టు పోలీసులు భావిస్తున్నారు.





# పిఠాపురంలో మూడెకరాలు కొన్నా

- ఇక నుంచి నేను లోకల్
- కావాలనే పంచాయతీరాజ్ తీసుకున్నా
- పిఠాపురం ప్రజలకు రుణపడి ఉంటా
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

**విశ్వంభర, పిఠాపురం:** తనను అసెంబ్లీ గేటు కూడా తాకనీయమని వైసీపీ నేతలు అన్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన విజయంతో అసెంబ్లీ గేటు తాకడం కాదు.. గేటు బద్ధలు కొట్టుకుని అసెంబ్లీలోకి వెళ్లామని పేర్కొన్నారు. కాకినాడ పర్యటనలో ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఉప్పాడలో నిర్వహించిన వారాహి బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల సమక్షంలో ఆయన మళ్లీ ఎమ్మెల్యేగా ప్రమాణం చేశారు. 2019లో జనసేన ఉనికి నిలబెట్టారని.. 2024లో గుర్తింపు ఇచ్చారని పవన్ కల్యాణ్ తెలిపారు. ఎన్నికల్లో ఎవరూ ఊహించని ఘన విజయం అందించారని తెలిపారు. దానికి పిఠాపురం నుంచే బీజం పడిందని అన్నారు. పిఠాపురం ఇచ్చిన బలం దేశ రాజకీయాల్లో మాట్లాడుకునేలా చేసిందని తెలిపారు. వంద శాతం స్ట్రయిక్ రేటు విజయం మామూలు విషయం కాదని అభిప్రాయపడ్డారు. కావాలనే తాను పంచాయతీరాజ్ శాఖ తీసుకున్నానని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేగా ప్రజల ముందు ప్రమాణం చేశారు. అన్ని వర్గాలు, మతాలు, కులాల వారీగా హామీ ఇస్తున్నా.. మానవత్వాన్ని కాపాడుతా.. మీ అభ్యున్నతికి కష్టపడతా.. లంచాలు తీసుకుని పాలన మీకు అందిస్తా అని పవన్ కల్యాణ్ ప్రజల ముందు ప్రమాణం చేశారు. పవన్ కల్యాణ్ ఆంధ్రాలో ఉండరని వైసీపీ నేతలు చేసిన విమర్శలను పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. ఇప్పుడు తాను పిఠాపురం వాస్తవ్యుడిగా మారానని కౌంటర్ ఇచ్చారు.. పిఠాపురంలో మూడెకరాల భూమి కొన్నానని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులను గౌరవిస్తానని తెలిపారు. ప్రజాప్రతినిధులంతా అధికారులకు గౌరవం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా పార్టీపరంగా వారిపై దౌర్జన్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# క్రెడిట్ అంతా బాబు, పవన్‌కే..

- బీజేపీ పట్టించుకోదా..?
- మిత్ర పక్షాన్ని సైడ్ చేస్తున్న సీఎం
- అసంతృప్తిలో కమలనాథులు



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అఖండ విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే రూ.3000 పింఛన్ ను రూ.4000కు పెంచుతామని.. అది కూడా ఏప్రిల్ నుంచే వర్తింప చేస్తామని టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రకటించారు. జూలై 1న రూ.7వేలు పింఛన్ అందజేశారు. అంతేకాకుండా దివ్యాంగులకు ఏకంగా రూ.3000 నుంచి రూ.6 వేలకు పెన్షన్ పెంచి ఇచ్చారు. అలాగే పూర్తిగా వీల్ చైర్, మంచానికే పరిమితమైన వారికి ఏకంగా రూ.15వేలు పింఛన్ అందించారు.

**ఎన్నికల సమయంలో..**

ఇచ్చిన మాట ప్రకారం.. జూలై 1న తొలి రోజు 95 శాతం మందికి పింఛన్ల పంపిణీని పూర్తి చేసి రికార్డు సృష్టించారు. కేంద్రం ఏమాత్రం ఆర్థిక సహాయం చేయకపోయినా.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా కూటమి ప్రభుత్వం తన తొలి కీలక హామీని విజయవంతంగా నిలబెట్టుకుంది. ఈ పెన్షన్ పెంపు క్రెడిట్ అంతా ముఖ్యమంత్రి చంద్రబాబుకే వెళ్లిపోతుంది. అలాగే జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు కూడా. ఎన్నికల ముందు వీరిద్దరే ప్రచార సభల్లో పెన్షన్ పెంపు గురించి కీలకంగా ప్రస్తావించారు. ఎన్నికల ముందు విడుదల చేసిన ఉమ్మడి మేనిఫెస్టోలోనూ ఈ అంశాన్ని పొందుపరిచారు.

**ఆయన పట్టుకోకపోవడంతో..**

అయితే కూటమి ప్రభుత్వంలో మూడో భాగస్వామిగా ఉన్న బీజేపీ పెన్షన్ల పెంపు క్రెడిట్ ను తీసుకుంటుందా? లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే టీడీపీ, జనసేన కూటమిలోకి బీజేపీ చివరిగా ఎంట్రీ ఇచ్చింది. అసలు పొత్తు ఉండకపోవచ్చనే చర్చ కూడా నడిచింది. అయితే పవన్ కళ్యాణ్ అతికష్టం మీద బీజేపీని ఒప్పించి కూటమిలోకి తీసుకువచ్చారు. అంతటితో అయిపోలేదు. ఉమ్మడి మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి సిద్ధార్థ్ నాథ్ సింగ్ మేనిఫెస్టోను పట్టుకోవడానికి నిరాకరించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాత్రమే మేనిఫెస్టోను పట్టుకోవడం, బీజేపీ నేత పట్టుకోకపోవడం హాట్ టాపిక్ గా మారింది. సిద్ధార్థ్ నాథ్ సింగ్ ఉమ్మడి మేనిఫెస్టోను పట్టుకోకపోవడంపై మీడియాలోనూ వార్తలు వచ్చాయి. వైసీపీ అయితే ఈ అంశాన్ని బాగా ప్రచారం చేసింది. బీజేపీకి చంద్రబాబుపైన నమ్మకం లేదని.. ఆయన హామీలు అమలు చేయకపోతే బీజేపీకి చెడ్డపేరు వస్తుందని.. మేనిఫెస్టోలో బీజేపీ భాగం కాలేదని వైసీపీ సెటైర్లు వేసింది. అయితే జూలై 1న ఇచ్చిన హామీని ఇచ్చినట్టుగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిలుపుకున్నారు. భారీగా పెన్షన్లను పెంచి మరీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ నేపథ్యంలో క్రెడిట్ అంతా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కే పోతుందని అంటున్నారు. లబ్ధిదారులు సైతం వీరిద్దరి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్నారు. మరి బీజేపీ ఈ క్రెడిట్ తీసుకుంటుందా? లేదా? అనే చర్చ సాగుతోంది.

# మెగా డీఎస్సీ అభ్యర్థులకు గుడ్ న్యూస్

**విశ్వంభర, అమరావతి :** ఏపీలో టీచర్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి సమయం ఇవ్వాలన్న అభ్యర్థుల వినతిపై ఏపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. టెట్‌కు 90 రోజులు, డీఎస్సీకి 90 రోజులు సమయం ఇవ్వాలని నిర్ణయించింది. టెట్, మెగా డీఎస్సీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు మరికొంత సమయం ఇవ్వాలని విద్యార్థి, యువజన సంఘాలు ముందు నుంచి సమయం అడుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆ సంఘాల నేతలు ఇటీవల మంత్రి నారా లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన నారా లోకేశ్.. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల వినతిని పరిగణలోకి తీసుకుని.. టెట్, మెగా డీఎస్సీ ప్రిపరేషన్‌కు సమయం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. టెట్‌కు 90 రోజులు, డీఎస్సీకి 90 రోజుల సమయం ఇస్తూ.. మొత్తం ప్రక్రియను ఆరు నెలల్లో నియామక ప్రక్రియ పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయానికి అనుగుణంగా కొత్త పరీక్ష తేదీలను త్వరలోనే ఏపీ ప్రభుత్వం ప్రకటించనుంది. కాగా, కొత్తగా బీఈడీ, డీఈడీ పూర్తి చేసుకున్న వారికి కూడా మెగా డీఎస్సీలో అవకాశం కల్పించనున్నారు.

# తెలుగు జాతికి వైసీపీ ద్రోహం

- అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేసిన సీఎం
- మా కష్టాన్ని వైసీపీ వృథా చేసింది
- రాష్ట్రానికి రాజధాని లేకపోవడం విచారకరం
- మాట్లాడుతూ భావోద్వేగానికి గురైన చంద్రబాబు




**విశ్వంభర, అమరావతి :** అనుకున్న విధంగానే ఏపీ రాజధాని అమరావతిపై సీఎం చంద్రబాబు శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. గత ఐదేళ్లుగా అమరావతికి జరిగిన నష్టాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారు. ప్రస్తుతం అమరావతి ఎలాంటి పరిస్థితిలో ఉందో వివరించారు. మళ్లీ అమరావతిని రాజధాని చేస్తామని అనుకోలేదన్నారు. తమ కష్టాన్ని నాశనం చేశారన్న బాబు ఇది జాతికి జరిగిన ద్రోహంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన కొంత భావోద్వేగానికి గురయ్యారు. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయంతో ధ్వంసమైన ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణంపై సీఎం చంద్రబాబు దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో అమరావతిపై శ్వేతపత్రాన్ని రిలీజ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించిన చంద్రబాబు, వాస్తవ పరిస్థితిని ప్రజలకు వివరించాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగానే బుధవారం శ్వేతపత్రాన్ని విడుదల చేశారు. గత ప్రభుత్వం అమరావతిని పట్టించుకోలేదని, ఫలితంగా ఎంతో నష్టం జరిగిందని చంద్రబాబు వివరించారు. పదేళ్లు అయినా రాష్ట్రానికి రాజధాని లేకపోవడం విచారకరమన్నారు. 2014–19 మధ్య తమ హయాంలో 9వేల కోట్లతో చేపట్టిన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయని వీడియోని ప్రదర్శిస్తూ వివరించారు. తాము పడిన కష్టాన్నంతా వైసీపీ ప్రభుత్వం వృథా చేసిందన్న చంద్రబాబు ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. అమరావతి చరిత్ర సృష్టించే నగరమని సీఎం చంద్రబాబు చెప్పారు. శాతవాహనుల కాలంలోనే అమరావతి కేంద్రంగా పాలన జరిగిందన్నారు. రాష్ట్రంలో ఎటు చూసినా సమ దూరం ఉన్న ఏకైక ప్రాంతం అమరావతి అన్నారు. అందుకే దీన్ని రాజధానిగా నిర్ణయించామన్నారు. బుద్ధి, జ్ఞానం ఉన్న ఏ వ్యక్తి కూడా రాజధానిగా అమరావతిని వ్యతిరేకించరన్నారు. కరుడుగట్టిన ఉగ్రవాది కూడా అమరావతిని అంగీకరిస్తారని చెప్పారు. తాను చేపట్టిన ఏ ప్రాజెక్టు అయినా విన్–విన్ పద్ధతిలోనే ముందుకు వెళ్లామన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన వారు కూడా సంతోషంగా ఉండాలన్నదే తన ఉద్దేశమని చెప్పారు. అమరావతిలోనూ అదే విధంగా ల్యాండ్ పూలింగ్ నిర్వహించామన్నారు. ప్రపంచలోనే అతిపెద్ద ల్యాండ్ పూలింగ్ అమరావతిదే అన్నారు. వరల్డ్ బ్యాంక్ దీనిని ఓ కేస్ స్టడీగా చూపిందని గుర్తు చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం తాను అమరావతిని నిర్మించాలని చూస్తే జగన్ విధ్వంసం సృష్టించారని చంద్రబాబు విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక విద్యార్థులు ఇక్కడి నుంచి వెళ్లిపోయారని ఆయన ఆవేదన చెందారు. జగన్ ప్రభుత్వం చేసిన అరాచక పనుల కారణంగా వరల్డ్ క్లాస్ క్యాపిటల్‌గా మారాల్సిన అమరావతి ఇప్పుడు దెబ్బతినిందన్న ఆయన.. అమరావతిలో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. ఇటీవల స్వర్గస్తులైన రామోజీరావు కూడా ఎంతో రీసెర్చ్ చేసి తనకు అమరావతి పేరును సూచించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. దీనికి కేబినెట్ నుంచి ప్రజల దాకా అందరి ఆమోదం లభించిందన్నారు. శంకుస్థాపన సమయంలో రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుంచి నీరు, మట్టిని, దేశంలోని ప్రతి పుణ్యక్షేత్రం నుంచి నీరు, మట్టిని తీసుకొచ్చామన్నారు. ప్రధాని మోదీ సాక్షిగా యమునా నీటిని, మట్టిని తెచ్చారని చెప్పారు. అమరావతికి ఫౌండేషన్ వేసింది ప్రధాని మోదీ అని, రాజధానికి సహకరిస్తామని అప్పుడు ఆయన మాట కూడా ఇచ్చారని చెబుతూ అమరావతికి పార్లమెంట్ సహకారం ఉంటుందని హామీ ఇచ్చినట్టు తెలిపారు. రాజధాని నిర్మాణానికి బ్యాంకులు ముందుకు వచ్చాయని, సింగపూర్ దేశం మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, ఆ దేశంతో ఎంవోయూ కూడా కుదుర్చుకున్న సంగతి బాబు చెప్పారు. సీడ్ క్యాపిటల్ ఏరియాతో పూర్తి వివరాలతో మాస్టర్ ప్లాన్ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. మొత్తం 9 నగరాలను అమరావతిలో ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి తాను సీఎంగా ఉన్నప్పుడు సైబరాబాద్‌ను నిర్మించానని, తొమ్మిదేళ్లలో సైబరాబాద్‌కు ఒక ఎకో సిస్టమ్‌ను తయారు చేశానని చెప్పుకొచ్చారు. హైటెక్ సిటీని డెవలప్ చేయటానికి 14 రోజుల పాటు అమెరికాలో ఉన్నానని గుర్తు చేసుకున్నారు. హైదరాబాద్‌లాగానే అమరావతిని కూడా వరల్డ్ క్లాస్ సిటీగా మారుస్తానని ధృడంగా చెప్పారు. వైసీపీ పాలనలో అమరావతి బ్రాండ్ ఇమేజ్ బాగా దెబ్బతిన్నదని, భవిష్యత్‌పై నమ్మకం ఏంటని ప్రశ్నలు ఎదురవుతున్నాయని చెప్పిన చంద్రబాబు అమరావతి బ్రాండ్ ఇమేజ్‌పై దృష్టి పెడతామన్నారు. రాధాని నిర్మాణంతో ఆదాయం పెరుగుతుందని, కృష్ణా, గోదావరి నదుల వల్ల అమరావతికి నీటి కష్టాలుండవని చెప్పారు.

# ఉప్పాడ తీర ప్రాంతాన్ని కాపాడుతా

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- తీర ప్రాంతంలోని గ్రామాలను పరిశీలించిన జనసేనాని



**విశ్వంభర, ఉప్పాడ:** కాకినాడ జిల్లా ఉప్పాడ తీరప్రాంతాన్ని కాపాడే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని పవన్ కల్యాణ్ అన్నారు. బుధవారం ఉప్పాడ తీర ప్రాం తంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. పవన్‌కు స్థానికులు, అధికారులు స్వాగతం పలికారు. మధ్యలో ఉన్న సూరప్ప తాగునీటి చెరువును కూడా సం దర్శించారు. నాబార్డు నిధులతో 22 ఎకరాల్లో నిర్మించిన ఈ ట్యాంకు ద్వారా యు. కొత్తపల్లి మండల పరిధిలోని 54 గ్రామాలకు అందిస్తున్నారు. ఉప్పాడలో కోతకు గురవుతున్న తీర ప్రాంతాన్ని పరిశీలించిన పవన్ కల్యాణ్‌కు వ్యూ పాయింట్ దగ్గర పలు అంశాలను అధికారులు వివరించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పవన్ కల్యాణ్ తిలకించారు. ఉప్పాడ నుంచి కాకినాడకు వెళ్లే రోడ్డు మార్గాన్ని విశాఖ తరహాలో సుందరంగా తీర్చిదిద్దాలనే ఆలోచన ఉందని పవన్ అధికారులకు తెలిపారు. అటవీశాఖ అధికారులు అక్కడి పరిస్థితులను పవన్ కల్యాణ్‌కు వివరించారు. ఇక హోప్ ఐలాండ్‌ను ఏ రకంగా అభివృద్ధి చేయాలనే అంశంపై కూడా పవన్ అధికారులతో చర్చించారు. వన్యసంపదకు నష్టం జరగకుండా అభివృద్ధి ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. ఉప్పాడలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న మత్స్యకార కుటుంబాలతో కూడా పవన్ మాట్లాడారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉప్పాడ తీర ప్రాంతంలో సముద్రపు కోతకు గురైన ప్రాంతాన్ని పరిశీలించేందుకు వెళ్తూ గ్రామ గ్రామాన ప్రజలను కలుస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. పిఠాపురం, నవకంద్రవాడ, వాకతిప్ప, యు.కొత్తపల్లి తదితర గ్రామాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇక సాయంత్రం ఉప్పాడ సెంటర్‌లో జరగబోయే వారాహి సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించనున్నారు. ఆ తరువాత ఆయన విజయవాడ బయల్దేరి వెళతారు. పవన్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే వర్మ, కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ఉప్పాడలో పర్యటించారు.



# ఢిల్లీ పర్యటనకు బయలుదేరిన చంద్రబాబు

### నేడు ప్రధానితో భేటీ

**విశ్వంభర, అమరావతి:** ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు నేడుప్రధాని నరేంద్రమోడీతో భేటీ కానున్నారు. ఉదయం 10.15 గంటలకు ఈ భేటీ జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక సాయం, ఇతర అంశాలను ప్రధానికి వివరించనున్నారు. ఆ తర్వాత మధ్యాహ్నం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలుస్తారు. ఆ తర్వాత కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అవుతారు. పోలవరం, అమరావతి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి నివేదిక ఇవ్వనున్నారు. చంద్రబాబు నిన్న సాయంత్రం ఢిల్లీ పర్యటనకు బయలుదేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర పునర్నిర్మాణానికి దోహదపడే అంశాలను కేంద్రం దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. రాష్ట్రాన్ని అగ్రస్థానానికి తీసుకు వెళ్తామనే ఉద్దేశంతోనే ప్రజలు తమ కూటమికి 164 సీట్లు ఇచ్చారన్నారు.

# జులై 8 నుంచి ఉచిత ఇసుక

- చంద్రబాబు కీలక నిర్ణయం
- మరో హామీ అమలుకు కూటమి ప్రభుత్వం రెడీ




**విశ్వంభర, అమరావతి:** జులై 8వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తీసుకురావాలని రాష్ట్ర ముఖ్యమంతి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు చర్యలు చేపట్టాలని మంత్రి కొల్లు రవీంద్రకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ల అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసి, ఇసుక లోడింగ్, రవాణా ఛార్జీలు నిర్ణయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. గత ఐదేళ్లలో ఇసుక పాలసీ వల్ల పేదలు తీవ్రంగా నష్టపోయారని, గృహనిర్మాణ రంగం కుదేలైందని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 2014- 2019 మధ్య కాలంలో రాష్ట్రంలో అమలులో ఉన్న ఇసుక విధానం, 2019–2024 మధ్య అమ్మకాల లాభ, నష్టాలపై అధికారులతో చంద్రబాబు చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అమ్మకాల పేరుతో భారీగా దోపిడి జరిగిందని చెబుతున్న కూటమి సర్కార్.. ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వం అధికారం చేపట్టితే ఉచిత ఇసుక విధానం అమలు చేస్తామని మేనిపెస్టోలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక పాలసీ ద్వారా పేదలకు ఉచితంగా ఇసుక అందించాలని నిర్ణయించుకున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఇసుక అమ్మకాల విధానంలో ఎవరు లబ్దిపొందారు అనే దానిపై ఆరా తీస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక పాలసీ వల్ల ధరలు పెంచడంతో పేదలు తీవ్రంగా నష్టపోయారని, దీంతో గృహ నిర్మాణ రంగం పూర్తిగా కుదేలయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చేందుకు తక్షణమే ఇసుక ధరలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా రీచ్‌లు, స్టాక్‌పాయింట్లు, డంప్‌ల పరిధిలో ఎంత ఇసుక అందుబాటులో ఉందని అధికారులను సీఎం ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 40 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు వెల్లడించారు.

# హార్దిక్ పాండ్యాదే అగ్రస్థానం

## ఐసీసీ ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపిన యువ ప్లేయర్



**విశ్వంభర, స్పోర్ట్స్:** టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో దుమ్మురేపాడు. టీ20 ప్రపంచకప్ 2024 విజయంతో ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. టీ20 ప్రపంచకప్ అనంతరం ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్ విడుదల చేయగా.. రెండు స్థానాలు మెరుగుపరుచుకున్న హార్దిక్ పాండ్యా.. శ్రీలంక ఆల్‌రౌండర్ వానిందు హసరంగాతో కలిసి టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. ఈ ఇద్దరూ 222 రేటింగ్ పాయింట్స్‌తో టాప్ ప్లేస్‌లో కొనసాగుతున్నారు. ఈ టీ20 ప్రపంచకప్‌లో మొత్తం 8 మ్యాచ్‌లు ఆడిన హార్దిక్ పాండ్యా 11 వికెట్లు తీయడంతో పాటు 144 పరుగులు చేశాడు. సౌతాఫ్రికాతో జరిగిన ఫైనల్లో మూడు వికెట్లు తీసి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతోనే హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండర్ల జాబితాలో అగ్రస్థానాన్ని కైవసం చేసుకున్నాడు. మార్కస్ స్టోయినిస్, సికిందర్ రాజా, షకీబ్ అల్ హసన్ టాప్-5లో కొనసాగుతున్నారు. మరే టీమిండియా ఆల్‌రౌండర్ కూడా టాప్-10లో చోటు దక్కించుకోలేకపోయారు. బౌలింగ్ విభాగంలో అక్షర్ పటేల్ ఒక స్థానాన్ని మెరుగుపరుచుకొని ఏడో స్థానంలో నిలవగా.. కుల్దీప్ యాదవ్ మూడు స్థానాలు మెరుగుపరుచుకొని 9వ ర్యాంక్ అందుకున్నాడు. ఈ టోర్నీలో 17 వికెట్లు తీసిన జస్‌ప్రీత్ బుమ్రా 12 స్థానాలను మెరుగుపరుచుకొని 12వ స్థానంలో నిలిచాడు. వరల్డ్ బెస్ట్ పేసర్ అయిన బుమ్రా గతేడాదిగా టీ20లకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. బ్యాటింగ్ విభాగంలో సూర్యకుమార్ యాదవ్ తన రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకోగా.. యశస్వి జైస్వాల్ ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు. సెమీఫైనల్, ఫైనల్లో సూర్య విఫలమవడంతో అగ్రస్థానాన్ని కోల్పోయాడు. ట్రావిస్ హెడ్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఇటీవల ఐసీసీ ప్రకటించిన టోర్నీ ఆఫ్ ది టీమ్‌లో భారత్ నుంచి ఆరుగురు ఆటగాళ్లు చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. సూర్యకుమార్ యాదవ్, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఐసీసీ టోర్నీ ఆఫ్ ది టీమ్‌లో చోటు దక్కించుకున్నారు.

# నేడు మెరైన్ డ్రైవ్ విజయోత్సవ ర్యాలీ

- టీమిండియా ప్లేయర్లతో మోడీ భేటీ
- విజయోత్సవం ర్యాలీ, ప్లేయర్లతో బ్రేక్‌ఫాస్ట్




**విశ్వంభర, స్పోర్ట్స్:** టీ20 ప్రపంచకప్ విజేత టీమిండియా ఎట్టకేలకు బార్బడోస్ నుంచి సొంత దేశానికి ప్రయాణమైంది. బీసీసీఐ ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో జట్టు భారత్‌లో రానున్నది. ఎయిర్ ఇండియా విమానం గురువారం ఉదయం ఆరు గంటలకు ఢిల్లీకి చేరుకుంటుందని బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా వెల్లడించారు. అనంతరం 11 గంటలకు రోహిత్ శర్మ నేతృత్వంలోని జట్టు ప్రధాని నరేంద్ర మోడీతో భేటీ అవుతుందని తెలిపారు. ఆ తర్వాత టీమిండియా బృందం ప్రత్యేక విమానంలో ముంబయికి బయలుదేరనున్నారు. ఈ సందర్భంగా విజయోత్సవం ర్యాలీ నిర్వహించనున్నారు. అలాగే, వాఖండే స్టేడియంలో బీసీసీఐ ప్రకటించిన రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ అందజేయనున్నట్లు రాజీవ్ శుక్లా తెలిపారు. బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. 'భారత జట్టును తిరిగి తీసుకువచ్చేందుకు బీసీసీఐ ప్రత్యేకంగా ఎయిర్ ఇండియా విమానాన్ని పంపింది. అదే విమానంలో అక్కడ చిక్కుకుపోయిన మీడియా ప్రతినిధులను కూడా తిరిగి తీసుకు వస్తాం. రేపు ఉదయం 6గంట లకు వారంతా ఢిల్లీకి చేరుకుంటారు. ప్రధానమంత్రి తన నివాసంలో ఉదయం 11 గంటలకు స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమం పూర్తయ్యాక ప్రత్యేక విమానంలో ముంబయికి బయలుదేరుతారు. నారిమన్ పాయింట్ నుంచి వాంఖడే స్టేడియం వరకు రోడ్ షో ఉంటుంది. జట్టు, కోచ్, సహాయక సిబ్బందిని సత్కరించి.. బీసీసీఐ ప్రకటించిన రూ.125కోట్ల పారితోషకం అందజేస్తాం' అన్నారు. బీసీసీఐ సెక్రెటరీ జైషా సైతం టీమిండియా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా వివరాలను వెల్లడించారు. 4న సాయంత్రం 5 గంటలకు మెరైన్ డ్రైవ్ విజయోత్సవ ర్యాలీ ఉంటుందని.. వాఖండే స్టేడియంలో జరుపుకునేందుకు రావాలని అభిమానులకు పిలుపునిచ్చారు.

# రోహిత్ వారసుడు ఎవరు!

- టీమిండియా కెప్టెన్ పగ్గాలు ఎవరికి దక్కేనో
- కెప్టెన్ రేసులో ముగ్గురు ప్లేయర్లు




**విశ్వంభర, స్పోర్ట్స్:** టీ20 ప్రపంచకప్ 2024 విజయంతో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టీ20లకు గుడ్‌బై చెప్పారు. వారి స్థానాల్లో సత్తా చాటేందుకు కుర్రాళ్లు సిద్ధంగా ఉన్నా.. జట్టును నడిపించే సారథి ఎవరా? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. వాస్తవానికి టీ20 ప్రపంచకప్ 2022 ముగిసిన వెంటనే టీ20 సారథ్య బాధ్యతలను స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు అప్పగించారు. రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా వన్డే ప్రపంచకప్‌కు సిద్ధమవ్వగా.. హార్దిక్ సారథ్యంలోని యంగ్ టీ20 టీ20 సిరీస్‌లు ఆడింది. కానీ వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో టీమిండియా ఓటమితో ఈ ప్రణాళిక అంతా తారుమారైంది. మరోవైపు హార్దిక్ పాండ్యా చీల మండ గాయంతో జట్టుకు దూరమయ్యాడు.

### కెప్టెన్ రేసులో ముగ్గురు ప్లేయర్లు

వన్డే ప్రపంచకప్ ముగిసిన వెంటనే టీ20 ప్రపంచకప్‌కు సన్నదమైన టీమిండియా.. హార్దిక్ పాండ్యా గైర్హాజరీతో రోహిత్ శర్మనే సారథిగా కొనసాగించింది. మరోవైపు హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలతో పాటు పేలవ ఫామ్‌తో టీ20 ప్రపంచకప్ ఆడటమే అనుమానంగా మారింది. కానీ అతను అన్నీ ప్రతికూలతలను ధాటి జట్టులోకి వచ్చాడు. బ్యాట్‌తో పాటు బంతితో అసాధారణ ప్రదృన కనబర్చి జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో హార్దిక్ పాండ్యా.. రోహిత్ వారసత్వాన్ని అందుకునేందుకు ముందు వరుసలో ఉన్నాడు. బీసీసీఐ సెక్రటరీ జై షా సైతం హార్దిక్ పాండ్యానే తమ తదుపరి కెప్టెన్ అనే సంకేతాలు కూడా ఇచ్చాడు. అయితే హార్దిక్ పాండ్యాకు పోటీగా ముగ్గురు ఆటగాళ్లు టీమిండియా కెప్టెన్సీ రేసులో ఉన్నారు. ఇందులో వరల్డ్ బెస్ట్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఒకరు కాగా.. స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ మరొకరు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ మూడోవాడు. టీ20 సారథ్య బాధ్యతలను అప్పగించేందుకు సెలెక్టర్లు ఈ ముగ్గురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. గతేడాది ఐర్లాండ్ పర్యటనలో బుమ్రా.. భారత జట్టును నడిపించగా.. సౌతాఫ్రికా పర్యటనలో సూర్యకుమార్ యాదవ్ భారత జట్టుకు సారథ్యం వహించాడు. శుభ్‌మన్ గిల్ అప్‌కమింగ్ జింబాబ్వే పర్యటనలో భారత జట్టును నడిపించబోతున్నాడు. మూడు ఫార్మాట్లలో కీలక పేసర్ అయిన జస్‌ప్రీత్ బుమ్రాకు కెప్టెన్సీ అదనపు ఒత్తిడిగా మారే అవకాశం ఉంది. అయితే ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అద్భుత ప్రదర్శన కనిపిస్తున్నాడు. రెండు ఫార్మాట్లలో ఆసీస్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టాడు. సూర్య, శుభ్‌మన్ గిల్‌లకు కెప్టెన్సీ చేసిన అనుభవం పెద్దగా లేదు.

# కెనడా ఓపెన్ టోర్నీ నుంచి తప్పుకున్న లక్ష్యసేన్



**విశ్వంభర, స్పోర్ట్స్:** పారిస్ ఒలింపిక్స్‌కు ముందు భారత స్టార్ షట్లర్ లక్ష్యసేన్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. మంగళవారం నుంచి ఈ టోర్నీ ప్రారంభమైంది. ఒలింపిక్స్‌కు సన్నద్ధమయ్యేందుకు అతను ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం లక్ష్యసేన్ ఫ్రాన్స్‌లో శిక్షణ పొందుతున్నాడు. గతేడాది కెనడా ఓపెన్ టైటిల్‌ను లక్ష్యసేన్ దక్కించుకున్నాడు. ఇదే అతని చివరి టైటిల్ కూడా. ఫ్రెంచ్ ఓపెన్, ఆల్ ఇంగ్లాండ్ ఓపెన్ టోర్నీలో సెమీస్‌కు చేరుకోవడం ద్వారా లక్ష్యసేన్ తన తొలి ఒలింపిక్స్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నాడు. లక్ష్యసేన్ తప్పుకోవడంతో కెనడా ఓపెన్ టోర్నీలో యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ భారత బృందాన్ని నడిపించనున్నాడు. తొలి రౌండ్‌లో అతను రాస్మస్ జెమ్కే(డెన్మార్క్)తో తలపడనున్నాడు. మరోవైపు, మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్-ట్రీసా జాలీ జోడీ బై పొందింది.




# స్వదేశీ 'ట్విట్టర్' కూ యాప్ మూత

**విశ్వంభర, బిజినెస్ :** ట్విటర్‌కు కు పోటీగా వచ్చిన భారతీయ స్టార్టప్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారంకూ మూతపడింది. భారత స్థానిక ప్రత్యామ్నాయంగా భావించిన కూ మూతపడిన విషయాన్ని ఆ కంపెనీ బుధవారం అధికారికంగా నివేదించింది. ఇప్పుడు లింక్డ్ఇన్‌లో పోస్ట్ ద్వారా కంపెనీ సహ వ్యవస్థాపకులు ధృవీకరించారు. మయాంక్ బిదవత్కా, సహ వ్యవస్థాపకుడు, కూ భాగస్వామ్యానికి సంబంధించిన చర్చలు విఫలమైన తర్వాత కంపెనీ మూసివేత నిర్ణయాన్ని ప్రకటించారు. మల్టీ లార్జర్ ఇంటర్నెట్ కంపెనీలు, మీడియా సంస్థలతో కూడా కూ కంపెనీ చర్చలు జరుపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మారిన ప్రాధాన్యతల కారణంగా కూ మూసివేతకు దారితీసిందని ఆయన తెలిపారు. ప్లాట్‌ఫారమ్ నిర్వహణకు నిధులు అవసరమని, నిధుల వృద్ధికి సంబంధించిన ప్రణాళికలను దెబ్బతీస్తుందని మయాంక్ బిదవత్కా అభిప్రాయపడ్డారు.

### 21 లక్షల యాక్టివ్ యూజర్లతో కూ యాప్ :

కోట్లాది మంది యాక్టివ్ నెలవారీ యూజర్లను కలిగిన కూ ప్లాట్‌ఫాం అప్పట్లో ట్విట్టర్‌కు గట్టి పోటీనిచ్చింది. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీతో పాటు పలువురు రాజకీయ నేతలు వంటి ఎందరో ప్రముఖులు కూ అకౌంట్లను క్రియేట్ చేసుకున్నారు. అయితే, ప్రస్తుతం కూ ప్లాట్ ఫారం రోజువారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య 21 లక్షలకు చేరింది. కంపెనీ నెలవారీ యాక్టివ్ యూజర్ల సంఖ్య ఇటీవలే ఒక కోటికి చేరుకుంది. ఈ ప్లాట్‌ఫారంపై 9 వేల మంది వీఐపీలకు అకౌంట్లు ఉన్నాయి. ఈ దేశీయ సోషల్ ప్లాట్‌ఫారంకు సపోర్టుగా అనేక మంది రాజకీయ నేతలు కూడా క్యాంపెయిన్ చేశారు. అప్పట్లో టెక్ బిలియనీర్ ఎలన్ మస్క్ భారత మార్కెట్లో 23 లక్షల కన్నా ఎక్కువ ట్విట్టర్ అకౌంట్లపై నిషేధం విధించారు. దాంతో అనేక మంది ప్రత్యామ్నాయంగా కూలో అకౌంట్లను తెరిచారు. ఢిల్లీ రైతు ఉద్యమం సమయంలో ఈ యాప్ ఎక్కువగా పాపులర్ అయింది.

### మూసివేతకు కారణాలివే :

2019లో ప్రారంభమైన ఈ సోషల్ ప్లాట్‌ఫారమ్ దేశీయ ట్విట్టర్‌గా పేరుగాంచింది. కూ అరంగేట్రం చేసినప్పటి నుంచి గత నాలుగు ఏళ్లుగా అద్భుతంగా ముందుకు సాగింది. ఈ యాప్‌ను బ్రెజిల్, నైజీరియా వంటి దేశాల్లో కూడా భారీగానే విస్తరించింది. యూజర్ బేస్ బాగానే ఉన్నప్పటికీ కంపెనీ ఆర్థికపరమైన సమస్యల్లో చిక్కుకుంది. కంపెనీలో అనేక మంది ఉద్యోగుల తొలగింపులు కూడా జరిగాయి. ఏప్రిల్ 2023 నుంచి వందలాది మంది ఉద్యోగులను తొలగించింది. కూ భాగస్వామ్య చర్చలు ముగిసిన తర్వాత కంపెనీ మూసివేత నిర్ణయాన్ని ప్రకటించింది. ఇతర టెక్ కంపెనీలు, మీడియా సంస్థలతో కూ కంపెనీ చర్చలు జరుపుతోంది. కూ సోషల్ ప్లాట్ ఫారం నిర్వహణకు నిధులు కొరత కారణంగా ప్లాట్‌ఫారం ముందుకు సాగలేని పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో కూ మూసివేయాలనే నిర్ణయం తీసుకున్నట్టుగా కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.

# త్వరలో రోడ్లపైకి 132 సీట్లతో పెద్ద బస్సు


## విమానంలో మాదిరిగా బస్ హోస్టెస్‌లు, ఫుడ్

**విశ్వంభర, బిజినెస్ :** భారత్‌లో కాలుష్యం అనేది అతిపెద్ద సమస్యగా మారింది. వ్యక్తిగత, ప్రజా రవాణాకు తీవ్రంగా ఆటంకం కలిగిస్తోంది. వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పర్యావరణ అనుకూలమైన కాలుష్య రహిత వనరుల వినియోగాన్ని ప్రోత్సహించడంపై ప్రధానంగా దృష్టిపెడుతోందని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ఎన్‌డీటీవి ఇన్‌ఫ్రాశక్తి అవార్డుల సందర్భంగా జరిగిన ప్రత్యేక సమావేశంలో మంత్రి నితిన్ గడ్కరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నాగ్‌పూర్‌లో 132-సీట్ల బస్సుతో కూడిన పైలట్ ప్రాజెక్ట్ రూపకల్పన జరుగుతోందని చెప్పారు. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఇందులో విమానం లాంటి సీటింగ్‌తో పాటు హెయిర్ హోస్టెస్ మాదిరిగా "బస్ హోస్టెస్" కూడా ఉంటారు. సాధారణ డీజిల్ బస్సుల కన్నా అత్యంత చౌకగా ఉన్నప్పటికీ కాలుష్య రహిత ఇంధన వనరులపైనే ఈ బస్సు నడుస్తుంది. భారత దిగుమతిదారుగా కాకుండా నికర ఇంధన ఎగుమతిదారుగా మారాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని గడ్కరీ స్పష్టం చేశారు.

### ఒక్క కిలోమీటరుకు ఎంత ఖర్చు వస్తుంది..?

"ఈ రోజు దేశంలో అత్యంత ముఖ్యమైన సమస్య కాలుష్యం. గాలి, నీరు, ధ్వని కారణంగా కాల్యుష వాతావరణం ఏర్పడుతుంది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య పరిస్థితి అత్యంత అగమ్యగోచరంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు దిగుమతి-ప్రత్యామ్నాయ, తక్కువ ఖర్చుతో కూడిన కాలుష్య రహిత, స్వదేశీ రవాణా పరిష్కారాలు అవసరం. మనకు ఎలక్ట్రిక్ వాహనాలు ఉన్నాయి. ఇప్పుడు, భారతీయ ఆయిల్ 300 ఇథనాల్ పంపులను ఏర్పాటు చేస్తోంది. ఆటోమొబైల్ కంపెనీలు ఫ్లెక్స్ వాహనాలను తీసుకువస్తున్నాయి. లీటరుకు రూ.120కి పెట్రోల్ నింపే బదులు వాహనంలో 60శాతం విద్యుత్, 40శాతం చొప్పున ఇథనాల్‌ను ఉపయోగించడం మంచిది. ఇథనాల్ వాడకంతో కాలుష్యాన్ని కూడా తగ్గిస్తుంది" అని మంత్రి పేర్కొన్నారు. మరో విషయం ఏమిటంటే.. ప్రజా రవాణా ఖర్చును తగ్గించడంపై ప్రభుత్వం దృష్టిసారిస్తోందని గడ్కరీ అన్నారు. డీజిల్ బస్సు ఒక కిలోమీటర్ నడపడానికి రూ.115 ఖర్చవుతుంది. అయితే, ఏసీ ఎలక్ట్రిక్ బస్సులు రూ.41, నాన్-ఏసీ బస్సులు రూ. 37 సబ్సిడీలతో నడుస్తాయి. సబ్సిడీలు లేకుండా ఇప్పుడు రూ. 50 నుంచి రూ.60 మధ్య ఉంటుంది. టిక్కెట్ ధరలను 15 నుంచి 20శాతం తగ్గించడంలో సాయపడుతుందని ఆయన అన్నారు. టాటాతో కలిసి నాగ్‌పూర్‌లో పైలట్ ప్రాజెక్ట్ చేస్తున్నామని చెప్పారు. చెక్ రిపబ్లిక్ వెళ్లిన సమయంలో వారి వద్ద మూడు బస్సుతో ఒక ట్రాలీ బస్సు ఉందన్నారు. మా పైలట్ ప్రాజెక్ట్ 132 మంది కూర్చునే విధంగా రింగ్ రోడ్‌లో 49 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని కేంద్రం మంత్రి గడ్కరీ చెప్పారు. 40 కిలోమీటర్ల తర్వాత బస్‌స్టాప్‌లో ఆగుతుంది. కేవలం 40 సెకన్లలో తదుపరి 40 కిలోమీటర్లకు ఛార్జ్ అవుతుంది. ఇందుకోసం కిలోమీటరుకు రూ.35 నుంచి 40 ఖర్చు అవుతుంది.





### గడ్కరీ ఇంకా ఏమన్నారంటే? :

"సీట్ల ముందు ల్యాప్‌టాప్ ఉంచడానికి ఎయిర్ కండిషనింగ్, సౌకర్యవంతమైన కుర్చీలు, స్థలం అవసరమని సూచించాను. ఎయిర్ హోస్టెస్‌ల మాదిరిగా ప్రజలకు పండ్లు, ప్యాక్డ్ ఫుడ్, పానీయాలు ఇవ్వడానికి బస్ హోస్టెస్‌లు ఉండాలి. నా లెక్క ఇది. సోలార్ పవర్‌ను ఉపయోగిస్తే బస్సు ధర 30శాతం తక్కువగా ఉంటుంది" అన్నారాయన. 50శాతం ఇథనాల్, 50శాతం సీఎన్‌జీని ఉపయోగించే నిర్మాణ సామగ్రిని జేసీబీ తయారు చేసింది. ఇథనాల్, మిథనాల్, సీఎన్‌జీతో పనిచేసే యంత్రాలపై ట్రాక్టర్ తయారీదారులు కూడా పనిచేస్తున్నారు. ఇది కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా రైతుల ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు దోహదపడుతుంది" కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

### 3 నెలల్లో జీపీఎస్ టోలింగ్ :

ప్రభుత్వం కొంతకాలంగా కసరత్తు చేస్తున్న జీపీఎస్ ఆధారిత టోలింగ్‌ను మూడు నెలల్లో 5వేల కిలోమీటర్ల రోడ్డుపై అమలు చేస్తామని కేంద్ర మంత్రి ప్రకటన చేశారు. "టెండర్లు సిద్ధంగా ఉన్నాయి. శాటిలైట్ ఆధారిత టోలింగ్ నిర్దిష్ట రహదారిపై ప్రయాణించిన కిలోమీటర్ల సంఖ్యకు మాత్రమే చెల్లించేలా చేస్తుంది. ఆ మొత్తం నేరుగా మీ బ్యాంక్ అకౌంట్ నుంచి డిబిట్ అవుతుంది. మీరు ఎక్కడా ఆగాల్సిన అవసరం లేదు. ఇది 5వేల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దేశంలో అన్ని చోట్లా అమలు చేస్తాం" అని ఆయన చెప్పారు. వ్యవసాయంలో "హరిత విప్లవం"మే తాను లక్ష్యంగా పెట్టుకున్నానని గడ్కరీ పేర్కొన్నారు. తన ప్రాజెక్టులకు నిధుల కొరత లేదని తద్వారా పెట్టుబడిదారులు క్యూ కడుతున్నారని తెలిపారు.

### స్టబుల్ నుంచి ఇథనాల్ :

ఇండియన్ ఆయిల్ స్టబుల్ నుంచి ఒక లక్ష లీటర్ల ఇథనాల్‌ను, అలాగే బయో బిటుమెన్‌ను ఉత్పత్తి చేసే ప్రాజెక్ట్‌ను ప్రారంభించిందని గడ్కరీ చెప్పారు. ఈ ప్రాజెక్ట్ దాదాపుగా పూర్తయిందని, 76వేల టన్నుల బయో ఏవియేషన్ ఇంధనాన్ని కూడా ఉత్పత్తి చేయనున్నట్లు ఆయన చెప్పారు. మరో ప్రాంతంలో ఢిల్లీలోని ఘాజీపూర్ పల్లపు ప్రదేశంలో అలాగే అహ్మదాబాద్‌లోని వ్యర్థాల పర్వత ఎత్తును ఏడు మీటర్ల మేర తగ్గించినట్లు గడ్కరీ చెప్పారు. మురుగునీటి కలుషిత నీటిని శుద్ధి చేసి విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్నారని తెలిపారు. సేంద్రీయ వ్యర్థాలను బయో సీఎన్‌జీ, బయో ఎల్ఎన్‌జి లేదా హైడ్రోజన్‌ను తయారు చేసేందుకు కూడా ఉపయోగించవచ్చు. డ్రోన్‌లు, రోప్‌వేలు కూడా ఏర్పాటు చేయాలనేది తమ దృష్టిలో ఉన్నాయని, మంత్రిత్వ శాఖకు ఆసక్తి కలిగించే మరో ప్రాంతం ఫ్యూనిక్యులర్ రైల్వేలు (నిటారుగా ఉండే కొండలపై ఉపయోగించే తాడుతో నడిచే రైళ్లు), ముఖ్యంగా ఉత్తరాఖండ్, హిమాచల్, లడఖ్ వంటి ప్రాంతాల్లోకి అందుబాటులోకి తీసుకు రానున్నట్టు చెప్పారు. ఇవన్నీ వాతావరణ కాలుష్యాన్ని తగ్గించడంలో సాయపడతాయని భావిస్తున్నామని మంత్రి గడ్కరీ పేర్కొన్నారు.



# బ్లాక్ కలర్ డ్రస్ లో మైండ్ బ్లాక్ చేస్తోన్న చందమామ

అందాల చందమామ కాజల్ అగర్వాల్.. ప్రస్తుతం రీఎంట్రీతో వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతుంది. తెలుగులో ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించిన కాజల్ అగర్వాల్. టాలీవుడ్ లో దాదాపు అందరు స్టార్ హీరోలతో సినిమాలు చేసింది. సీనియర్ హీరోల దగ్గర నుంచి యంగ్ హీరోల వరకు అందరికి జోడీగా నటించింది కాజల్ అగర్వాల్. తెలుగులోనే కాదు తమిళ్ లోనూ సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది ఈ చిన్నది. అక్కడ కూడా స్టార్ హీరోల సినిమాల్లో మెరిసింది. సీనియర్ హీరోల దగ్గర నుంచి యంగ్ హీరోల వరకు అందరికి జోడీగా నటించింది కాజల్ అగర్వాల్. తెలుగులోనే కాదు తమిళ్ లోనూ సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది ఈ చిన్నది. అక్కడ కూడా స్టార్ హీరోల సినిమాల్లో మెరిసింది. ఇక ఈ అమ్మడు పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కాజల్ అగర్వాల్ తిరిగి సినిమాల్లో బిజీగా మారింది. నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమాలో హీరోయిన్ గా చేసింది కాజల్. ఇక ఈ అమ్మడు పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కాజల్ అగర్వాల్ తిరిగి సినిమాల్లో బిజీగా మారింది. నటసింహం నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమాలో హీరోయిన్ గా చేసింది కాజల్. అలాగే సత్యభామ అనే లేడీ ఓరియెంటెడ్ సినిమాలోనూ నటించింది ఈ అమ్మడు. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇటీవలే ఈ సినిమా ఓటీటీలోకి వచ్చింది. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. అలాగే సత్య భామ అనే లేడీ ఓరియెంటెడ్ సినిమాలోనూ నటించింది ఈ అమ్మడు. ఈ సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇటీవలే ఈ సినిమా ఓటీటీలోకి వచ్చింది. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో ఈ చిన్నది చాలా యాక్టివ్ గా ఉంటుంది. పెళ్లైన తర్వాత కూడా ఈ అమ్మడు తన గ్లామర్ తో ఆకట్టుకుంది. రెగ్యులర్ గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తుంది. తాజాగా బ్లాక్ కలర్ డ్రస్ లో అదరగొట్టింది కాజల్.. ఈ ముద్దుగుమ్మ లేటెస్ట్ పిక్స్ పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. పెళ్లైన తర్వాత కూడా ఈ అమ్మడు తన గ్లామర్ తో ఆకట్టుకుంది. రెగ్యులర్ గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తుంది. తాజాగా బ్లాక్ కలర్ డ్రస్ లో అదరగొట్టింది కాజల్.. ఈ ముద్దుగుమ్మ లేటెస్ట్ పిక్స్ పై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

# వైల్డ్ ఫోటోగ్రాఫర్‌గా మారిన స్టార్ హీరోయిన్..

తొలి సినిమాతోనే తెలుగు కుర్రాళ్ల హృదయాలను దోచేసింది ఓ హీరోయిన్. అందం, అభినయంతోపాటు సంప్రదాయంగా కనిపించి యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. మొదటి మూవీతోనే భారీ విజయాన్ని అందుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ సినిమా తర్వాత తెలుగులో బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ అతి తక్కువ సమయంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. దశాబ్ద కాలంపాటు సినిమాల్లో అలరించిన ఆ తార ఇప్పటికీ సింగిల్. పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా లైఫ్ ఎంజాయ్ చేస్తుంది. చాలా కాలం సినిమాలకు దూరమై ఆ బ్యూటీ.. ఇప్పుడు ఫుల్ టైమ్ వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ గా సెటిల్ అయ్యింది. ఇంతకీ ఆ బ్యూటీ ఎవరో తెలుసా..? తనే హీరోయిన్ సదా. 2003లో నితిన్ హీరోగా పరిచయమైన జయం సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకుని ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకుంది. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం సదా వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీపై దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది. కొన్ని నెలలుగా సదా ఇన్ స్టాలో వైల్డ్ లైఫ్ ఫోటోగ్రఫీకి సంబంధించిన ఫోటోస్, వీడియోస్ కనిపిస్తున్నాయి. అడవిలో సింహాలు, పులులు, ఏనుగులు, పక్షులను అందంగా ఫోటోస్, వీడియోస్ తీస్తూ తన ఇన్ స్టాలో షేర్ చేసింది. సదా చేసిన పోస్టులకు భారీ సంఖ్యలో లైక్స్ వస్తున్నాయి. అందమైన అమ్మాయి పులులు, సింహాలను అంతే అందంగా కెమెరాలో బంధిస్తుందంటూ కామెంట్స్ చేస్తున్నారు నెటిజన్స్. ప్రస్తుతం నచ్చిన పని చేసుకుంటూ హ్యాపీగా ఉన్నానని.. తన ఫ్రీడమ్ ను పోగొట్టుకోవాలని లేదని.. నచ్చిన వ్యక్తి ఇప్పటివరకు దొరకలేదని.. అందుకే పెళ్లి అనే ఆలోచన రాలేదని గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.



# సరైన సమయంలో సహాయం చేసేవాడు దేవుడు..



సాధారణ డ్యాన్సర్ నుంచి డ్యాన్స్ మాస్టర్‌గా ఎదిగారు జానీ మాస్టర్. నిన్న ఆయన పుట్టిన రోజు. సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జానీ మాస్టర్ ని ఇంటికి పిలిచి మరీ స్పెషల్ గా బర్త్ డే విషెష్ చెప్పి బహుమతిని అందించారు. కాగా.. నేడు సరైన సమయంలో సహాయం చేసేవాడు దేవుడు అని జానీ మాస్టర్ చేసిన ట్వీట్ వైరల్‌గా మారింది. నా పుట్టినరోజు సందర్భంగా రామ్‌చరణ్ అన్న ఇంటికి పిలిచినపుడు వారికి నా మీదున్న ప్రేమకి చాలా సంతోషపడ్డా. అక్కడికి వెళ్ళాక మెగాస్టార్ చిరంజీవి గారి ఆశీర్వాదం తో పాటు చరణ్ అన్న ఉపాసన వదిన నాకు ఇచ్చిన మాటకి నా సంతోషం 1000 రెట్లు పెరిగింది. నేను ఇదివరకు అడిగిన సహాయాన్ని గుర్తుంచుకుని మా డ్యాన్సర్స్ యునియన్ టి.ఎఫ్.టి.టి.డి.ఎ లో 500+ కుటుంబాలకి హెల్త్ ఇన్సూరెన్స్ అందేలా వారు అండగా నిలబడతామన్నారు. అడిగిన సహాయాన్ని గుర్తుంచుకుని, ఇచ్చిన మాటకి విలువనిస్తూ, అన్ని కుటుంబాలని చేరదీయడం మామూలు విషయం కాదు. మా అందరి మనసులో కృతజ్ఞత భావం ఎల్ల కాలం ఉంటుంది. మా అందరి తరపు నుండి అన్న, వదినలకి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. మీలాంటి వారితో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. అని జానీ మాస్టర్ ట్వీట్ చేశారు.

# చంద్రబాబు రాముడు, పవన్ లక్ష్మణుడు

**పరుచూరి గోపాలకృష్ణ**

తాజాగా సీనియర్ రచయిత, నటుడు పరుచూరి గోపాలకృష్ణ పవన్ కళ్యాణ్ ని అభినందిస్తూ తన యూట్యూబ్ ఛానల్ పరుచూరి పలుకులులో ఓ స్పెషల్ వీడియో చేసారు. ఈ వీడియోలో పరుచూరి గోపాల కృష్ణ మాట్లాడుతూ.. పవన్ అప్పుడప్పుడు సడెన్ గా నవ్వుతాడు. ఆ నవ్వుకి చాలా అర్థాలు ఉంటాయి. చాలా సార్లు గమనించాను ఎప్పుడు నవ్వుతాడు, ఎందుకు అని. దాంట్లో చాలా లోతైన అర్థాలు ఉంటాయి. ఆయన్ని నేను అభిమానిస్తాను. కానీ ఆయన సినిమాలకు రాసే అదృష్టం మాకు రాలేదు. రాజకీయాల్లో నిలబడతాడా లేదా అని అందరూ విమర్శిస్తుంటే చరిత్ర సృష్టించారు. పవన్ కళ్యాణ్ ఇన్నాళ్లు మాట్లాడింది సినిమా డైలాగ్స్ కాదు. చాలా ఆలోచించి మాట్లాడారు, ఇప్పుడు అయన మాట్లాడిన దానికి తగ్గట్టు పని చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా ఎంతో హుందాగా, ఎంతో ఓపికగా, ఇచ్చిన వాగ్దానాలని నిలబెట్టాలని పని చేస్తున్నారు. చంద్రబాబు రాముడు అయితే పవన్ లక్ష్మణుడులాగా.. ఆయన కృష్ణుడు అయితే ఈయన అర్జునుడిగా ఉండాలి. ఇద్దరూ కలిసి పనిచేయాలి. పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తుంటే అలాగే చూస్తూ కూర్చున్నాను. ఎదిగేకొద్దీ ఒదిగే ఉంటాడు. పవన్ కళ్యాణ్ రాజకీయాల్లో ఇంకా ఎదగాలి అని అన్నారు. అలాగే సినీ పరిశ్రమ, పవన్ సినిమాల గురించి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ లాగే పవన్ కళ్యాణ్ కూడా సినిమాలు చేయాలి. ఎన్టీఆర్ గారు రాజకీయాల్లోకి వచ్చాక కూడా అప్పుడప్పుడు 10 రోజులు డేట్స్ ఇస్తూ సినిమాలు చేసేవారు. పవన్ కళ్యాణ్ కూడా అలా సినిమాలు చేయాలి. అలాగే సినీ పరిశ్రమలోని 24 క్రాఫ్ట్స్ అనేక ఇబ్బందులు పడుతున్నాయి. అందరి తరపున ఒక విన్నపం. 24 క్రాఫ్ట్స్ తో ఒకసారి మీరు, సినిమాటోగ్రఫీ మినిష్టర్ ఒక మీటింగ్ పెట్టి అందరి సమస్యలు విని మాకు, సినీ పరిశ్రమకు, రాష్ట్రానికి మంచి చేయాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.

# వెంకటేశ్ సినిమాలో ఇద్దరు హీరోయిన్లు!



టాలీవుడ్ సీనియర్ హీరో విక్టరీ వెంకటేష్ తన కొత్త చిత్రాన్ని ప్రారంభించారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఈ మూవీ రూపుదిద్దుకుంటోంది. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్2, ఎఫ్3 సినిమాలు మంచి విజయాలను అందుకున్నాయి. దీంతో తాజా చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. ఈ మూవీని శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజ్ నిర్మిస్తున్నారు. కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపుదిద్దుకోనున్నట్లు తెలుస్తోంది.పూజా కార్యక్రమాలతో ఈ సినిమా మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా ఫోటోలను పంచుకుంది. రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానున్నట్లు తెలియజేసింది. ఈ చిత్రంలో మీనాక్షి చౌదరితో పాటు ఐశ్వర్య రాజేష్‌నటిస్తున్నట్లు ఇప్పటికే చిత్ర బృందం తెలియజేసింది. వీరిద్దరి ఫస్ట్ లుక్‌లను అభిమానులతో పంచుకుంది.

# ఈ నాలుగు లక్షణాలే కడుపు క్యాన్సర్‌కు సంకేతాలు

**విశ్వంభర, ఫీచర్ :** నేటి కాలంలో ప్రజలలో క్యాన్సర్ వేగంగా పెరుగుతోంది. ఇది తీవ్రమైన వ్యాధి. ఇది ఎవరినైనా ప్రభావితం చేయవచ్చు. ఈ కారణంగానే ఈ వ్యాధి ప్రపంచ వ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఎన్నో రకాల క్యాన్సర్ కేసులు ఇప్పుడు బయటపడుతున్నాయి. ఒకప్పుడు కొన్ని మాత్రమే కొందరికే ప్రమాదకరంగా ఉండేవి. కానీ ఇప్పుడు ఎవరికైనా ఏ రకమైన క్యాన్సర్ అయినా వచ్చే అవకాశాలు ఉన్నాయి. క్యాన్సర్‌లో చాలా రకాలు ఉన్నాయి. అవి శరీరంలోని వివిధ భాగాలలో సంభవించవచ్చు. అందులో కడుపు క్యాన్సర్ ఒకటి. ఇది చాలా వేగంగా వచ్చే క్యాన్సర్. దీనిని అండాశయ క్యాన్సర్ అని కూడా అంటారు. ముందుగా గుర్తిస్తే అది మరింత దిగజారకుండా నిరోధించవచ్చు.

**కడుపు క్యాన్సర్ అంటే ఏమిటి?:**
సాధారణంగా మీ కడుపు లోపలి భాగంలో క్యాన్సర్ కణాలు ప్రారంభమైనప్పుడు కడుపు క్యాన్సర్ వస్తుంది. క్యాన్సర్లు పెరిగేకొద్దీ, అవి మీ కడుపు గోడలలోకి లోతుగా కదులుతాయి. అలాగే, ఇది కడుపు అన్నవాహిక లేదా కడుపుతో కలిసే ప్రాంతాన్ని ప్రభావితం చేస్తుంది.

**కడుపు క్యాన్సర్ లక్షణాలు:**
నిపుణుల అభిప్రాయం ప్రకారం, కడుపు క్యాన్సర్ యొక్క సాధారణ లక్షణాలు అకస్మాత్తుగా బరువు తగ్గడం మరియు కడుపు నొప్పి. కానీ, ఇది తరచుగా ప్రారంభ దశలో కనిపించదు. అలాగే, ఈ క్యాన్సర్ ముఖంపై కనిపించే చర్మ సమస్యలతో కూడా సంబంధం కలిగి ఉంటుంది. ఈ వ్యాధి యొక్క ప్రారంభ దశలలో ఇది ఒకటి. అలాగే, దాని ప్రధాన లక్షణాలలో కొన్నిక్రిందివి ఉన్నాయి..

**వాంతి రక్తం:** మీరు రక్తాన్ని వాంతి చేసుకుంటే,



దానిని ఎప్పుడూ విస్మరించవద్దు. అలాగే కొన్నిసార్లు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు కూడా రక్తం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది.

**జీర్ణ సమస్య:** కడుపు క్యాన్సర్ అనేక లక్షణాలను కలిగి ఉంటుంది మరియు వాటిలో ఒకటి జీర్ణ సమస్య. అవును మీరు తిన్న ఆహారం సరిగా జీర్ణం కాకపోతే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది. లేకపోతే, క్లిష్ట పరిస్థితులను నిర్వహించడం చాలా కష్టం.

**గొంతు నొప్పి:** కడుపు క్యాన్సర్ లక్షణాలలో గొంతు నొప్పి ఒకటి. కాబట్టి ఈ తరహా సమస్యలు ఎదురైతే ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని, పరిస్థితి విషమిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం మంచిది.


**నల్లటి మలం:** కడుపు క్యాన్సర్ లక్షణాలలో నల్లటి మలం ఒకటిగా పరిగణించబడుతుంది. కాబట్టి, ఈ పద్ధతి మీకు ఎప్పుడైనా జరిగితే, ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించండి మరియు సమస్యను పరిష్కరించండి.

# మగవారికే ఎందుకు బట్టతల వస్తుంది?

**విశ్వంభర, ఫీచర్ :** అబ్బాయిలకు ఉండే కామన్ ఫియర్.. వామ్మో జుట్టుంతా ఊడిపోతుంది.. త్వరలో బట్టతల వచ్చేస్తుందా ఏంటి..అని. అవును ఈ మధ్య మరీ 25 ఏళ్లకే చాలా మందికి బట్టతల వచ్చేస్తుంది. ఒక్కసారి ముందున్న జుట్టు పోయిందా.. మీ అందం అంతా గంగాపాలే.. ఎంత తెల్లగా ఉన్నా సరే అంకుల్‌గానే కనిపిస్తారు..? అసలు బట్టతల అబ్బాయిలకే ఎందుకు ఎక్కువగా వస్తుంది..?

మగవారిలో బట్టతల ఎక్కువగా కనిపిస్తుంది. అయినప్పటికీ, పోషకాహార లోపం మరియు ఒత్తిడి కారణంగా కూడా స్త్రీలు జుట్టు రాలడాన్ని ఎదుర్కొంటారు. వయసు పెరిగే కొద్దీ సమస్య పెరుగుతుంది మరియు స్త్రీలు జుట్టు పల్చబడవచ్చు కానీ బట్టతల రాకపోవచ్చు. అదే సమయంలో, ఈ సమస్య పురుషులలో చాలా సాధారణం. మగవారిలో వయసు పెరిగే కొద్దీ జుట్టు రాలడం, ఆ తర్వాత బట్టతల రావడం మీరు గమనించి ఉండవచ్చు.

**హార్మోన్లలో మార్పులు:** నిజానికి పురుషుల్లో వెంట్రుకలు పెరగడానికి, రాలడానికి కారణం హార్మోన్లలో వచ్చే మార్పుల వల్లే మహిళల్లో కూడా ఈ మార్పు కనిపిస్తోందని పరిశోధకులు తెలిపారు. శరీరంపై జుట్టు పెరుగుదల మరియు రాలడం రెండూ హార్మోన్లపై ఆధారపడి ఉంటాయి. స్త్రీలు మరియు



**టెస్టోస్టెరాన్ మగ బట్టతలకి కారణమవుతుంది:** టెస్టోస్టెరాన్ అనే హార్మోన్ మగవారిలో కనిపిస్తుంది మరియు ఈ హార్మోన్ పురుషులలో బట్టతలకి ప్రధాన కారణం. ఈ హార్మోన్ మహిళల్లో కనిపించనప్పటికీ, పోషకాహార లోపం వల్ల స్త్రీలలో జుట్టు రాలిపోవచ్చు. పరిశోధకుల ప్రకారం, కొన్ని ఎంజైమ్‌లు టెస్టోస్టెరాన్‌ను డైహైడ్రోటెస్టోస్టెరాన్‌గా మారుస్తాయి మరియు డైహైడ్రోటెస్టోస్టెరాన్ జుట్టును సన్నగా మరియు బలహీనంగా చేస్తుంది.

**స్త్రీలకు బట్టతల రాకపోవడానికి కారణం ఇదే:** మహిళల్లో టెస్టోస్టెరాన్ పరిమాణం తగ్గుతుంది మరియు దానితో పాటు ఈస్ట్రోజెన్ అనే హార్మోన్ కూడా స్రవిస్తుంది. అందువల్ల, టెస్టోస్టెరాన్ డైహైడ్రోటెస్టోస్టెరాన్‌గా మారడం మహిళల్లో తక్కువగా ఉంటుంది. కొన్నిసార్లు ఈ ప్రక్రియ గర్భధారణ సమయంలో లేదా రుతువిరతి సమయంలో వేగవంతం చేయబడుతుంది మరియు ఈ సమయంలో మహిళలు జుట్టును కోల్పోవడం ప్రారంభించవచ్చు.

**కొంతమందికి వారసత్వంగా వస్తుంది:** దురదృష్టవశాత్తు కొంతమందికి చాలా చిన్న వయస్సులోనే బట్టతల వస్తుంది. ఇది వారికి వారసత్వంగా వచ్చిన ఎంజైమ్‌లు మరియు వివిధ రకాల చర్మాల వల్ల కావచ్చు. కొంతమందిలో ఇది అదనపు ఎంజైమ్‌లకు ప్రభావవంతంగా ఉంటుంది. అందుకే కొంతమందికి ఈ సమస్య వారసత్వంగా వస్తుంది.

# అధిక రక్తపోటును నియంత్రించడానికి నివారించాల్సిన ఆహారాలు..

**విశ్వంభర, ఫీచర్ :** అధిక రక్తపోటుతో నేడు చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. అధిక రక్తపోటు కారణంగా చాలా మంది గుండెపోటు, పక్షవాతం వంటి అనేక సమస్యలతో బాధపడుతున్నారు. ఒత్తిడి, అధిక ఉప్పు వినియోగం, ఊబకాయం, ధూమపానం మరియు మద్యపానం రక్తపోటును పెంచుతాయి. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. అధిక రక్తపోటు ఉన్నవారు ఆహారం నుండి దూరంగా ఉండవలసిన కొన్ని ఆహారాలను తెలుసుకుందాం.

**1. వైట్ రైస్**
కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే వైట్ రైస్ ఎక్కువగా తినడం వల్ల రక్తపోటు పెరుగుతుంది మరియు టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. బరువు తగ్గడానికి తెల్ల బియ్యం వినియోగాన్ని తగ్గించండి.

**2. పాస్తా**
పాస్తా తినడం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ మరియు అధిక రక్తపోటు కూడా వస్తుంది. కాబట్టి మీ ఆహారంలో పాస్తాను నివారించండి.

**3. చక్కెర**
చక్కెర ఆహారాలు మరియు చక్కెర పానీయాలను పరిమితం చేయడం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

**4. ఉప్పు**
అధిక రక్తపోటు ఉన్నవారు ఉప్పు ఎక్కువగా తినకూడదు. మీ ఉప్పును రోజుకు ఆరు గ్రాముల కంటే తక్కువగా ఉండేలా జాగ్రత్త వహించండి. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

**5. ప్రాసెస్ చేసిన ఆహారాలు**
ప్రాసెస్ చేసిన మాంసం, మటన్ మరియు గొడ్డు మాంసం వంటి ఎర్ర మాంసం, వేయించిన మరియు వేయించిన ఆహారాలు మొదలైన వాటికి దూరంగా ఉండండి.

**6. జంక్ ఫుడ్**
జంక్ ఫుడ్ మానేయడం కూడా రక్తపోటు నియంత్రణకు మంచిది. నిశ్చల జీవనశైలి, పెరిగిన వయస్సు, ఒత్తిడి, కుటుంబ చరిత్ర, సిగరెట్ ధూమపానం, అధిక బరువు, అధిక ఉప్పు ఆహారం మొదలైన అనేక అంశాలు మీకు రక్తపోటు ప్రమాదాన్ని కలిగించే అనేక అంశాలు ఉన్నాయి. అంతేకాకుండా, కొన్ని వ్యాధులు మధుమేహం వంటి అధిక రక్తపోటుకు కూడా దారితీయవచ్చు. కాబట్టి లైఫ్‌స్టైల్‌ను సరిచేయడం ముఖ్యం. మీ జీవనశైలి సక్రమంగా ఉంటే ఇలాంటి వ్యాధులు దరిచేరవు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com